RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake Printing of Daily News Papers



13 నవంబర్ 2024 బుధవారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:139

## అభివృద్ధి - సంక్షేమం రెండింటినీ సమతుల్యం చేసుకుంటాం రేవంత్ రెడ్డి



అభివృద్ధి - సంక్షేమం రెండింటినీ సమతుల్యం చేసుకుంటూ తెలంగాణలో సుపరిపాలన అందిస్తున్నాం. తెలంగాణ అభివృద్ధిపై మాకొక స్పష్టమైన విజన్ ఉంది. ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్డు, మూసీ పునరుజ్జీవం, రేడియల్ రోడ్స్.. వంటి లక్ష్యాలను నిర్దేశించుకున్నాం. ఇప్పుడు మా నినాదం రైజింగ్ తెలంగాణ. చైనా ప్లస్ వన్ కంట్రీకి సరైన మార్గంగా చైనా ప్లస్ తెలంగాణ చూపిస్తున్నాం…" ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు.

ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నిర్వహించే ఎడీడీఏ కార్యక్రమంలో భాగంగా రేవంత్‌రెడ్డి రైస్, ఎ గేమ్ చెంజర్ ఆఫ్ తెలంగాణా పేరుతో ఇండియన్ ఎక్స్ ప్రెస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ గోయంకా , డిప్యూటీ ఎడిటర్ లిజ్ మ్యాథ్యూ ముఖ్యమంత్రి తో దాదాపు 2 గంటల పాటు ప్రత్యేక ఇంటర్వ్యూ నిర్వహించారు.

కార్యక్రమంలో దేశ రాజకీయాలు, నియోజకవర్గాల పునర్విభజన, కేంద్ర రాష్ట్ర సంబంధాల్లో దక్షిణాది రాష్ట్రాలకు ఎదురవుతున్న పరిస్థితులు, తెలంగాణ ఎజెండా, రాష్ట్ర సమతుల అభివృద్ధి, ప్రభుత్వ లక్ష్యాలు, భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్ల వంటి అనేక అంశాలపై ముఖ్యమంత్రి స్పష్టంగా వివరించారు.

నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలంటే ఆ ప్రక్రియకు ప్రాతిపదిక ఏంటన్నది ముందు నిర్ధేశించాలి. దానిపై చర్చ జరగాలి. ప్రాతిపదిక నిర్ణయించిన తర్వాత ప్రక్రియ చేపట్టాలి. లేదంటే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోవడమే కాకుండా ఉత్తరాది, దక్షిణాది అన్న వాదన తెరమీదకు వచ్చే ప్రమాదం ఉంటుంది.

తెలంగాణలో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించడం. సుపరిపాలన అందించడం మా విధానం.

తెలంగాణలో చేపట్టిన కులగణన గేమ్ చేంజర్ కాబోతోంది. సంక్షేమ ఫలాలు అసలైన అర్హులైన పేదలకు చేరాలంటే ప్రభుత్వం వద్ద సరైన గణాంకాలు ఉండాలి. అసలు గణాంకాలు లేకుంటే అసలైన అర్హులకు న్యాయం చేయలేం. అందుకే కులగణన చేపట్టాం. ఒక మైలురాయిగా మిగులుతుంది.

దేశవ్యాప్తంగా కూడా ఓబీసీ గణాంకాలు తేలాల్సిన అవసరం ఉంది. ఆ ప్రాతిపదికగా రిజర్వేషన్లు అమలు జరగాలి. జనాభా లెక్కల సందర్భంగానే కేంద్రమే ముందుకొచ్చి ఓబీసీ గణాంకాలను కూడా సేకరించాలి. ఓబీసీ గణాంకాలు సేకరించడంలో కేంద్ర ప్రభుత్వానికి ఉన్న అభ్యంతరమేంటి.

ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలను విస్మరిస్తున్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చేవారిని గుజరాత్ కు మళ్లిస్తున్నారు.

సెమీకండక్టర్ పరిశ్రమ అందుకు ఉదాహరణ. గుజరాత్ కు ఇవ్వడానికి మాకు అభ్యంతరం లేదు. కానీ గుజరాత్ ప్రధానమంత్రి కాదు. దేశ ప్రధానమంత్రి ఒక జడ్జిలా ఉండాలి. ఆటలో రిఫరీ ఒక జట్టు తరఫున ఆడకూడదు. ఒకరి తరఫున వకాల్తా పుచ్చుకోవద్దు. ఇలాంటి పరిణామాలు దేశానికి మంచిది కాదు.

## అధికారులపై దాడి చేస్తే నోరుమెదపని వారు.. అరెస్టులు చేస్తే ఎలా ఖండిస్తారు

### లగచర్ల దాడిపై సమగ్ర దర్యాప్తు చేయండి
### దాడికి పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి
### డీజీపీని కోరిన తెలంగాణ ఉద్యోగుల జేఏసీ

వార్త 2 లో

## అందుకే బీఆర్ఎస్ పార్టీని ప్రజలు గద్దెదించారు :: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గారు



రాష్ట్రంలో గడిచిన పదేళ్లలో పాపపు పరిపాలన చేసినందుకే బీఆర్ఎస్ పార్టీని ప్రజలు గద్దెదించారని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ గారు స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి హరీష్ రావు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.

ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ గారు మాట్లాడుతూ రాజన్నను దర్శించుకున్న మాజీ మంత్రి హరీష్ రావు తమపై, సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.ఆయన మామ కేసీఆర్ ఆలయానికి ఏటా రూ.100 కోట్లు ఇస్తానని చెప్పి మాట తప్పినందుకు క్షమాపణలు చెప్పాలన్నారు.

కానీ తాము చెప్పకుండా రూ.50 కోట్లు కేటాయించినందుకు అభినందనలు తెలపాలన్నారు.బీఆర్ఎస్ పార్టీ, సీఎం కేసీఆర్ పాపం చేయడంతోనే గద్దె దించారని అన్నారు.

ఏ ఒక్కరి కృషితోనో తెలంగాణ రాలేదని, సోనియాగాంధీ ఇవ్వడం, ఉద్యమకారుల పోరాట ఫలితంగానే సాధ్యమైందన్నారు.కానీ పదవులు అనుభవించింది మాత్రం ఆ నలుగురేనని ఎద్దేవా చేశారు.

తెలంగాణ ఆవిర్భవించిన నాడు రాష్ట్రంలో రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్ ఉంటే తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో 7 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపించారు.ఒక్కో రంగాన్ని గాడిన పెడుతూ ముందుకు వెళ్తున్నామని అన్నారు.

బీఆర్ఎస్ పాలనలో ఏనాడైనా 1వ తేదీన జీతాలు ఇచ్చారా అని, ఒక్క రేషన్ కార్డయినా మంజూరు చేశారా అని ప్రశ్నించారు.

తనను ఓడించేందుకు 2018లో హరీష్ రావు రూ.216 కోట్లతో కలికోట సూరమ్మ ప్రాజెక్టు మొదలుపెట్టి దసరాకి నీళ్లు ఇస్తామని హామీ ఇచ్చాడని, ఇప్పటికీ 5 దసరాలు పోయాయని ఎద్దేవా చేశారు.

తమ ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే రూ.323 కోట్లతో పనులు ప్రారంభించినట్టు చెప్పారు.

గురుకులాల్లోని విద్యార్థులకు డైట్, కాస్మొటిక్ చార్జీలు 200 శాతం పెంచి వారానికి రెండు రోజులు చికెన్ పెడుతూ నాణ్యమైన భోజనం అందిస్తున్నామన్నారు.

వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెలిచేది కాంగ్రెస్ పార్టీయేనని, బీఆర్ఎస్ లో మిగిలేది ఆ నలుగురేనని అన్నారు.

## సభలో ప్రతిపక్షం లేదు.. మనకేం అని నిర్లక్ష్యంగా ఉండొద్దు

### వాళ్లకు బాధ్యత లేదు కానీ.. మనకు బాధ్యత ఉంది
### కూటమి ఎమ్మెల్యేలకు సూచించిన ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు



అమరావతి నవంబర్ 12;సభలో ప్రతిపక్షం లేదు కదా.. మనకేం ఉందని నిర్లక్ష్యంగా ఉండొద్దని కూటమి ఎమ్మెల్యేలకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. వాళ్లకు బాధ్యత లేదు కానీ.. మనకు ఉందని అన్నారు. అసెంబ్లీ సమావేశాలు, బడ్జెట్‌పై నిర్వహించిన వర్క్‌షాప్‌లో చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రజలకు జవాబుదారీగా పనిచేద్దామని సూచించారు.ఎమ్మెల్యేలకు సబ్జెక్ట్ చేర్చుకోవాలనే ఆసక్తి తగ్గిపోతుందని చంద్రబాబు అన్నారు. ఎమ్మెల్యేలు నిరంతరం నేర్చుకోవాలని, తెలుసుకోవాలని సూచించారు. బడ్జెట్ సమావేశాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని తెలిపారు. ప్రభుత్వం తెచ్చే బిల్లులు, పాలసీలపై అధ్యయనం చేయాలన్నారు. రాష్ట్రంతో పాటు కేంద్ర బడ్జెట్‌లోనూ నిధుల కేటాయింపులపై ఎమ్మెల్యేలు స్టడీ చేయాలని సూచించారు. పబ్లిక్ గవర్నెన్స్‌లో ఎమ్మెల్యేల భాగస్వామ్యం ఉండాలని చెప్పారు. విజన్ 2047పై అందరి అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు. పనిచేయాలనే ఆసక్తి ఉంటేనే ఏదైనా సాధ్యమవుతుందని తెలిపారు.ప్రజలకు ఏం అవసరం.. మనం ఏం చేశామనేది చెప్పడానికి అసెంబ్లీ ఒక వేదిక అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అసెంబ్లీలో తమ ప్రతినిధి మాట్లాడుతున్నారని ప్రజలు గమనిస్తూనే ఉంటారని తెలిపారు. అలాంటప్పుడు బూతులు మాట్లాడితే ప్రజలు స్వాగతించరని చెప్పారు.

## టీజీపీఎస్సీ చైర్మన్ నియమానికి నోటిఫికేషన్

హైదరాబాద్:నవంబర్ 12తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. నవంబర్ 20వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది.ప్రస్తుత చైర్మన్ మహేందర్ రెడ్డి పదవీ కాలం డిసెంబర్ 3వ తేదీతో ముగిసిపోను న్న నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ నోటిఫికేషన్ విడుదల చేసింది.తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఇప్పటి వరకు ఘంట చక్రపాణి, బి జనార్ధన్ రెడ్డిటీజీపీఎస్సీ పూర్తి స్థాయి చైర్మన్లుగా పని చేశారు. మధ్యలో డి కృష్ణా రెడ్డి, ప్రొ సాయిలు యాక్టింగ్ చైర్మన్లుగా కొనసాగారు.

## వ్యవసాయ యాంత్రీకరణ పథక పునరుద్ధరణకు కసరత్తు

### జిల్లా స్థాయిలో వ్యవసాయ యాంత్రీకరణ ప్రదర్శనలకు ఆదేశాలు



హైదరాబాద్మంగళవారం నాడు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, త్వరలో వ్యవసాయ యాంత్రికరణ పథకాన్ని పునరుద్దరించడానికి కావాల్సిన నిధులు, పథక అమలు తీరుతెన్నులపై వ్యవసాయ కార్యదర్శి రఘునందన రావు తో, వ్యవసాయ డైరెక్టర్ గోపి తో మరియు సహకార సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.

మంత్రి ఆదేశాలతో ఈ యాసంగి నుండి రైతులకు అవసరమైన పనిముట్లను, యంత్రాలను, సబ్సిడీపై సరఫరా చేయడానికి, ప్రణాళిక సిద్దంచేసామని అందులో భాగంగా జిల్లాల వారీ ఎక్కువ డిమాండ్ ఉన్న పనిముట్లను, యంత్ర పరికరాల జాబితా సిద్ధం చేసినట్లు డైరెక్టర్, వ్యవసాయశాఖ గోపి తెలియజేశారు.

గత 5 సంవత్సరాల నుండి, వ్యవసాయ యాంత్రికరణ పథకానికి, కేంద్ర ప్రభుత్వము తమ వాటా నిధులు విడుదల చేస్తున్నప్పటికి రాష్ట్ర ప్రభుత్వము తమ వాటా నిధులు విడుదల చేయకపోవడంతో, కేంద్రం తమ వాటా నిధులను విడుదల చేయడం ఆపి, గతంలో ఇచ్చిన నిధులను కూడా తిరిగి తీసుకోవడం ద్వారా రాష్ట్ర రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లిందనీ మంత్రి అన్నారు.

అంతేగాక గత 5 సంవత్సరాల నుంచి రైతులకు దీనికి సంబంధించి ఎటువంటి అవగాహన లేనందున, ఎగ్జిబిషన్లను ప్రభావవంతంగా నిర్వహించాలని, ఎగ్జిబిషన్ ఏర్పాటుకు కావాల్సిన నిధులు కూడా సమకూర్చుకోవాలని, అలాగే సంబంధిత మంత్రి, స్థానిక ప్రజా ప్రతినిధులతో చర్చించి రైతులందరికీ సౌకర్యంగా ఉండేలా జిల్లా స్థాయిలో స్థలాన్ని ఎంపిక చేసుకోవాల్సిందిగా సూచించారు.

## జగన్ అక్రమాస్తుల కేసులో కీలక పరిణామం.. విచారణ మరో ధర్మాసనానికి బదిలీ



అమరావతి నవంబర్ 12 వైసీపీ అధ్యక్షుడు , మాజీ సీఎం వైఎస్ జగన్ అక్రమాస్తుల కేసులో సుప్రీంకోర్టులో కీలక పరిణామం చోటు చేసుకుంది. అక్రమాస్తుల కేసులో జగన్ బెయిల్ రద్దు చేయాలని, కేసు విచారణను హైదరాబాద్ నుంచి మరో రాష్ట్రానికి మార్చాలని కోరుతూ మాజీ ఎంపీ, ప్రస్తుత ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు సుప్రీంకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు.ఈ పిటిషన్లపై సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్ ధర్మాసనం విచారణ జరిపింది. విచారణ ప్రారంభం కాగానే పిటిషన్ ఏపీకి చెందిందని జగన్ తరుపు న్యాయవాది బెంచ్‌కు చెప్పారు. మారిన పరిస్థితుల్లో కౌంటర్ దాఖలుకు కొంత సమయం కావాలని సీబీఐ తరుపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోరారు.అయితే స్పందించిన జస్టిస్ సంజయ్‌కుమార్ 'నాట్ బీఫోర్ మీ' అనడంతో పిటిషన్లు మరో ధర్మాసనానికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా కేసును జస్టిస్ అభయ్ ఎస్ ఓకా నేతృత్వం వహించే ధర్మాసనం ముందుకు పంపాలని ఆదేశాలు జారీ చేస్తూ డిసెంబర్ 2న విచారణకు పంపాలని రిజిస్ట్రీకి ఆదేశించారు.

ప్రజాబలం

13 నవంబర్ 2024 బుధవారం

# ప్రజారంజక బడ్జెట్!

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వంపై అనేక ఆశలు, ఆకాంక్షలు ఉన్నాయి. ప్రభుత్వం పలు అంశాలను పరిష్కరించాల్సి ఉంది. ప్రాజెక్టుల నిర్మాణంతోపాటు.. ఉపాధి, ఉద్యోగ కల్పన, పారిశ్రామికంగా రాష్ట్రాన్ని ముందుకు నడిపించడం వంటివి కీలకంగా మారాయి. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై అధ్యయనానికే 4 నెలలకు పైగా సమయం పట్టింది. అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రంలో అసలు ఎంత ఆర్థిక విధ్వంసం జరిగిందో తెలుసుకునేందుకు ప్రభుత్వం మొదటగా ప్రాధాన్యం ఇచ్చింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై శ్వేతపత్రం వెలువరించింది. ఈ పరిస్థితుల వల్లే పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు కూటమి ప్రభుత్వానికి ఇంత సమయం పట్టింది. జులైలో కొత్త ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ సమర్పించాల్సి ఉన్నా ఆర్థిక పరిస్థితులపై అవగాహన, కోసం ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్‌ను ఇన్నాళ్లు ప్రవేశపెట్టింది. అయితే ప్రస్తుతం పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నా ఇక మిగిలింది 4 నెలల వ్యవధి మాత్రమే. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థిక మంత్రి 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.2,94,427.25 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ అంచనాలను రూపొందించింది. ఇందులో రెవెన్యూ వ్యయం అంచనా రూ.25,916.99 కోట్లుగా పేర్కొంది. అలాగే మూలధన వ్యయం అంచనా రూ.32,712.84 కోట్లు, ఇదే కాలానికి రెవెన్యూ లోటు 34,743.38 కోట్లు, ద్రవ్యలోటు 68,742.65 కోట్లుగా ప్రతిపాదిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర స్థూల దేశీయ ఉత్పత్తిలో రెవెన్యూ లోటు 4.19 శాతంగానూ, ద్రవ్యలోటు 2.12 శాతంగానూ ఉండవచ్చు. ఈ బడ్జెట్ సంక్షేమానికి సముచిత స్థానం ఇచ్చింది. సూపర్ సిక్స్ పథకాలు అమలు పరిచేందుకు తగ్గట్టుగానే పథకాలకు బడ్జెట్‌లో నిధులను కేటాయించింది. అలాగే అభివృద్ధి పనులకు సైతం పెద్దపీట వేసింది. రాష్ట్రంలో ప్రధానంగా పోలవరం, అమరావతి పనులు వేగం అందుకోనున్నాయి. రోడ్ల నిర్మాణం, మరమ్మతులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. పంచాయతీరాజ్ రోడ్లతో పాటు ఆ శాఖ పరిధిలోని పనులపై దృష్టి సారించింది. విద్య, ఆరోగ్య పథకాలతో పాటు సాగునీటి ప్రాజెక్టులకూ బడ్జెట్లో సముచిత స్థాయిలో నిధులను కేటాయించింది.
2024-25 పూర్తిస్థాయి బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు జరిపింది. నైపుణ్యాభివృద్ధి మౌలిక సదుపాయాల రూపకల్పన గ్రామీణ పట్టణాభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయం, రైతు కేంద్రాలు, మద్దతు ధర యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖ- అభివృద్ధికి రూ.322 కోట్లు పోలీసు శాఖ- రూ. 8,495 కోట్లు, పర్యావరణ, అటవీ, శాస్త్ర, సాంకేతిక శాఖ - రూ. 687 కోట్లు, రవాణా, రోడ్లు, భవనాల శాఖ- రూ. 9,554 కోట్లు, ఇంధన శాఖ - రూ. 8,207 కోట్లు పరిశ్రమలు, వాణిజ్య శాఖ- రూ. 3,127 కోట్లు, జలవనరుల శాఖ- రూ 16,705 కోట్లు, గృహ నిర్మాణ శాఖ- రూ. 4,012 కోట్లు, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ- రూ. 11,490కోట్లు, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ- రూ. 16,739 కోట్లు, వైద్యారోగ్య శాఖ - రూ. 18,421 కోట్లు, ఉన్నత విద్యాశాఖ- రూ. 2,326 కోట్లు, పాఠశాల విద్యాశాఖ- రూ. 29,909 కోట్లు, నైపుణ్యాభివృద్ధి శాఖ- రూ.1,215 కోట్లు, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ- రూ. 4,285 కోట్లు, షెడ్యూల్ కులాల సంక్షేమం- రూ. 18,497 కోట్లు, షెడ్యూల్ తెగల సంక్షేమం- రూ. 7,557 కోట్లు, బీసీల సంక్షేమం - రూ. 39,007 కోట్లు, అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమం- రూ. 4,376 కోట్లు, వ్యవసాయం, అనుబంధ రంగాలకు- రూ. 11,855 కోట్లు కేటాయించింది. అమరావతి నిర్మాణానికి కేంద్ర నిధులతో పాటు ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు నిధులను కేటాయించటం శుభ పరిణా మం. అయితే ఈ కేటాయింపులు కాగితాలకు మాత్రమే పరిమితం కారాదు. కార్యాచరణ సైతం అమలు కావాలి. బడ్జెట్ కేటాయింపులు కొన్ని శాఖలకు పూర్తి స్థాయిలో ఖర్చు చేయలేని పరిస్థితి. నిధుల కేటాయింపు నిధుల వినియోగంపై పారదర్శకతతో ఎప్పటికప్పుడు నివేదికలను ప్రజల ముందు ఉంచాలి. సంక్షేమం, అభివృద్ధి రాష్ట్ర ఆర్థిక ప్రగతి రథానికి రెండు చక్రాలు అన్నది ప్రభుత్వ సారథులు గుర్తించి పారదర్శకతతో ఖర్చుపెడితే అభివృద్ధి వేగవంతమౌతుంది.

# ధాన్య కొనుగోలుకు సిద్ధంగా ఉండాలి

## కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని వసతులు

## ధాన్య కొనుగోలు కేంద్రాల పై మండలాల వారిగా అధికారులతో సమీక్ష చేసిన అదనపు కలెక్టర్లు



**ఖమ్మం ప్రతినిధి నవంబర్12 (ప్రజాబలం)** ఖమ్మం ధాన్య కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులతో కొనుగోలుకు సంసిద్ధంగా ఉండాలని అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లు అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో మండల తహసిల్దార్లు, ఎంపిడిఓ లతో ధాన్య కొనుగోలు కేంద్రాల నిర్వహణపై అదనపు కలెక్టర్లు సమీక్షించారు మండలాల వారిగా ధాన్య కొనుగోలు కేంద్రాలు, సన్న, దొడ్డు రకాల కొనుగోళ్ళకు ఎన్ని కేంద్రాలు, కేంద్రాలకు సరిపోను స్థల లభ్యత, వసతులు, పరికరాలు అన్ని ఉన్నవి, ధాన్యం కొనుగోలుకు వస్తుందా, సమస్యలు ఉన్నాయా అదనపు కలెక్టర్లు అడిగి తెలుసుకున్నారు జిల్లాలో 288888.78 ఎకరాల్లో వరి సాగుచేయగా, 664444.2 మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా ఉన్నట్లు వారు అన్నారు. మొత్తం 324 ధాన్య కొనుగోలు కేంద్రాల ఏర్పాటుచేసినట్లు వారు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 31008 ఎకరాల్లో వరి కోతలు జరగగా, 25672 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరినట్లు అదనపు కలెక్టర్లు అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం 24 గంటల లోపు సంబంధిత మిల్లుకు రవాణా జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రతి కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్లు అందుబాటులో ఉండాలన్నారు. ఎఫ్ఏక్యూ ప్రమాణాల పై రైతులకు అవగాహన కల్పించాలని, తేమ శాతం, తాల్ సరిచూసుకొని ధాన్యం కేంద్రాలకు తెచ్చే విధంగా చైతన్యపరచాలని తెలిపారు రోడ్లపై ధాన్యం ఆరబోతపై ప్రమాదాలు జరగకుండా, ప్రజల రక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. %కూష్ఱజఱ్ఎ% కేంద్రాల మార్పులు, చేర్పులు ఉంటే వెంటనే దృష్టికి తేవాలని అదనపు కలెక్టర్లు అన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్లు తెలిపారు ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, మండల తహశీల్దార్లు, ఎంపిడివోలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాసర ఐఐటీలో విద్యార్థుల మరణాలకు అరికట్టాలి

## విద్యాశాఖ మంత్రిని నియమించాలి

## అడ్వకేట్ జగన్ మోహన్ బీఎస్పీ నిర్మల్ జిల్లా ఇంచార్జీ



**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..** నిర్మల్ జిల్లా కేంద్రంలో బీఎస్పీ నిర్మల్ జిల్లా ఇంచార్జీ అడ్వకేట్ జగన్ మోహన్ మీడియాతో మాట్లాడుతూ.బాసర ఐఐటీ లో పియుసి రెండవ సంవత్సరం చదువుతున్న స్వాతి ప్రియ అనే విద్యార్థిని మరణానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ఉన్నత స్థాయి విచారణ చేపట్టాలని విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.
గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో విద్యా వ్యవస్థను బాసర ట్రిబుల్ ఐఐటిని నిర్లక్ష్యము చేసి నారని, 10/10 మార్కులు వచ్చిన విద్యార్థులు గత ప్రభుత్వం 12 మంది విద్యార్థులను పొట్టన పెట్టుకున్నదని ఆరోపించారు, నేటికి కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడ విద్యార్థుల మరణాలు ఆగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.
ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాసర ఐఐటిని సందర్శించాలని డిమాండ్ చేశారు, విద్యార్థుల మరణాలు ఎందుకు ఇలా జరుగుతున్నాయి, ఏమిటి, అనే కోణంలో ఇప్పటికైనా ప్రభుత్వం చిత్తశుద్ధిగా ఆలోచించాలని అన్నారు. మార్పు కోసం అధికారంలోకి వచ్చామని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మల్ జిల్లా బాసర ఐఐటీ లో మరణాలు ఎందుకు ఆపలేకపోతున్నారని ప్రశ్నించారు,విద్యాశాఖ మంత్రిని నియమించాలని అన్నారు.ఐఐటీ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం తగిన చర్యలు తీసుకోవాలని జగన్ మోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

# ఆత్మహత్య కు ఎస్ ఐ. సంబంధము ఏమిటి



**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా** మంగళవారం ఉదయం బాసర ఐఐ ఐటి. లో ఒక విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సమాచారం రావడంతో బాసర ఎస్ఐ గణేష్ హుటా హుటిన బాసర పిహెచ్ లో ఉన్న విద్యార్థిని ని యూనివర్సిటీ అధికారుల అభ్యర్థనల మేరకు బైంసా హాస్పిటల్ కి తీసుకెళ్లగా అప్పటికే విద్యార్థిని చనిపోయిందని వైద్యులు తెలిపారు. వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకుంటున్నాను అని ఆ అమ్మాయి 6 పేజిల లేఖ రాసింది. ఆ లేఖ విశ్రుతంగా సోషల్ మీడియా లో మరియు ఎలక్ట్రానిక్ మీడియా లో కూడా ప్రచారం అయినది. దానిలో ఆ అమ్మాయి అన్ని వివరం గా రాసింది. కేసు దర్యాప్తు చేస్తున్న అధికారులు ఆమె ఆత్మ హత్య కు కారణాలు పోస్టుమార్టం చేయించడానికి భైంసా హాస్పిటల్ దగ్గర విధి నిర్వహణలో మరియు యూనిఫాం లో ఉన్న ఎస్సైని పట్టుకొని నా కూతుర్ని నువ్వే చంపేసావ్ అంటూ గల్లా పట్టుకొని లాగుతూ కొట్టడం న్యాయమా? బిడ్డను పోగొట్టుకున్న కడుపు కోత అర్థం చేసుకో గలం కానీ అంకిత భావం తో పనిచేసే పోలీసుల మీద దాడి చేయడం మంచిది కాదు. ఆత్మహత్య కు ఎస్ ఐ. సంబంధము ఏమిటి? మాకు కూడా కుటుంబాలు ఉంటాయి.పోలీస్ ఆధికారుల మీద దౌర్జన్యం చేసి మా మానసిక స్థయిర్యంను దెబ్బ తీయవద్దు. విధి నిర్వహణ లో జోక్యం చేసుకోవడం తప్పు.
ఇట్టి విషయాన్నీ పోలీస్ సంక్షేమ సంఘం ప్రతినిధులు తీవ్రంగా ఖండిస్తున్నాం. గతంలో బాసర ఎస్సై గోదావరిలో ఆత్మ హత్యకు పాల్పడిన ఎంతో మంది ప్రాణాలు కాపాడి ఎంతో మంది మన్ననలు పొందారు , ఈ సంఘటనలో అతని విది నిర్వర్తించారు.ప్రజలు ఎక్కడ ఇబ్బంధి లో ఉన్న వెంటనే స్పందించే పోలీసుల్ని చేయి చేసుకొనే హక్కు ఎవరు ఇచ్చారు.
పోలీసులు 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎంతో బాధ్యతాయుతంగా శాంతి భద్రతల విధులు నిర్వహిస్తున్న పోలీసులు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల ధన,మాన ప్రాణాలకు రక్షణగా ఉంటూ వారి ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి నిష్పక్షపాతంగా నిర్మల్ పోలీస్ మీ పోలీస్ ద్వారా విధులు నిర్వహిస్తున్నారు. నిన్న భైంసా హాస్పిటల్ లో విదినిర్వహణలో ఉన్న ఎస్ఐ ని గళ్ళ పట్టి కొట్టటం చూసిన అందరూ తీవ్ర మానసిక వేదనకు గురి అయ్యారు.మా పోలీస్ కుటుంబ సభ్యులు ( భార్యలు, పిల్లలు మరియు తల్లి తండ్రులు) తీవ్ర మానసిక క్షోభకు గురయ్యారు.
ఆ విధి నిర్వహణలో ఉన్న ఎస్ఐ గారినీ అలా అవమానించటం సబబు కాదు. అందుకని మృతురాలి తల్లి అయిన పూరి ఉజ్వల వైఫ్ ఆఫ్ పూరి రవీందర్, నివాసం ఆర్మూర్ మీద చర్యలు తీసుకోవాలని నిర్మల్ జిల్లా పోలీసు అసోషియేషన్ అధ్యక్షులు పోలీసు అధికారులు మరియు సిబ్బంది తరుపున పత్రిక ప్రకటనలో తెలిపారు.
తెలంగాణ పోలీసు అంటే దేశంలోనే మంచి గుర్తింపు ఉందని, నిర్మల్ పోలీస్ మీ పోలీస్ తో ప్రజల ఆధారాభిమానులు పొందుతుంటే... ఇలా ఎస్ఐ మీద దాడి చేసి దుశ్భషలాడటం ఎంతవరకు అస్సలు మంచిది కాదు. దీని మీద చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ గారిని కొరటం జరిగినది .

## అధికారులపై దాడి చేస్తే నోరుమెదపని వారు.. అరెస్టులు చేస్తే ఎలా ఖండిస్తారు

అధికారులపై భౌతికంగా దాడి చేసి గాయపర్చినప్పుడు నోరు మెదపని వారు.. దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేస్తే ఖండించడం ఎంత వరకు సరైనదని తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి ప్రశ్నించారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పని చేసే ఉద్యోగులపై దాడులు చేస్తే సరైన పద్దతి కాదన్నారు. వికారాబాద్ జిల్లాలో అధికారులు, ఉద్యోగులపై సోమవారం జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టుగా తెలిపారు.తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు మంగళవారం రాష్ట్ర డీజీపీ జితేందర్‌ను కలిసి వికారాబాద్ జిల్లా, దుద్యాల మండలం, లగచర్ల గ్రామంలో అధికారులపై జరిగిన దాడిపై సమగ్ర దర్యాప్తు జరిపించి దాడికి పాల్పడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రాన్ని అందచేశారు.
గ్రామంలో ఫార్మా కంపెనీ విషయమై ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, కడా ప్రత్యేకాధికారి, తహశీల్దార్, ఇతర అధికారులపై కొందరు రైతుల ముసుగులో పథకం ప్రకారమే దాడి చేసినట్టుగా కనిపిస్తుందన్నారు. దాడి చేసిన వారిని, దాడి వెనుకాల ఉన్న వారిని గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరారు. దీనిపై డీజీపీ సానుకూలంగా స్పందించారన్నారు. దాడికి పాల్పడిన వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తిలేదని.. పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్టుగా డీజీపీ చెప్పారని జేఏసీ నాయకులు తెలిపారు.
అనంతరం రాష్ట్ర సచివాలయంలోని మీడియా సెంటర్‌లో విలేకరులతో ఛైర్మన్ లచ్చిరెడ్డి, ఇతర నాయకులు మాట్లాడారు. ప్రజా సేవ చేస్తున్న అధికారులపై దాడులు చేసేలా ఉసికొల్పడం సరైన పద్దతి కాదన్నారు. జిల్లా కలెక్టర్‌నే గ్రామానికి వచ్చినప్పుడు తమ అభిప్రాయాన్ని రైతులు, గ్రామస్తులు స్వేచ్ఛగా చెప్పుకునే అవకాశం ఉందన్నారు. కానీ అదే కలెక్టర్ పట్ల దురుసుగా ప్రవర్తించడం, మిగతా అధికారులపై భౌతికదాడులకు దిగడం, వాహనాలను ధ్వంసం చేయడం సరైన పద్దతి కాదన్నారు. అధికారులపై భౌతిక దాడులు చేసే సంస్కృతిని ఎవరూ కూడా సహించరన్నారు.
కార్యక్రమంలో జేఏసీ నాయకులు కె.రామకృష్ణ, ఎస్.రాములు, రమేష్ పాక, సెక్రటరీ జనరల్ ఫూల్‌సింగ్ చౌహాన్, రాధ, తెలంగాణ నిర్మల, చంద్రశేఖర్‌గౌడ్, రాబర్ట్ బ్రూస్, పుష్పలత, తిరుపతి, విజయ్‌కుమార్, హరీందర్‌సింగ్, తదితరు పాల్గొన్నారు.

# న్యుమోనియా ప్రాణాంతకం!

2021లో న్యుమోనియా అంటువ్యాధితో 2.2 మిలియన్లు మరణించగా అందులో 5.02 లక్షల మంది పిల్లలు ఉన్నారు. ఐదేళ్ల లోపు వయసున్న పిల్లల అధిక మరణాలకు కారణమైన వ్యాధి న్యుమోనియా. కోవిడ్-19 కారణంతో మరో 10 మిలియన్లు కూడా అదనంగా మరణించినట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. అధిక ప్రాణాలను గైకొంటున్న వ్యాధుల్లో న్యుమోనియా ప్రధానమైనదని తేలింది. వాతావరణ ప్రతికూల మార్పులు, గాలి కాలుష్యం కోరలు చాచడంతో శ్వాస వ్యవస్థ, ఊపిరితిత్తుల సమస్యలు ఉత్పన్నం కావడం, న్యుమోనియా మహా విపత్తు వస్తుందనే భయం కూడా ఉందని, మిలియన్ల జనులు న్యుమోనియా సోకే ప్రమాదపు అంచున ఉన్నారని వైద్యులు అంచనా వేస్తున్నారు. న్యుమోనియా వ్యాధి ఐదేండ్ల లోపు పిల్లలకు, వృద్ధులకు వస్తుంది. టీకాలు వేయించుకోని వారు, పోషకాహారలోపాలు, ఇంట్లో వంట చెరుకు వాడే వారు, కలుషిత గాలి పీల్చే పెద్దలు, పొగ త్రాగే దురలవాటు ఉన్న వారు అధికంగా న్యుమోనియా బారిన పడే ప్రమాదం ఉంటుంది. న్యుమోనియా వ్యాధి తీవ్రత, ప్రమాదాన్ని గుర్తించిన అంతర్జాతీయ సమాజం 2009 నుంచి ప్రతి ఏట 12 నవంబర్ రోజున "ప్రపంచ న్యుమోనియా దినం" పాటిస్తూ ఆ వ్యాప్తి పట్ల కనీస అవగాహన కల్పించడం జరుగుతోంది. బ్యాక్టీరియా, వైరస్ లేదా ఫంగీ సంక్రమణ కారణంగా తాపజనక శ్వాస రుగ్మత (ఇన్ఫ్లమేటరీ రెస్పిరేటరీ డిసార్డర్) లేదా న్యుమోనియా వ్యాధి అంటుకుంటుంది. ఈ సూక్ష్మజీవులు ఊపిరితిత్తుల్లో చేరి "ఎల్వియోలి" అనే భాగంపై ప్రభావాన్ని చూపి న్యుమోనియాకు దారి తీస్తుంది. దీని వల్ల ఊపిరితిత్తుల్లో నీరు చేరి శ్వాస తీసుకోవడం ఇబ్బంది అవుతుంది. బలహీన వ్యాధినిరోధకశక్తి కలిగిన పిల్లలు, వృద్ధులకు న్యుమోనియా సోకి ప్రాణాంతకంగా కూడా మారవచ్చు. ప్రపంచ న్యుమోనియా దినం -2024 థీమ్‌గా "ప్రతి శ్వాస ముఖ్యమే : న్యుమోనియాను మార్గంలోనే ఆపేద్దాం(ఎవ్రీ బ్రీత్ కౌంట్స్ : స్టాప్ న్యుమోనియా ఇన్ ఇట్స్ ట్రాక్)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. న్యుమోనియా నివారించదగిన అంటు వ్యాధి. వ్యాధిగ్రస్థులు తుమ్మడం, దగ్గడం, ముక్కు చీదడం లాంటి సందర్భాల్లో మరొకరికి సంక్రమిస్తుందని తెలుసుకోవాలి. పిల్లల్లో బ్యాక్టీరియా కారణ స్ట్రెప్టోకోకల్ న్యుమోనియా అతి ప్రధానమైనది. దాని తర్వాత హిమోఫిలస్ ఇన్ఫ్లుయెంజా రెండవ ప్రధానమైనది. న్యుమోనియాలో రెస్పిరేటరీ సిన్సిటియల్ వైరస్ వ్యాధి వైరస్ వర్గంలో ముఖ్యమైనది. న్యుమోనియా వ్యాధికి చికిత్స కూడా అందుబాటులో ఉన్నది. ప్రపంచ న్యుమోనియా దినం వేదికగా ప్రభుత్వాలు, వైద్య ఆరోగ్య శాఖ, ఎన్‌జిఓలు, ఇతర సంస్థలు కలిసి న్యుమోనియా పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, రోగగ్రస్థులకప చికిత్సా పద్ధతులు వివరించడం మంచి ఫలితాలను ఇస్తాయి. న్యుమోనియాను తొలిదశలో గుర్తించడం, చికిత్స తీసుకోవడం, నివారణ మార్గాలను తెలుసుకోవడం లాంటి అంశాలను గుర్తుంచుకోవాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ వివరాల ప్రకారం ప్రతి ఏట 14 లక్షల పిల్లలు న్యుమోనియా సోకి చనిపోవడం, పిల్లల మరణాల్లో 18 శాతం వరకు న్యుమోనియా కారణం కావడం గమనార్హం. యూనిసెఫ్ వివరాల ప్రకారం ప్రతి 39 సెకన్లకు ఒక పిల్లవాడు న్యుమోనియాతో మరణిస్తున్నాడు. వృద్ధుల్లో న్యుమోకోకల్ న్యుమోనియా అధికంగా సోకుతుంది. న్యుమోసిస్టిక్ జిరోవెస్సీ వ్యాధి ఫంగస్ సోకడంతో వస్తుంది. గాలి కాలుష్యం, స్మోకింగ్ వల్ల 16 లక్షల వృద్ధులు మరణిస్తున్నారు. డబ్ల్యూహెచ్ఒ, యూనిసెఫ్‌లు సంయుక్తంగా న్యుమోనియా, డయేరియా వ్యాధుల కట్టడికి గ్లోబల్ ఆక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నారు. ఐదేళ్ల లోపు పిల్లలు, 65 ఏండ్లు దాటిన వృద్ధులు, దీర్ఘకాలిక అనారోగ్యాలతో బాధపడుతున్న రోగులు, పర్యావరణ కాలుష్య ప్రాంతాల్లో నివసిస్తున్న జనులు, హెచ్ఐవి/క్యాన్సర్ లాంటివి సోకిన వ్యాధిగ్రస్థులు న్యుమోనియా ప్రమాదంలో పడే అవకాశాలే ఎక్కువ. టీకాలు వేయించడం, పోషకాహారం అందిచడం, గాలి కాలుష్యాన్ని తగ్గించడం వల్ల న్యుమోనియా వ్యాధి తీవ్రత తగ్గుతుంది. ఆంటీబ్యాక్టీరియల్, అంటీ వైరల్, ఆంటీ ఫంగల్ ఔషధాలతో న్యుమోనియా కట్టడి జరుగుతుంది. భౌతిక దూరాలు పాటించడం, మాస్కులు ధరించడం, పబ్లిక్ పిరదేశాల్లో ఉమ్మి వేయకుండా ఉండడం, దగ్గినపుడు లేదా తుమ్మినపుడు కండువా కప్పుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, గాలి కాలుష్యాన్ని కట్టడి చేయడం, నదుల్ని కలుషితం కాకుండా చూసుకోవడం లాంటి పలు దాగ్రత్తలు న్యుమోనియా కేసులను తగ్గిస్తాయి. పిల్లలకు, పెద్దలకు అతి ప్రమాదకరమైన అంటు వ్యాధిగా నిలిచిన న్యుమోనియా పట్ల సరైన అవగాహన పెంచుకొని అలాంటి ప్రాణాంతక రుగ్మతకు చరమగీతం పాడదాం, న్యుమోనియా కానరాని భారతాన్ని నిర్మించుకుందాం.

# దేశవిదేశాల్లో రాణించిన టంగుటూరి

భానుమతి వలెనే టంగుటూరి సూర్యకుమారి కూడా బహుముఖ ప్రజ్ఞావంతురాలు. ఆమె నాట్య కారిణి, నటి, గాయని మాత్రమే కాదు మంచి వక్తగా కూడా గుర్తింపు తెచ్చుకుంది, తెలుగు పాటని, తెలుగు భాషని, భారతీయ నృత్యాలను స్వదేశంలోనే కాకుండా విదేశాల్లోనూ ప్రాచుర్యం పొంద డానికి ఆవిడ చేసిన కృషి అపూర్వం. అనన్య సామాన్యం. ప్రాచ్య, పాశ్చాత్య నృత్య, సంగీతాలకు మధ్య సుహృద్భావ సేతువుగా అంతర్జాతీయ కీర్తినందిన మధురగాయని ఆమె. టంగుటూరి సూర్యకుమారి (నవంబర్ 13, 1925 - ఏప్రిల్ 25, 2005) అలనాటి తెలుగు సినిమా నటి, ప్రసిద్ధ గాయకురాలు. ఆమె నవంబర్13,1925లో రాజమండ్రి లో జన్మించారు. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు తమ్ముడు టంగుటూరి శ్రీరాములు కూతురు. మూడో ఏట నుంచే పాటలుపాడేది. 1937లో మద్రాసు చేరుకుని, పన్నెండు, పదమూడేళ్ళ ప్రాయం లోనే సినీరంగ ప్రవేశము చేసి, 'రైతుబిడ్డ' సినిమాలో నటించింది. 1952లో ఆమె తొలి మద్రాసు అందాల సుందరి (మిస్ మద్రాసు)గా ఎంపికైంది. సూర్యకుమారి రూపం, కంఠస్వరం రెండూ బాగా ఉండడం చేత, అప్పటికే పెదనాన్న ప్రకాశం సభల్లో ప్రార్థన గీతాలు పాడుతూం డడం చేత సినిమావారి పిలుపు వచ్చింది. సాంప్రదాయ నియమ, నిష్టలుగల కుటుంబం కావడం చేత కొంత వ్యతిరేకత ఎదురయ్యింది. సూర్యకుమారి కంఠం, రంగూ, రూపం ఆకర్షణీయంగా ఉన్నా, మామూలు అమ్మాయిల కంటే కొంచెం పొడవుగా ఉండటం చేత, సినిమా రంగంలో సమస్య ఎదురైంది. ఆనాటి సగటు హీరోలు ఆమె కంటే పొట్టిగా ఉండటం కారణం. అదీ కాక ఆమె బ్రాహ్మణ, పేరుపొందిన రాజకీయ కుటుంబం నుంచి రావటమే కాదు, ప్రేమ సన్నివేశాలలో హీరోయిన్ మీద హీరో చెయ్యి వెయ్యడం, ఇత్యాదివి ఒప్పుకొనే వారు కాదు. గొప్ప చాతుర్యం ఉండి కూడా ఆమె సినిమాల్లో సుస్థిరత పొందలేక పోయింది. అయినా సూర్యకుమారి సినిమాల్లోకి వచ్చి తెలుగు, తమిళ, కన్నడ, హిందీ నాలుగు భాషల్లోనూ మొత్తం ఇరవై ఆరు సినిమాల్లో నటించింది. విప్రనారాయణ' ఆమె తొలిచిత్రం. అదృష్టం, జయప్రద దేవత, చంద్రహాసన, దీనబంధు. భక్త పోతన, భాగ్యలక్ష్మి, కృష్ణప్రేమ, గీతాంజలి, అదృష్ట దీపుడు, మరదలి పెళ్లి, భక్త రామదాసు తదితర తెలుగు చిత్రాల్లో ఉడన్', 'ఖటోలా' తదితర హిందీ చిత్రాల్లో, 'కటకం', 'నేంసారనౌక మొదలైన తమిళ చిత్రాల్లో నటించింది. అలాగే కన్నడ చిత్రం భారతి'లో, ఆంగ్ల చిత్రం 'బాంటే వయిటి లోనూ నటించింది. సూర్యకుమారి, లండన్లో నాట్య ప్రదర్శనలు నిర్వహిస్తూ, కాళికా దేవిగా నాటకాల్లో నటించేది.లలిత గీతాలు యాభై, దేశభక్తి గీతాలు యాభై మొత్తం నూరు గ్రామఫోను రికార్డులు ఇచ్చింది. అలాగే ఒక యాభై దాకా తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల సినిమాల్లో తన గొంతుతో పాడిన పాటల రికార్డులు ఉన్నాయి. నటన కంటే సూర్యకుమారి పాడిన దేశభక్తి గీతాలు, లలిత గీతాలు, అష్టపదులు వంటివాటికి ఎక్కువ ప్రజాదరణ లభించడంచేత ఆమె పాట కచ్చేరీలు తరుచూ చేస్తూండేది. ఆంధ్రలోని చాలా ఊళ్ళలో లలిత సంగీత కచ్చేరీలు చేసింది. పేరు ప్రతిష్టలు, ప్రజాదరణ ఆమెకు తృప్తినివ్వ లేదు. ఏదో ప్రత్యేక కృషి చెయ్యాలన్న తపన, మూడు నాలుగేళ్ళపాటు కరతాళ ధ్వనులకు, ప్రశంసలకు దూరంగా ఉండి, చదువుమీద దృష్టి కేంద్రీక రించి, ప్రైవేటుగా కేంబ్రిడ్జి సీనియర్ పరీక్ష వ్రాసి, ప్రథమశ్రేణిలో పాసైంది.పలు భాషా చిత్రాలలో నటించిన సూర్యకుమారి మంచి గాయకు రాలు కూడా. స్వాతంత్ర్యోద్యమ సమయములో మా తెలుగు తల్లికి మల్లెపూదండ, దేశమును ప్రేమించుమన్నా మొదలైన అనేక దేశభక్తి గీతాలు పాడింది. ప్రకాశం పంతులు ఆమె కళాభిరుచిని బాగా ప్రోత్సహించి, శాస్త్రీయ సంగీతం నేర్పించాడు. ఆయన ఏ సభకు వెళ్ళినా ఆమెను తీసుకెళ్ళి జాతీయ గీతాలు పాడించేవాడు. 1953 అక్టోబరు 1న ఆంధ్ర రాష్టావతరణ సభలో నెహ్రూ, రాజాజీ, ప్రకాశం ప్రభృతుల సమక్షంలో, వందే మాతరం, మా తెలుగు తల్లికి మల్లె పూదండ పాటలు ఆలపించి అందర్నీ సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తింది. వీటితో పాటు 'స్వప్నజగతిలో ఛాయావీణ' మొదలైన లలిత గీతాలు, అడవి బాపిరాజు 'ప్రభువు గారికీ దణ్ణం పెట్టూ', 'రావోయి చిన్నవాడా' మొదలైన జానపద గీతాలు కూడా పాడుతుండేది. హెచ్.ఎం.వి. తదితర గ్రామఫోన్ కంపెనీలు ఈమె పాటలను రికార్డు చేశాయి. ఆమె పాడిన పాటలు గ్రాంఫోన్ రికార్డులుగా వెలువడి విరివిగా అమ్ముడు పోయేవి. ప్రత్యేకంగా రాయించుకున్న పాటలు ఆమెతో పాడించి మరీ గ్రామఫోన్ రికార్డులుగా తీసుకు రావడానికి అప్పటి గ్రాంఫోన్ కంపెనీ హెచ్.ఎం.వి. విశేష ఆసక్తి ప్రదర్శించేది, అలా ఆమె పాడిన పాటల్లో జాతీయ గీతాలు, భావగీతాలు, అష్టపదులు ఇలా చాలా రకాలు ఉన్నాయి. శంకరం బాడి సుందరాచారి రచించిన 'మా తెలుగుతల్లికి మల్లె పూదండ..' పాటని ఆమె పెదతండ్రి టంగుటూరి ప్రకాశం పంతులుతో వివిధ రాజకీయ సభల్లో పాడి ప్రాచుర్యం తెచ్చింది. ఆ సభల్లో వక్తగానూ ఆమెకు పేరుండేది. వెండి కంచాలలో వేడి బువ్వుందోయ్, పసిడి కంచాలలో పాల బువ్వం దోయ్, తిందాము రావోయ్ జాబిలి, ఆడుకుందాము రావోయ్ జాబిలీ' అంటూ నటిస్తూ పాడిన 'దేవత' చిత్రంలోని పాట, నారదుడుగా 'శ్రీకృష్ణ ప్రేమ'లో నటిస్తూ 'రేపే వస్తాడంట గోపాలుడు మాపే వస్తాడంట గోపాలుడు...' ఇలా చాలా పాటలు ప్రజాదరణ పొందాయి. 1958లో భారత చలనచిత్ర పరిశ్రమ ప్రతినిధుల బృందంలో ఒక ప్రతినిధిగా అమెరికాను సందర్శించి, తన ఉపన్యాసాలతో ఆకట్టుకుంది. అలా వారితో ఏర్పడిన సంబంధాలు 1959లో కొలంబియా యూని వర్సిటీ ట్యూటర్ గా వెళ్లి, పాశ్చాత్య సంగీతం, పాశ్చాత్య నృత్యాల్లో శిక్షణ పొంది వచ్చింది. సూర్యకుమారి ఆరోజుల్లోనే హాలీవుడ్ కి వెళ్లి ప్రముఖ దర్శకుడు ఆల్ ఫ్రెడ్ హిచ్ కాక్ వద్ద పని చేసింది. ఇంగ్లండ్లో సిరపడి ప్రముఖ పెయింటర్ హెరాల్డ్ ఎల్విన్ ను వివాహం చేసుకుని ఇండియా పెర్ఫార్మింగ్ ఆర్ట్స్' అనే సంగీత నాట్య పాఠశాలను నిర్వహించింది. ఇందులో భారతీయ పాశ్చాత్య కళలను, కళాకారుల ప్రదర్శనలు ఏర్పాటు చేయడం, పరస్పర సదవగాహన పెంపొందించం ముఖ్య ఆశయం. 1968లో ఆమె కృషిని బ్రిటిషు రాణి గుర్తించింది. 1969లో గాంధీజీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా మహాత్మా గాంధీకి నివాళులర్పిస్తూ సెయింట్ పాల్ కెథ్రెడ్రల్ లో గానం చేసిన ప్రథమ భారతీయ వనిత ఆమె. నార్వే, స్వీడన్, హాలెండ్, స్పెయిన్, కెనడా, అమెరికా మొదలైన పలు దేశాలలో భారతీయ సంగీత శిక్షణాలయాలు నెలకొల్పి, వందలాది కళాకారులను తయారు చేసింది. అమెరికాలో బ్రాడ్వే థియేటరులో విశ్వకవి రవీంద్రుని 'కింగ్ ఆఫ్ ది డార్క్ ఛాంబర్' నాటకంలో రాణి పాత్ర ధరించి, బ్రాడ్వే అవార్డు పొందిన మొదటి భారతీయ నటి. ఆ నాటకాన్ని న్యూయార్కులో ఎనిమిది నెలల పాటు ప్రదర్శించి, అటు తరువాత ఆఫ్రికాలో నాలుగు నెలలు పర్యటించింది. రవీంద్రనాథ్ ఠాగూర్ రాసి 'ది కింగ్ ఆఫ్ ది డార్క్ ఛాంజర్' నాటకంలో నటించింది. ఆ నాటకానికి దేశ విదేశాలలో విశేష ఆదరణ లభించడమే కాకుండా విదేశీయుల అభిమానాన్ని కూడా చూర గొ నే అవకాశం కలిగింది. కొలంబియా యూనివర్సిటీలో, లండను యూనివర్సిటీ విద్యా సంస్థలలో, బ్లాక్ థియేటరులోను భారతీయ నృత్యకళ సంగీతంపై వర్క్ షాపులు నిర్వహించింది.1975లో హైదరాబాదులో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభ ఆమె సేవలను గుర్తించి సత్కరించింది. 1979లో రాజ్యలక్ష్మి అవార్డుతో ఆమెను గౌరవించింది. ఆమె ఏప్రిల్ 25, 2005 న లండనులో మరణించింది.

# పురిపండా సాహిత్య సేవనం

తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవలందించిన మహానుభావులలో పురిపండా అప్పల స్వామి ప్రముఖులు. రచయితగా, పాత్రి కేయులుగా, పత్రికా నిర్వాహ కులుగా, రచయితల సంఘం అధ్యక్షులుగా, గ్రంథాలయ స్థాపకులుగా, గ్రాంథిక తెలుగు భాషా వాదిగా, బహుభాషా కోవిదులు గానే గాక, మహాత్మ గాంధీ నేతృత్వంలో చేపట్టిన స్వాతంత్ర్య ఉద్యమ కార్య క్రమాలలో జాతీయ వాదిగా క్రియా శీలక పాత్రలు పోషించారు. పురిపండా అప్పలస్వామి ( నవంబరు 13, 1904 - నవంబరు 18, 1982) విజయనగరం జిల్లా, సాలూరు గ్రామంలో నవంబరు 13, 1904 సంవత్సరంలో జన్మించారు. అక్కడే విద్యాభ్యాసం కొంతకాలం జరిపి, పిదప స్వయంకృషితో ఆంధ్ర, సంస్కృతాలలోనే గాక ఒరియా, హిందీ, బెంగాలీ, ఆంగ్ల భాషలలో పాండిత్యాన్ని ఆర్జించారు. మహాత్మాగాంధీ నిర్వహించిన సహాయ నిరాకర ణోద్యమం, హరిజనోద్యమం, ఖాదీ ప్రచారము లలో అత్యంత శ్రద్ధతో పాల్గొన్నారు. విశాఖపట్నంలో అఖిల భారత చరఖా సంఘం వారి ఖాదీ భాండాగారంలో నిర్వహకు డుగా కొంతకాలం పనిచేశారు. పత్రికా రంగంలో ఆయన తన ప్రతిభను ప్రదర్శించారు. విశాఖ పట్నం నుండి వెలువడిన 'స్వశక్తి' అను జాతీయ వారపత్రికకు సహాయ సంపాదకుడుగా కొంత కాలం పనిచేశారు. 'ఆంధ్రపత్రిక' కు విలేఖరిగా పన్నెండేళ్ళు వ్యవహరించారు. 'సత్యవాణి' పత్రికను నిర్వహిస్తూ, ఆయన రాసిన సంపాదక వ్యాసాలు పునర్ముద్రణ గౌరవాన్ని పొందాయి. ఆయన ప్రచురించిన 'వైశాఖి' మాసపత్రిక సారస్వత ప్రియుల మన్ననలను పొందింది. గ్రంథాలయోద్యమంలో ఆయన సాగించిన కృషి ప్రశంసనీయం. మంతెన ఆదినారాయణ స్వామి స్థాపించిన ఆంధ్రప్రదేశ్ ప్రథమ గ్రంథాలయాన్ని, 'కవితా సమితి' గ్రంథాలయాన్ని ఆయన అభివృద్ధి పరచారు. శ్రీరామవరం, పార్వతీ పురంల లోని గ్రంథాలయాలను పెంపొందించారు. మరకాం గ్రామాన ఒక గ్రంథాలయాన్ని స్థాపించారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘ యావజ్జీవ గౌరవ సభ్యులుగా ఎన్నుకో బడినారు. ఆయన సాహిత్య రంగంలో సాధించిన కృషి అనన్య సామాన్యం.15 ఏళ్ళ ప్రాయంలోనే తెలుగులో గద్యపద్య రచనను శ్రీకారం చుట్టారు. 1928 వరకు ఆయన గ్రాంథిక భాషావాది. గిడుగు వెంకట రామమూర్తిని పరిచయంతో, ఆయనతో ప్రభావితుడై తన సాహిత్య కృషిని వ్యావహారిక భాషలోనే సాగించారు. కందపద్య మయమైన 'రాట్న పతాకం' ఆయన తొలి రచన. ప్రముఖ రచనలలో 'సౌదామిని' ఆంగ్లంలోకే కాక హిందీ, ఒరియా భాషలలోకి కూడా అనువదింపబడి పెక్కు ముద్రణలను పొందింది. కేంద్ర సాహిత్య అకాడమీ కోరికపై 'అమృత సంతానం', 'మట్టి మనుష్యులు' అనే ఒరియా నుండి తెనిగించారు. వంగసాహిత్య చరిత్ర, ఒరియా సాహిత్య చరిత్రలను తెలుగులో రచించారు. అలాగే ఆంధ్ర సాహిత్య చరిత్రను ఒరియా భాషలో రచించి తెలుగు సాహిత్యంతో పరిచయాన్ని ఒరియా పండితులకు కల్పించారు. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి వ్యవహారిక భాషలో రచించుటకు పూనుకొన్న సంస్కృత భారతానువాదం శాస్త్రి మరణం వలన అసమగ్రంగా నిలిచిపోగా, మిగిలిన పదిహేను న్నర పర్వాలను రచించి పూర్తిచేశారు. రాట్న పతాకంబీ మహమ్మద్ చరిత్రబీ సౌదామినిబీ ఒరియా పాటలుబీ జగద్గురు శంకరాచార్యబీ ఛెతిమాణ అఠంగురబీ విశ్వకళావీధిబీ హంగేరీ విప్లవంబీ దేవీ భాగవతంబీ పురిపండా భాగవతముబీ పురిపండా వ్యావహారికాంధ్ర మహాభారతంబీ శ్రీమద్భాగవతముబీ వ్యావహారి కాంధ్ర వాల్మీకి రామాయణంబీ అమృత సంతానం (అనువాదం)బీ మట్టి మనుష్యులు (అనువాదం)బీ వంగ సాహిత్య చరిత్రబీ ఒడియా సాహిత్య చరిత్రబీ భగవద్గీత తదితరాలు పురిపండా ప్రముఖ రచనలు.ఆయన విశాఖ రచయితల సంఘానికి కొంతకాలం అధ్యక్షులుగా పనిచేశారు. ఆంధ్ర ప్రదేశ్ లలితకళా అకాడమీ, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీలో కార్యవర్గ సంఘాలలో సభ్యత్వాలను పొందారు.పురిపండా నవంబరు 18, 1982 సంవత్సరంలో పరమ పదించారు. ఆయనకు ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ పురస్కారం ప్రదానం చేసింది. ఆయన శతజయంతి ఉత్సవాలు విశాఖపట్నంలో ఘనంగా నిర్వహించగా, ఆ సందర్భంగా ఆయన జీవితచరిత్ర, సాహిత్యం గురించిన ద్వా.నా.శాస్త్రి రచించిన పుస్తకం విడుదల చేశారు. పురిపండా విగ్రహాన్ని బీచ్ రోడ్డులో ప్రతిష్ఠించారు.

# మాకెప్పుడు పదవులు

విజయవాడ, నవంబర్ 12, రెండు విడతల్లో నామినేటెడ్ పోస్టుల భర్తీ అయిపోయింది. పోస్టులు ఈన్నీ ఫిలప్ అయిపోయాయి. ఇక అదృష్టం ఎప్పుడు తమ తలుపు తడుతుందోనని ఊహల్లో తేలియాడిపోతున్నారట. నామినేటెడ్ పదవులు ఆశిస్తున్నదెవరు.? ఎమ్మెల్సీ కోసమే పట్టుబడుతున్న లీడర్లు ఎవరు.?ప్రభుత్వం వచ్చింది హ్యాపీగా ఫీల్ అయ్యామ్. టంపింగ్ మెజార్టీతో గెలిచాం..జోష్ మీదున్నాం. కానీ మాకు పదవేది సార్. ఇన్నాళ్లు పార్టీ కోసం కష్టపడ్డాం. మీడియాలో గొంతు చించుకుని అరిచాం. సీటు ఇవ్వలేమంటే అర్థం చేసుకున్నామ్. మాకెప్పుడు సార్ పదవి యోగం దక్కేది అంటూ..ఏపీలో టీడీపీ నేతలు వేయి కళ్లలతో ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే రెండు విడతల్లో పెద్ద సంఖ్యలో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేపట్టింది కూటమి సర్కార్. ఇందులో టీడీపీ నేతలకు పెద్ద సంఖ్యలోనే పదవులు వచ్చాయి. అయితే ఇంకా కొందరు నేతలకు మాత్రం పదవుల రేసులో వెయిటింగ్ తప్పడం లేదటరెండో లిస్ట్‌లో తమ పేరు ఉంటుందని చాలామంది నేతలు భావించారు. కానీ టీడీపీ అంటే టక్కున గుర్తొచ్చే నేతల పేర్లు రెండో జాబితా నామినేటెడ్ పోస్టుల లిస్ట్‌లో కనిపించలేదు. బుద్దా వెంకన్న, జలీల్ ఖాన్, పరిటాల శ్రీరామ్, ఏవీ సుబ్బారెడ్డి, పట్టాభి ఇలా చాలామంది నేతలు నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. అయితే సెకండ్ లిస్ట్‌లో తమ పేరు లేకపోవడంతో నిరాశ చెందారట. ఇప్పటివరకు భర్తీ అయిన వాటిలో లోకల్ డెవలప్‌మెంట్ అథారిటీలు, చిన్న చిన్న కార్పొరేషన్ పదవులే ఉన్నట్లు తెలుస్తోంది. ఇంకా పెద్ద పోస్టులు ఖాళీగా ఉన్నాయని..కాకపోతే..చాలామంది నేతలు ఎమ్మెల్సీ పదవి ఆశిస్తుండటంతో..ఎవరికి ఏ పోస్ట్ ఇచ్చి సంతృప్తి పరచాలో అధిష్టానానికి అంతుచిక్కడం లేదంటున్నారు. సీట్లు త్యాగం చేసిన నేతలు కొందరు అయితే.. పార్టీ కోసం గత ఐదేళ్లు తీవ్రంగా కష్టపడిన లీడర్లు ఇంకొందరు ఉండటంతో..టీడీపీ అధినేతకు వడపోత కష్టంగా మారిందట.మాజీమంత్రి దేవినేని ఉమాతో పాటు..కాపు నేత వంగవీటి రాధా ఎమ్మెల్సీ పదవి ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక పవన్ కల్యాణ్ కోసం సీటు త్యాగం చేసిన పిఠాపురం టీడీపీ ఇంచార్జ్ వర్మ కూడా ఎమ్మెల్సీ బెర్త్ కోసమే పట్టుబడుతున్నారట. బుద్దా వెంకన్నకు నామినేటెడ్ పోస్ట్ ఇచ్చేందుకు పార్టీ రెడీగా ఉన్నా..ఆయన మండలికి వెళ్లాలని మంకు పట్టుతో ఉన్నట్లు టాక్. ఇక మహాసేన రాజేశ్, మంతెన సత్యనారాయణ, బీద రవిచంద్ర, బీటెక్ రవి, ప్రభాకర్ చౌదరి ఇలా ఇంకో నలుగురైదుగురు నేతలు ఎమ్మెల్సీ పదవి అయితేనే తీసుకుంటామంటున్నారట.నామినేటెడ్ పోస్ట్ ఇస్తామంటే ఎమ్మెల్సీ కావాలంటారు. అంతమందికి ఎమ్మెల్సీలు ఎలా ఇవ్వగలుగుతాం అంటూ..నేతల తీరుపై చంద్రబాబు కాస్త అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే సెకండ్ లిస్ట్‌లో చెప్పుకోదగ్గ నేతల పేర్లు లేనట్లు చెబుతున్నారు. నామినేటెడ్, ఎమ్మెల్సీ పదవుల రేసును తేల్చలేకే ఇన్నాళ్లు.. ఛైర్మన్ పదవుల భర్తీ ఆలస్యం అయిందని అంటున్నారు. త్వరలోనే ఎమ్మెల్సీ పదవులు ఆశిస్తున్న నేతలతో మాట్లాడి వ్యవహారం కొలిక్కి తేవాలని బాబు భావిస్తున్నారట. మంచి నామినేటెడ్ పోస్ట్ ఇచ్చి సంతృప్తి పరచాలని..భవిష్యత్‌లో ఇంకా అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇవ్వాలని ప్లాన్ చేస్తున్నారట. ఇక నామినేటెడ్ పోస్ట్‌లు తీసుకోనంటున్న నేతలకు కూడా సర్దిచెప్పే ప్రయత్నం చేస్తున్నారట. అందరికీ ఎమ్మెల్సీలు ఇవ్వడం కుదరదని..మీ రాజకీయ భవిష్యత్‌కు నాది భరోసా అంటూ బాబు సర్ధిచెప్పబోతున్నట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. అలా ఎమ్మెల్సీ పదవులపై నేతలకు క్లారిటీ ఇచ్చిన తర్వాత..ఇక పూర్తిస్థాయిలో నామినేటెడ్ పోస్టుల భర్తీ చేపడతారని తెలుస్తోంది.

# తెలంగాణ విప్లవ తేజం కాళోజీ

అన్య భాషలు నేర్చి ఆంధ్రమ్ము రాదంచు, సకిలించు ఆంధ్రుడా చావ వెందుకురా'!... పరభాషలపై మోజుతో మాతృ భాషను విస్మరించే వారిని కాళోజీ కంటే గొప్పగా హెచ్చరించిన వారెవరూ లేరనేది వాస్తవం. అందుకే ఆయన జయంతి 'తెలంగాణ భాషా దినోత్సవం' అయింది. ఎక్కడో మరాఠాల కుటుంబంలో పుట్టి, వరంగల్‌కు వచ్చి స్థిరపడి 'నాది బడి పలుకుల భాష కాదు.. పలుకు బడుల భాష.. నా మాతృభాష తెలుగు' అని ఎలుగెత్తిన పోరాట యోధుడు. భయం అనేది ఎరుగని కలం వీరుడు కాళోజీ. ఆయన తుపాకీ గుండ్లకు ఎదురు నిలిచాడు. ఎన్నో సార్లు నిజాం ప్రభుత్వం కాళోజీని వరంగల్లు నుంచి బహిష్కరించింది. "నా గురించి చెప్పు కోవాలంటే ఎక్కడ అన్యాయం జరిగినా ప్రతిఘటిస్తు వచ్చిన, అన్ని ఉద్యమాల్లో ధైర్యంగా పాల్గొన్న, ఎక్కడ అక్రమం జరిగినా దాన్ని ధిక్కరిస్తూ గేయమో, కథో రాసిన. నా గేయాలలో తొంభై ఐదు శాతం ఉద్యమాలపై రాసినవే. అవన్నీ గేయ రూపంలో ఉన్న స్టేటుమెంట్లే." అలాంటి కలం వీరుడిని జ్ఞాపకం చేసుకుని నివాళులు అర్పించాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాసరాం రాజా కాళోజీ (సెప్టెంబరు 9, 1914 – నవంబరు 13, 2002) "కాళోజీ నారాయణ రావు లేదా కాళోజీ లేదా కాళన్న" గా సుపరిచితులు. ఆయన తెలంగాణ ప్రజల ప్రతీ ఉద్యమం యొక్క ప్రతిధ్వనిగా కొనియాడ బడతాడు. ఆయన రాజకీయ సాంఘిక చైతన్యాల సమాహారం. కవిత్వం రాసినా, హక్కులడిగినా, ఉద్యమం నడిపినా, ప్రజా వాణికి ప్రతిధ్వనిగా నిలిచాయన. మొత్తంగా తెలంగాణ జీవిత చలన శీలి కాళోజి. ఆజన్మాంతం తెలంగాణ ప్రజల అన్యాయాల గురించే తపించిన మహనీయుడు, వైతాళికుడు కాళోజి. నిజాం దమన నీతికి, నిరంకుశత్వానికి, అరాచక పాలనకి వ్యతిరేకంగా ఆయన తన కలం ఎత్తాడు. ఆయన స్వాతంత్ర్య సమర యోధుడు, తెలంగాణా ఉద్యమ కారుడు. ఆయన 1992లో భారతదేశ అత్యున్నత పురస్కారం పద్మ విభూషణ్ పొందాడు. ఆయన జన్మదినాన్ని తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా చేసి గౌరవించింది. వరంగల్ లో నెలకొన్న వైద్య విద్యాలయానికి ఆయన పేరు పెట్టబడింది. 'అన్యాయాన్నెదిరిస్తే నా గొడవకు సంతృప్తి...అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి. అన్యాయాన్నెదిరించిన వాడే నాకారాధ్యుడు' అని సగర్వంగా ప్రకటించి ఉద్యమమే ఊపిరిగా జీవించిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు.

ఆయన 1914, సెప్టెంబరు 9 న (కర్ణాటక) రాష్ట్రం, బీజాపూర్ జిల్లా లోని రట్టిహళ్లి గ్రామంలో జన్మించాడు. తల్లి రమాబాయమ్మ, కన్నడిగుల ఆడ పడుచు. తండ్రి కాళోజీ రంగారావు మహారాష్ట్రీయుడు. కాళోజీ తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ, కన్నడ, ఇంగ్లీషు భాషల్లో రచయిత గా ప్రఖ్యాతి గాంచాడు. రాజకీయ వ్యంగ్య కవిత్వం వ్రాయడంలో కాళోజీ దిట్ట. 'నా గొడవ' పేరిట సమకాలీన సామాజిక సమస్యలపై నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా, కటువుగా స్పందిస్తూ పాలకులపై అక్షరాయుధాలను సంధించి ప్రజాకవిగా కీర్తిగడించాడు. తెలంగాణ ప్రజల ఆర్తి, ఆవేదన, ఆగ్రహం ఆయన గేయాల్లో రూపు కడతాయి. నిజాం దమన నీతికి, నిరంకుశత్వానికి, అరాచక పాలనకు వ్యతిరేకంగా కలం, గళం ఎత్తిన ఈ శతాబ్దపు మేటి కవి కాళన్న. బీజాపూర్ నుంచి వరంగల్ జిల్లాకు తరలివచ్చిన కాళోజీ కుటుంబం మడికొండలో స్థిరపడింది. ప్రాథమిక విద్యానంతరం హైదరాబాదు పాతబస్తీలోని చౌమహల్ న్యాయ పాఠశాలలో కొంతకాలం చదివిన కాళోజీ, అటు తరువాత సిటీ కాలేజీలోనూ, హన్మకొండ లోని

> 'ఏ భాష నీది ఏమి వేషమురా,
> ఈ భాష ఈ వేషమెవరి కోసమురా,
> ఆంగ్లమందున మాటలనగానే
> ఇంత కుల్కెదవెందుకు రా,
> తెలుగు వాడివై తెలుగు రాదనుచు,
> సిగ్గులేక ఇంక చెప్పుటెందుకురా

కాలేజియేట్ ఉన్నత పాఠశాల లోనూ చదువు కొనసాగించి మెట్రిక్యులేషను పూర్తిచేశాడు. 1939 లో హైదరాబాదు లో హైకోర్టుకు అనుబంధంగా ఉన్న న్యాయ కళాశాల నుంచి న్యాయ శాస్త్రంలో పట్టా పొందాడు. 1930 నుంచే కాళోజీ గ్రంథాలయ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. తెలంగాణలోని ప్రతి గ్రామంలో ఒక గ్రంథాలయం ఉండాలన్నది కాళోజీ ఆకాంక్ష. సత్యాగ్రహోద్యమంలో పాల్గొని 25 సంవత్సరాల వయసులో జైలుశిక్ష అనుభవించాడు. నిజామాంధ్ర మహాసభ, హైదరాబాదు స్టేట్ కాంగ్రెసుతో కాళోజీ అనుబంధం విడదీయ రానిది. 1940 లో రుక్మిణీబాయితో వివాహం జరిగింది. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, జమలాపురం కేశవరావు, బూర్గుల రామకృష్ణా రావు, పి.వి.నరసింహారావు వంటి వారితో కలిసి కాళోజీ అనేక ఉద్యమాల్లో పాల్గొన్నాడు. విద్యార్థి దశలోనే నిజాం ప్రభుత్వ నిషేధాజ్ఞలను ఉల్లంఘించి వరంగల్లులో గణపతి ఉత్సవాలు నిర్వహించాడు. తెలంగాణలో అక్షరజ్యోతిని వ్యాపింప జేయాలన్న తపనతో ఆంధ్ర సారస్వత పరిషత్తును స్థాపించిన ప్రముఖుల్లో కాళోజీ ఒకడు. రజాకార్ల దౌర్జన్యాన్ని ప్రతిఘటిస్తూ 1945 లో పరిషత్తు ద్వితీయ మహా సభలను దిగ్విజయంగా నిర్వహించడంలో కాళోజీ ప్రదర్శించిన చొరవ, ధైర్య సాహసాలను ఆయన అభిమానులు ఇప్పటికీ గుర్తు చేసు కుంటారు. వరంగల్ కోటలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడానికి ప్రయత్నించి నందుకు ఆయనకు నగర బహిష్కరణ శిక్ష విధించారు. స్వరాజ్య సమరంలో పాల్గొని ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులు బహిష్కరణకు గురైనప్పుడు, వారిని నాగపూర్ విశ్వ విద్యాలయంలో చేర్పించి ఆదుకోవడంలో కాళోజీ పాత్ర అనన్యం. 1953 లో తెలంగాణ రచయితల సంఘం ఉపాధ్యక్షుడుగా ఎన్నికయ్యాడు. 1958 లో ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి శాసన మండలి సభ్యునిగా ఎన్నికై, 1958 నుండి 60 వరకు పనిచేసారు. రెండేళ్లు ఏ పార్టీకి చెందని స్వతంత్ర సభ్యుడిగా ఉన్నాడు. ఆయన "ఆంధ్ర సారస్వత పరిషత్" వ్యవస్థాపక సభ్యుడు మరియు ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడెమీలో సభ్యుడు. ఆయన తెలంగాణ రచయితల సంఘం అధ్యకునిగా, 1957-61 కాలంలో గ్లోసరీ కమిటీ సభ్యునిగా ఉన్నారు. 1977లో సత్తుపల్లి (ఖమ్మం జిల్లా) నుండి స్వతంత్ర అభ్యర్థిగా నాటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు పై పోటీ చేశాడు, కానీ ఓడి పోయాడు. కాకతీయ విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయగా, భారత ప్రభుత్వం పద్మ విభూషణ్ అవార్డుతో సత్కరించింది. 'హింస తప్పు, రాజ్యహింస మరీ తప్పు' అంటూ "సామాన్యుడే నా దేవుడు" అని ప్రకటించిన కాళోజీ 2002 నవంబరు 13 న తుదిశ్వాస విడిచాడు. ఆయన మరణా నంతరం ఆయన పార్థివ శరీరాన్ని కాకతీయ మెడికల్ కళాశాలకు అంద జేసారు. 1992లో పద్మ విభూషణ్ - భారత రెండవ అత్యున్నత పురస్కారం, 1972 లో తామ్రపత్ర పురస్కారంబీ 1968లో "జీవన గీత" రచనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే అనువాద పురస్కారంబీ బూర్గుల రామకృష్ణా రావు మెమోరియల్ మొదటి పురస్కారంబీ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం చే 1981లో సత్కారంబీ "ప్రజాకవి" బిరుదుబీ ఆంధ్ర ప్రదేశ్ లో అనేక సాహితీ సంఘాలచే సన్మానాలుబీ రామినేని ఫౌండేషన్ అవార్డుబీ గాడిచర్ల ఫౌండేషన్ అవార్డుబీ కాకతీయ విశ్వ విద్యాలయంవరంగల్ వారు 1992 లో డాక్టరేట్‌బీ 1996లో సహృదయ సాహితీ విశాఖ వారి గురజాడ అవార్డుబీ 1996లో కళసాగర్ మద్రాస్ వారి విశిష్ట పురస్కారం పొందారు. ఆయన మరాఠీ, ఇంగ్లీషు, ఉర్దూ భాషల్లో పండితుడు. ఎన్నో ఇతర భాషా గ్రంథాలను తెలుగులో అనువదించాడు. 1943 లోనే ఆయన కథల్ని "కాళోజీ కథలు" పేరుతో అప్పట్లో హైదరాబాదులో ఆంధ్ర పబ్లిషింగ్ కంపెనీకి చెందిన అణా గ్రంథమాల సంస్థ తన పద్నాలుగో ప్రచురణగా ప్రచురించింది.

ఆంధ్ర జనసంఘం, ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఆంధ్ర మహాసభ, తెలంగాణ రచయితల సంఘం సంస్థల నిర్మాణలలో కాళోజి భాగం ఉంది. పాములపర్తి నరసింహారావు లాంటి ఎందరికో ఆయన సాహిత్యంలో, రాజకీయాల్లో మార్గదర్శనం చేశాడు.

విశాలాంధ్ర సమస్యలు గమనించి ఆయన 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కలిశాడు. అన్ని సందర్భాలలో అసలుసిసలైన తెలంగాణ వాదిగా జీవించాడు. పర భాషా జ్ఞానాన్ని సంపాదించు కోవడం అవసరమే. కానీ, ఆ సాకుతో అమ్మ లాంటి మన భాషను నిర్లక్ష్యం చేయడం ఎంత తప్పు. నేటి తరం. తెలుగు పదాలనే మర్చిపోతోంది. ఈ పరిస్థితి పోవాలి. మన తేట తెలుగు భాషకు పూర్వ వైభవం రావాలి అని పరితపించాడు. తెలంగాణ పలుకు బడితో ప్రజల మాట, వ్యధలను ఆయన వ్యక్తం చేసిన తీరు అమోఘం. అందరికీ ఆదర్శ ప్రాయం. కాళోజీ జయంతి సెప్టెంబర్ 9 ని "తెలుగు మాండలిక భాషా దినోత్సవం" గా జరుపు కోవడం సమంజసం.

# సోషల్ మీడియా కేసులతో వైసీపీ కార్యకర్తల ఇబ్బందులు

విజయవాడ, నవంబర్ 12, ఏపీలో వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలు తీవ్ ఒత్తిడికి గురవుతున్నాయి. సోషల్ మీడియాలో వారు పెట్టిన పోస్టుల్లో మార్ఫింగ్‌లు, బూతులు ఉంటే ఎవర్నీ వదిలి పెట్టడం లేదు. కుటుంబాలను దూషిస్తూ ఐదేళ్ల పాటు వారు సేఫ్ గా ఉన్నారు. నిజానికి ఇలాంటి వారిలో అత్యధిక మంది ప్రభుత్వ డిజిటల్ కార్పొరేషన్ నుంచో.. మరో ప్రభుత్వ వ్యవస్థ నుంచో జీతాలు తీసుకుంటూ వచ్చారు. అలా జీతాలు తీసుకుంటూ అప్పట్లో పెట్టిన పోస్టులే ఇప్పుడు అరెస్టులకు కారణం అవుతున్నాయి.

తెలుగుదేశం పార్టీ వైసీపీ సోషల్ మీడియాను వ్యవస్థీకృత మాఫియాగా చెబుతోంది. దేశ విదేశాల్లో ఉన్న వారికి డబ్బులు ఇచ్చి మరీ పోస్టులు పెట్టిస్తున్నారని అంటున్నారు. గతంలో న్యాయమూర్తులపై పోస్టులు పెట్టింది కూడా వీరేనని..అలాగే.. టీడీపీ, బీజేపీ, జనసేన అగ్రనేతలు.. వారి కుటుంబాలపై ఇష్టం వచ్చినట్లుగా కామెంట్లు చేసింది కూడా వీళ్లేనని అంటున్నారు. ఫేక్ అకౌంట్లతో వస్తున్నారని వీరందరినీ ఇప్పుడు బయటకు తీశారు. కనీసం రెండువందల మందిని ఇప్పటి వరకూ అదుపులోకి తీసుకున్నారు. వీరి పోస్టులన్నీ అత్యంత జుగుప్సాకరంగా ఉండటంతో న్యాయస్థానాల్లోనూ ఊరట దక్కడం కష్టంగా మారింది. వైసీపీ సోషల్ మీడియా గీత దాటిపోయిందని కూటమి ప్రభుత్వం ముందే చెప్పింది.

కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత అరెస్టులు చేయలేదు. టీడీపీ అధికారంలోకి వచ్చాక.. నర్రా రవీంద్రారెడ్డి, ఇంటూరి రవికిరణ్ వంటి వాళ్లకు ఇన్ స్టంట్ ట్రీట్మెంట్ ఉంటుందని టీడీపీ క్యాడర్ అనుకున్నారు. కానీ వాళ్లకు కూడా నోటీసులు ఇచ్చి పంపేశారు. దీంతో టీడీపీ క్యాడర్ లో అసహనం కనిపించింది. నాలుగు నెలల పాటు ఇలాగే జరిగింది. ఇక తమకు అడ్డుఅదుపూ లేదనుకున్నారు. అందరూ బయటకు వచ్చారు. సరైన సమయం చూసి ఏపీ ప్రభుత్వం పంజా విసిరింది. అంటే ఒకరిద్దర్ని జైలుకు పంపి మిగతా వారికి వియ్ స్టాండ్ పోస్టులు వేసే అవకాశం ఇవ్వలేదు. అందర్నీ ఒకే సారి లోపలేస్తున్నారు. కొంత మందిపై పోక్సో చట్టం ప్రకారం కూడా కేసులు పెట్టే అవకాశాలు ఉన్నాయి. దీంతో వైసీపీ సోషల్ మీడియా ఒక్క సారిగా నిస్తేజంగా మారిపోయిన సూచనలు కనిపిస్తున్నాయి.

కొంత మంది వైసీపీ కార్యకర్తలు సోషల్ మీడియా అకౌంట్లను డిలీట్ చేస్తున్నారు. ఎందుకైనా మంచిదని క్షమాపణల వీడియోలు పెడుతున్నరా?. శ్రీరెడ్డి అనే సోషల్ మీడియా కార్యకర్తతో పాటు కాదు పదుల సంఖ్యలో ఇలాంటి సారీ ప్రకటనలు కనిపిస్తున్నాయి. సోషల్ మీడియా అరెస్టులపై లోకల్ ఇంచార్జులు అసలు పట్టించుకోవడం మావేశారు. ఫేక్ అకౌంట్లతో బూతులు మాట్లాడిన వారి కోసం ఎవరూ రావడం లేదు. చాలా మంది ఫేక్ పోస్టులతో వైసీపీ ఆఫీసు నుంచి వచ్చిన కంటెంట్ షేర్ చేసిన వారు ఇప్పుడు అవి చేసింది తామేనని బయటకు తెలియడంతో ఇబ్బంది పడుతున్నారు. ఇంటి చుట్టుపక్కల వారు కూడా అసహ్యించుకునే పరిస్థితి కనిపిస్తోంది. వీరందరికి భరోసా ఇవ్వకపోతే పార్టీకి పని చేసేందుకు భయపడతారని క్యాడర్ అనుకుంటోంది.

# 18న టీటీడీ పాలక మండలి సమావేశం



తిరుమల, నవంబర్ 12,తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నూతన పాలక మండలి తొలి సమావేశం ఈనెల 18న జరగనుంది. ఛైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన జరగబోయే ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. అందుకు సంబంధించి అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈనెల 18న ఉదయం 10.15 గంటలకు తిరుమల అన్నమయ్య భవనంలో టీటీడీ బోర్డు సమావేశం కానుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారాన్ని చేపట్టిన దాదాపు ఐదు నెలల తరువాత ఏర్పడిన టీటీడీ బోర్డు తొలి సమావేశం కావడంతో.. ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి తీర్మానాలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశం కోసం అధికారులు అజెండా సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. తొలిసారి జరగనున్న కొత్త బోర్డు సమావేశంలో ప్రధానంగా కొనుగోళ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించి తీర్మానాలను ప్రకటించనున్నారు. తిరుమల, తిరుపతిలో భక్తుల సౌకర్యార్థం తీసుకోవాల్సిన చర్యలు, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడంపై ఫోకస్ పెట్టనున్నారు. గత బోర్డు నిర్ణయాలపైనా చర్చించే అవకాశం ఉందని తెలిసింది. టీటీడీ ఛైర్మన్ హోదాలో బీఆర్ నాయుడికి టీటీడీ అందించే సదుపాయాలను ఆయన తిరస్కరించారు. గతంలో ఛైర్మన్లకు భిన్నంగా బీఆర్ నాయుడు వ్యవహరించారు. టీటీడీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన బీఆర్ నాయుడు టీటీడీ అందించే వాహనాలు, వసతి సదుపాయాలను సున్నితంగా పక్కనపెట్టారు. తిరుమలలో ఉన్నన్ని రోజులు సొంత వాహనాలను వినియోగించడంతో పాటు సహచరులు, బంధువులు ఉన్న వసతి గదుల అద్దెలు, భోజనం ఖర్చులను ఆయనే భరించారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హిందూ పుణ్యక్షేత్రమైన తిరుమల పవిత్రతను కాపాడుకోవడమే ప్రస్తుత టీటీడీ ధర్మకర్తల మండలి ప్రాధాన్యతని.. బీఆర్ నాయుడు ఇటీవలి అన్నారు. శ్రీవారి భక్తులకు సేవ చేసుకునే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. తాను చిన్నప్పటి నుండే ప్రతి సంవత్సరం శ్రీవేంకటేశ్వర స్వామిని కాలినడకన వచ్చి దర్శించుకునేవాడినని, ప్రస్తుతం తిరుమలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు సేవ చేసుకునే అరుదైన అవకాశాన్ని శ్రీవారు ప్రసాదించడం పూర్వజన్మ సుకృతమన్నారు. తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు నవంబరు 28 నుంచి డిసెంబరు 6 వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో చివరిరోజున భక్తులు విశేషంగా విచ్చేసే పంచమి తీర్థానికి తిరుమల నుండి వచ్చే శ్రీవారి సారె ఊరేగింపు ట్రయల్ రన్ నిర్వహించారు. తిరుపతిలోని చెన్నారెడ్డి కాలనీలో వినాయక స్వామివారి ఆలయం నుండి శ్రీవారి సారె ఊరేగింపు ట్రయల్ రన్ మొదలైంది. అక్కడి నుండి ఏనుగుపై సారెను ఊరేగించారు.

# 2500 డిగ్రీలతో సిక్కోలు వాసి

శ్రీకాకుళం, నవంబర్ 12, ఏకంగా రెండేళ్ల పాటు నిరంతరాయంగా ఆన్లైన్లో ప్రపంచ నలుమూలల్లో ఉన్న ప్రఖ్యాత సంస్థలు అందిస్తున్న కోర్సులు 2,500 పూర్తి చేసి ప్రపంచ రికార్డును సిక్కోలు వాసి సొంతం చేసుకున్నారు. భారత ప్రభుత్వం సైబర్ నేరాలపై అవగాహన కలిగించేందుకు ఆన్లైన్లో ఉచితంగా కోర్సును ప్రవేశపెట్టినప్పుడు తమ కుమార్తెకు బోధించేందుకు శ్రీకాకుళం నగరానికి చెందిన ఎం.వి.ఎస్.ఎస్. శాస్త్రి ఆ కోర్సు చదివి పరీక్ష రాసి ఉత్తీర్ణులై ధ్రువపత్రాలు పొందారు. ఆ తరువాత ఉచితంగా ఆన్లైన్ కోర్సులు అందిస్తున్న సంస్థలు వివరాలను సేకరించడం పనిగా పెట్టుకొని ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా 2,500 ఆన్ లైన్ కోర్టులను రెండేళ్ల పాటు చదివి, పరీక్షల్లో ఉత్తీర్ణులై ప్రపంచ రికార్డులు నెలకొల్పడం విశేషం. కోవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని కుదిపేసినప్పుడు అన్ని సంస్థలు ఆన్లైన్లో కోర్సులను బోధించడం ప్రారంభించాయి. ఉచితంగా లభిస్తున్న ఆన్లైన్ కోర్సులు పట్ల ఆసక్తి కలిగి సరదాగా మొదలుపెట్టిన ప్రయత్నం విజయవంతం కావడంతో చదవాలనే ఆకాంక్ష, ఆసక్తి పెరిగిందన్నారు. ఈ క్రమంలోప్రతిరోజూ నాలుగు నుంచి ఆరు గంటల సేపు ఆన్లైన్ కోర్సులు చదవడం ప్రారంభించానని శాస్త్రి తెలిపారు. 2022 అక్టోబర్లో మొదలైన చదువుల యజ్ఞం నేటివరకు కొనసాగిస్తూనే ఉన్నానని ఆయన పేర్కొన్నారు. ప్రపంచంలో పేరొందిన సంస్థలతో పాటు మన దేశంలోనూ పలు విశ్వవిద్యాలయాలు అందించిన ఉచిత ఆన్లైన్ కోర్సులను పూర్తి చేసిన క్రమంలో మిత్రుల సూచనలు మేరకు రికార్డు సంస్థలకు వివరాలు సమర్పించినట్లు తెలిపారు.

వృత్తిపరంగా, సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూనే క్రమం తప్పకుండా ఆన్లైన్ కోర్సులు పూర్తి చేసి ప్రపంచ రికార్డులు నమోదు చేయడం ఆనందంగా ఉందని శాస్త్రి తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో యువత ఏ కోర్సు చదివినప్పటికీ నైపుణ్యాన్ని పెంపొందించుకొనేందుకు ఆన్లైన్లో ప్రపంచం నలుమూలలనుంచి ప్రఖ్యాత సంస్థలు ఉచితంగా అందిస్తున్న కోర్సులు సద్వినియోగం చేసుకుంటే ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయని ఆయన సూచించారు. సాధించాలన్న తపన, పట్టుదల, నిరంతర ప్రయత్నంతో విజయం సాధించగలమనడానికి తన చదువుల ప్రస్థానమే నిదర్శనమని శాస్త్రి తెలిపారు. ప్రత్యేక శిక్షణలు... సాఫ్ట్వేర్ రంగంలో పేరొందిన గూగుల్ పాటు టీసీఎస్, మైక్రోసాఫ్ట్ ప్రవేశపెట్టిన ఛాలెంజ్, ట్రైనింగ్ కోర్సులను పూర్తి చేసి వాటి నుంచి ప్రత్యేక అభినందనలను పొందారు. టీసీఎస్ డిజిటల్ సూపర్ స్టార్ ట్రైనర్, మైక్రోసాఫ్ట్ గ్లోబెల్ అకాడమీ, మైక్రోసాఫ్ట్ టీచర్ అకాడమీ నుంచి ప్రశంసలను శాస్త్రి పొందారు. ఆన్లైన్లో 2,500 కోర్సులు రెండేళ్ల పాటు చదివి పూర్తి చేసిన ఎం.వి.ఎస్.ఎస్.శాస్త్రి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా అచీవర్ రికార్డు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డు (రెండు తెలుగు రాష్ట్రాలు) సొంతం చేసుకున్నారు.

అత్యధికం గా ఆన్లైన్లో కోర్సులు పూర్తి చేసిన వ్యక్తిగా శాస్త్రి పేరు నమోదు చేసి ధ్రువపత్రాలను రికార్డు సంస్థలు ప్రదానం చేశాయి.

గిన్నిస్ రికార్డు నమోదుకు దరఖాస్తు సమర్పించగా.. ఆ బృందం ధ్రువపత్రాల పరిశీలన చేపట్టింది. ఆన్లైన్ అంతర్జాతీయ సంస్థలైన గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, ఐబీఎం, లింక్డ్న్, ఫేస్బుక్, మెటా, ఆటోడెస్క్, ఓషా, ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంక్, కార్పొరేట్ ఫైనాన్స్ ఇనిస్టిట్యూట్, యుడేమి, ఈడీఎక్స్, ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్వో), ఇంటర్నేషనల్ ట్రైనింగ్ సెంటర్ (ఐటీసీ), యూరోపియన్ ఓపెన్ యూనివర్శిటీ, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూహెచ్‌వో), యునిసెఫ్, కోర్సుఎరా, కర్సా, యూకే అకాడమీ, ఫ్యూచర్ లెర్న్, ఒరగాన్ (యుఎస్ఏ) యూనివర్శిటీ, ఫోర్ఎజ్, యాక్సెంచర్, వాల్మార్ట్, యూనివర్శిటీ ఆఫ్ లీడ్స్, యూనివర్శిటీ ఆఫ్ మెల్బోర్న్, బ్రిటిష్ కౌన్సిల్, న్యూసౌత్వేల్స్ (ఆస్ట్రేలియా) యూనివర్శిటీ, బ్రిటిష్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్, డిలైట్, కాగజేంట్, ఆక్ ఫర్డ్ హె?మ్ స్టడీ, అలిసన్, లెక్ట్రా. గ్యాస్పల్ ఇనిస్టిట్యూట్, ఓపెన్ లెర్నింగ్, మైండ్లస్టర్ సంస్థల నుంచి సాఫ్ట్వేర్ కి సంబంధించిన కోర్సులతో పాటు స్కిల్ డెవలప్మెంట్, బిజినెస్ మేనేజ్మెంట్, సైకాలజీ, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, జర్నలిజం, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ, మిషన్ లెర్నింగ్.. విద్యారంగంలో ఉన్న అన్ని విభాగాలకు చెందిన కోర్సులు పూర్తి చేయడం విశేషం. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా (మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ), ఐఐటీ మద్రాస్, ఎన్ పి టి ఈ ఎల్. లాల్బహుదూర్ శాస్త్రి యూనివర్శిటీ, టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్ .పి, డిజిటల్ అడ్డా, సింప్లీలెర్న్, ట్రిపుల్ ఐటీ (కోటా) రాజస్థాన్, ఫార్మా అకాడమీ, యుడెనెక్స్, గువీ, హెచ్ సి ఎల్, నాస్కామ్, స్కిల్ అప్, సిస్కో, ఎక్సెల్ చాంప్, పిట్రోనిక్స్, లెట్స్ అప్ గ్రేడ్, డిజాస్టర్ మేనేజ్మెంట్, ఇంటెల్, ఎనర్జీ స్వరాజ్, యాక్సెస్ బాంక్, ట్యుటోరియల్ పాయింట్ తదితర సంస్థలు నుంచి కోర్సులు, ధ్రువపత్రాలు పొందారు. ప్రఖ్యాత మెటా సంస్థ వాట్సాప్ లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ)ను ప్రవేశపెట్టిన క్రమంలో జిల్లాకు చెందిన పలు చారిత్రక అంశాలతో కూడిన సమాచారాన్ని మెటా ఏఐకు శాస్త్రి నిరంతరం అందిస్తున్నారు. మెటా సంస్థ వాట్సాప్లో నీలిరంగు ఐకాన్తో ఏఐను ప్రవేశపెట్టిన క్రమంలో జిల్లాలో పలు విశేషాలు, సమాచారాన్ని ఏఐకు అడిగినప్పుడు సరైన సమాచారం లభించలేదు.

ఈ క్రమంలో జిల్లాకు చెందిన చారిత్రక, సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ సమాచారం, ప్రస్తుత పరిస్థితులను ప్రతిరోజూ ఒక గంటసేపు మెటా ఏఐకు అందించే పని శాస్త్రి చేస్తున్నారు.

జిల్లాకు చెందిన సమాచారాన్ని ఎవరైనా శోధించినప్పుడు పక్కాగా ఫలితం రావాలనే తాను ఏఐకు శాస్త్రీయంగా కూడిన సమాచారాన్ని ఉచితంగా అందిస్తున్నానని ఆయన తెలిపారు

# కేశినేని చిన్నిపై అప్పుడే వ్యతిరేకతా?



విజయవాడ, నవంబర్ 12, రాష్ట్రం మొత్తం వైసీపీ గాలివీచినా 2019లో విజయవాడ లోక్‌సభ స్థానాన్ని టీడీపీ కైవసం చేసుకుంది .. 2014, 19 ఎన్నికల్లో కేశినేని నాని టీడీపీ ఎంపీగా గెలిచారు . రెండో సారి గెలిచినప్పుడు తన షార్ట్ టెంపర్‌తో పార్టీలో అందరికీ దూరమయ్యారు. తన తమ్ముడు కేశినేని చిన్నికి పార్టీలో ప్రాధాన్యత లభిస్తుందన్న కోపం.. మరోసారి తనకు టికెట్ దక్కదన్న అక్కసులో పార్టీపై తిరుగుబాటు చేసి .. హడావుడిగా తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్లి జగన్ సమక్షంలో వైసీపీలో చేరిపోయారు. విజయవాడ ఎంపీగా వైసీపీకి సరైన అభ్యర్థి లేకపోవడంతో కేశినేని నానినే వారికి దిక్కయ్యారు..టీడీపీ నుంచి అనుకున్నట్లుగానే నాని తమ్ముడు కేశినేని చిన్ని టికెట్ దక్కించుకుని అన్నపై ఘన విజయం నమోదు చేశారు. దాంతో నాని రాజకీయ సన్యాసం ప్రకటించడంతో బెజవాడ పాలిటిక్స్‌లో ఆయన అధ్యయనం ముగిసింది. విజయవాడ తమ్ముళ్లు పార్టీకి కేశినేని నాని తలనొప్పి వదిలిందని ఆనందపడుతుంటే.. ఇప్పుడు ఎలాంటి రాజకీయ అనుభవం లేని కేశినేని చిన్ని వారికి తలనొప్పిగా తయారయ్యారంట.విజయవాడ పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో టీడీపీనే గెలిచింది. ఇప్పుడు ఇదే పెద్ద సమస్యగా మారిందంట.. ఏడుగురు ఎమ్మెల్యేలతో ఎంపీ చిన్నికి ఏదో రకమైన వివాదం కొనసాగుతోందట. తాను ఎంపీనని వందల కోట్లు ఖర్చుపెట్టి మిమ్మల్ని గెలిపించుకొని, తాను గెలిచానని.. కాబట్టి తాను చెప్పిందే చేయాలని చిన్ని హుకుం జరీ చేశారంట. జగ్గయ్యపేట, నందిగామ తిరువూరు, మైలవరం నియోజకవర్గం నేతలతో ఇసుక విషయమై ఎంపీ అవలంభిస్తున్న వైఖరి వివాదాస్పదంగా తయారైంది.కేశినేని పేరుతో ఆ నియోజకవర్గాల్లో పెద్ద పెద్ద లారీలు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నాయంట. ప్రతి లారీపై కేశినేని అని రాసి మరి ఇసుకను పక్క రాష్ట్రానికి తరలిస్తున్నారని.. కనీసం ఎమ్మెల్యేలకు సమాచారం ఇవ్వకుండా వారితో కోఆర్డినేషన్ చేసుకోకుండా ఎంపీ చిన్ని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.. దీంతో ఎమ్మెల్యేలు ఇటీవల అధినేతకి ఫిర్యాదు కూడా చేశారు.. దానిపై విచారణ జరిపించి మాట్లాడదామని చంద్రబాబు భరోసా ఇచ్చారంటున్నారు.ఎన్నికల ముగిసే వరకు చిన్న పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరితో కలసి మెలసి తిరిగిన కేశినేని చిన్ని.. గెలిచిన తర్వాత ఒక కోటరిని ఏర్పాటు చేసుకొని దాంతో లోక్‌సభ సెగ్మెంట్‌ని శాసించాలని చూస్తున్నారంట. కార్యకర్తలు, నేతలు ఆయన్ని కలవాలంటే కోటరీ పర్మిషన్ తీసుకోవాలంట.. తిరుపతి వెంకన్న దర్శనం అన్న అవుతుందేమో కానీ విజయవాడ ఎంపీ దర్శనం కావట్లేదని పార్లమెంటు పరిధిలోని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గెలిచే వరకు నేనే మీరు మీరే నేను అన్న చిన్ని.. గెలిచిన తర్వాత మాత్రం ఒక్కొక్క నియోజకవర్గానికి ఒక్కొక ఇన్చార్జిని.. వారందరినీ కోఆర్డినేట్ చేయడం కోసం పార్లమెంట్ ఆఫీసులో మరికొందరితో ఒక టీమ్‌ని ఏర్పాటు చేసి కార్యకర్తలకి అందుబాటులో లేకుండా పోయారంట. విజయవాడ నగరంలో మూడు అసెంబ్లీ స్థానాలు ఉండగా ఒకచోట బిజెపి గెలిచింది. ఎన్నికల్లో గెలిచిన తర్వాత ముగ్గురు ఎమ్మెల్యేలతో ఆశించిన స్థాయిలో ఎంపీ కి సత్సంబంధాలు లేకుండా పోయాయి.. ఏ కార్యక్రమమైనా ఎవరికి వారే చేసుకుంటున్నారు.ఇటీవల జరిగిన మద్యం టెండర్ల విషయంలో ఎమ్మెల్యేలకు, ఎంపీకి మధ్య బేధాభిప్రాయాలు వచ్చినట్లు బెజవాడలో చర్చ నడుస్తుంది.. తనపై చంద్రబాబుకి లేనిపోని ఫిర్యాదులు చేశారని చిన్ని పై సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమా తీవ్ర అసంతృప్తితో ఉన్నారంట. ఇటీవల బెజవాడ వరదల సమయంలో చిన్ని చెప్పిందాన్ని బేస్ చేసుకుని అధికారులు, ప్రజల సమక్షంలో ఉమాపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక వెస్ట్ బీజేపీ ఎమ్మెల్యే సుజనా చౌదరితో కూడా చిన్నికి సత్సంబంధాలు లేవంట .. సూపర్ సీనియర్ అవ్వడంతో విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు తో మాత్రం అంతోఇంతో సయోధ్య కొనసాగిస్తున్నాంటున్నారు.2019లో వైసిపి గాలిలో కూడా టీడీపీని గెలిపించుకున్న బెజవాడ పై పార్టీ పెద్దలు ఫోకస్ చేయాలని లేకపోతే రానున్న రోజుల్లో ఇబ్బందులు తప్పవని కార్యకర్తలు అంటున్నారు. వైసీపీ కార్పొరేటర్ లని చేర్చుకునే విషయంలో నియోజకవర్గ ఎమ్మెల్యేలతో సంప్రదింపులు జరగకుండా ఎంపీ నేరుగా చేర్చుకున్నారంట. అదే విభేదాలన్నిటీ ప్రధాన కారణమన్న వాదన వినిపిస్తుంది. మరి ఈ జూనియర్ కేశినేని తలనొప్పిని టీడీపీ పెద్దలు ఎలా సరిచేస్తారో చూడాలి.

# టీడీపీ మెంబర్ షిప్ కు భారీ స్పందన

గుంటూరు, నవంబర్ 12, ఏ రాజకీయ పార్టీకైనా కార్యకర్తలే బలం. వారి బలంతోనే కొందరు నాయకులుగా ఎదుగుతారు. ఎమ్మెల్యేలు, మంత్రులు అవుతుంటారు. అందుకే టిడిపి అధికారంలో ఉన్నప్పుడూ, లేనప్పుడూ కూడా కార్యకర్తలను కాపాడుకుంటూ, ఎప్పటికప్పుడు సభ్యత్వ నమోదుతో బలం పెంచుకుంటుంది.తాజాగా టిడిపి చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కేవలం రెండు వారాలలో 20 లక్షల మంది సభ్యులుగా తమ పేర్లు నమోదు చేసుకున్నారు. వంద రూపాయలు కట్టి టిడిపి సభ్యత్వం తీసుకున్నవారికి రూ.5 లక్షల ప్రమాదభీమా ఇస్తుండటం ఇందుకు ఓ కారణం కాగా ప్రస్తుతం టిడిపి అధికారంలో ఉంది కనుక ఆ పార్టీలో సభ్యత్వం ఉన్నట్లయితే సమాజంలో గుర్తింపు, ఏదో సమయంలో ప్రయోజనం లభించవచ్చనే చిన్న ఆశ మరో కారణంగా కనిపిస్తోంది. కారణాలు ఏవైనప్పటికీ రాష్ట్రంలో టిడిపి బలం పెరిగింది. ఇంకా పెరుగుతుందనేది స్పష్టం.అధికారంలో ఉన్న టిడిపి సభ్యత్వాలతో పార్టీని బలోపేతం చేసుకుంటుంటే, ఎన్నికలలో ఘోరంగా ఓడిపోయి అధికారానికి దూరమైన వైసీపి ఏం చేయాలి? అది ఇంకా చురుకుగా వ్యవహరిస్తూ సభ్యత్వ నమోదు చేపట్టి బలం పెంచుకోవాలి. కానీ జగన్ అధికారంలో ఉన్నప్పుడే నేతలను, కార్యకర్తలను పట్టించుకోకుండా ఐప్యాక్, వాలంటీర్లతో పాలన సాగించారు. ఇప్పుడు కూడా సోషల్ మీడియా వారియర్స్‌ని భర్తీ చేసుకుంటున్నారే తప్ప పార్టీ కార్యకర్తలని కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలని అడిగి తెలుసుకునే ప్రయత్నం కూడా చేయడం లేదు.

ఒకవేళ ఎవరికైనా సమస్యలొస్తే తాడేపల్లి ప్యాలస్‌లో హెల్ప్ లైన్ నెంబర్స్, లీగస్ సెల్ ఏర్పాటు చేశామని వారిని సంప్రదించుకోవాలని జగన్ స్వయంగా చెప్పారు. ఓ పార్టీ అధినేత కార్యకర్తలకు దూరంగా ఉంటూ, కార్యకర్తలు కంటే సోషల్ మీడియా వారియర్స్ ముఖ్యమనుకుంటున్నారు! తాడేపల్లి ప్యాలస్‌లో కూర్చొని ట్వీట్స్ వెయిస్తున్నారు. ఆవు చేలో మేస్తుంటే దూడ గట్టున మేస్తుందా?అన్నట్లు పార్టీ ముఖ్య నేతలందరూ కూడా ఆయననే ఫాలో అవుతూ ఇళ్ళలో కూర్చొని ట్వీట్స్ వేస్తూ కాలక్షేపం చేస్తున్నారు. ఓ రాజకీయ పార్టీ ఎలా ఉండాలో? ఎలా నడపాలో టిడిపిని చూసి నేర్చుకోమని జగన్ అనుకూల మీడియా మొత్తుకుంటోంది కూడా. కానీ దానినీ వాడుకోవడమే తప్ప దాని హితోక్తులు పట్టించుకోవడం లేదు. జగన్, సీనియర్ నేతలు ఈవిదంగా వ్యవహరిస్తుంటే ఇక వైసీపి ఏవిదంగా రాజకీయంగా నిలబడగలదు?

# వామ్మో... ఏం పిచ్చి రీల్స్ కోసం రూ.15 కోట్లా

హైదరాబాద్, నవంబర్ 12, ప్రభుత్వ భూములను అమ్మటం.. అలా వచ్చిన డబ్బుతో దీర్ఘకాలిక పనులు చేయకుండా.. ఏదో ఒక పథకానికి కొంతమేర ఖర్చుచేసి.. మిగతావన్నీ రకరకాల పేర్లతో దండుకోవడం సర్వసాధారణంగా మారింది. ఇప్పటికే హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం ఉదంతం కళ్ళ ముందు కనిపిస్తోంది. హర్యాన ఆర్థిక ఇబ్బందులు సజీవ సాక్షాత్కారం లాగా నిలుస్తోంది. అయినప్పటికీ మిగతా రాష్ట్రాల నేతలు మారడం లేదు. అందువల్లే మన దేశం ఆర్థికంగా ఎదలేక పోతోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో 2023-24 కు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన ఒక జీవో సంచలనం సృష్టిస్తోంది.. అందులో బడ్జెట్ కేటాయింపులకు సంబంధించిన వివరాలు కళ్ళు బైర్లు కమ్మేలా చేస్తున్నాయి. అప్పటి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల ప్రచారం కోసం ఏకంగా 15 కోట్లు ఖర్చు చేయడం.. అవి కూడా సోషల్ మీడియాలో రీల్స్ చేసే బ్యాచ్ కోసం తగలబెట్టడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.. జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్మెంట్ నుంచి విడుదలైన ఈ జీవో లో రీల్స్ కోసం 15 కోట్లు ప్రభుత్వ పథకాల ప్రచారం కోసం ఖర్చు చేస్తున్నట్టు ప్రకటించడం విశేషం.. వాస్తవానికి ఏ ప్రభుత్వానికైనా ప్రచార పిచ్చి ఉంటుంది. ఇందులో కాదనడానికి లేదు. కానీ సోషల్ మీడియాలో రీల్స్ బ్యాచ్ కోసం 15 కోట్లు ఖర్చు చేయడమే సంచలనంగా మారింది. ఈ జీవోలో రీల్స్ కోసమని ప్రత్యేకంగా చెప్పనప్పటికీ.. ఆ డబ్బు మొత్తం అందుకోసమేనని.. నాడు ఈ వ్యవహారం వెనుక "కొ. ది" అనే పేరున్న వ్యక్తి చక్రం తిప్పారని ప్రచారం జరుగుతోంది..నాటి ప్రభుత్వం ప్రచారం కోసం విపరీతంగా డబ్బులు ఖర్చు చేయడం పట్ల కాంగ్రెస్ నేతలు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. " అప్పటి షాడో ముఖ్యమంత్రికి ఓ వ్యక్తి అత్యంత దగ్గరగా ఉండేవాడు. ఆయన డిజిటల్ మీడియాను పర్యవేక్షించేవాడు. దానిని పూర్తిగా భారత రాష్ట్ర సమితికి అనుకూలంగా పనిచేసే విభాగంగా మార్చాడు. దీంతో అందులో అతడు ఇష్టారాజ్యం సాగిపోయింది. పైగా సోషల్ మీడియాలో రీల్స్ చేసే వ్యక్తులకు 30 సెకండ్లకు లక్ష చొప్పున ఇచ్చి.. ఆ పని పూర్తి చేయించారు. ఇందుకోసం ప్రభుత్వ డబ్బులు ఖర్చు పెట్టారు. నాటి ప్రభుత్వం విడుదల చేసిన జీవో నే ఇందుకు సాక్ష్యం. మొత్తంగా చూస్తే ఫ్లాగ్ షిప్ పథకాల ప్రచారమని చెప్పి ఇలా ప్రభుత్వ డబ్బులు అడ్డగోలుగా ఖర్చు చేశారు. ఇది శాంపిల్ మాత్రమే. ఇలాంటివి చాలా ఉన్నాయి. ఇవన్నీ మర్చిపోయి మా మీద విమర్శలు చేస్తున్నారు. తెలంగాణ ప్రజలకు అన్ని గుర్తుకే ఉన్నాయి. అందువల్లే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించారు. పార్లమెంట్లో సున్నా ఇచ్చారు. అయినప్పటికీ ఆ పార్టీ నాయకులు మా మీద విమర్శలు చేస్తున్నారు. బట్ట కాల్చి మీద వేస్తున్నారు. ప్రజలన్నీ గమనిస్తూనే ఉన్నారు. మళ్లీ కర్రుకాల్చి వాత పెడతారని" కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. అయితే నాటి ప్రభుత్వం విడుదల చేసిన జీవో కాపీని కాంగ్రెస్ నాయకులు సామాజిక మాధ్యమాలలో విస్తృతంగా పోస్ట్ చేస్తున్నారు. అయితే దీనిపై నాడు అధికారంలో ఉన్న పార్టీ ఇంతవరకు స్పందించకపోవడం విశేషం.

# పోసానికి చుట్టుముడుతున్న కేసులు



రాజమండ్రి, నవంబర్ 12, పోసాని కృష్ణమురళి.. సినిమాల్లో మల్టీ రోల్స్ పోషించి సక్సెస్ అయ్యారు. క్యారెక్టర్ ఆర్టిస్ట్, హీరో, రైటర్, ప్రొడ్యూసర్, డైరెక్టర్ ఇలా విభిన్న రూల్స్‌లో తనని తాను నిరూపించుకున్నారు. ఇండస్ట్రీలో కెరీర్ కంఫర్టబుల్‌గా ఉన్న టైంలోనే ఆ కాంట్రావర్సీ నటుడుకి రాజకీయాలపై ప్రేమ పుట్టుకొచ్చింది . 2009 ఎన్నికల ముందు ప్రజారాజ్యంతో పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో మొట్టమొదట సారి ఎమ్మెల్యేగా కూడా పోటీ చేశారు. చిలకలూరిపేట పీఆర్పీ అభ్యర్థిగా పోటీ చేసి తనకు ఎలాంటి పొలిటికల్ ఇమేజ్ లేకపోయినా? చిరంజీవి పుణ్యాణ 14 వేల ఓట్లు మాత్రం దక్కించుకుని మూడోస్థానంతో సరిపెట్టుకున్నారువైసీపీ స్థాపన తరువాత పోసాని కృష్ణ .. జగన్ పంచకు చేరారు. జగన్ పాదయాత్రలోనూ పాల్గొన్నారు. అయితే జగన్ మాత్రం 2014 నుంచి 2024 వరకు ఏ ఎన్నికల్లోనూ ఆయనకు టికెట్ ఇవ్వలేదు. అయినా 2019 ఎన్నికల సమయంలో జగన్ కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఇండస్ట్రీలో మెంటల్ కృష్ణగా పేరున్న పోసాని నోటి దూకుడు నచ్చి తాను అధికారంలోకి వచ్చాక జగన్ ఏపీ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ హోదా కట్టబెట్టారు. ఇక అప్పటి నుంచి పోసాని నోటికి అడ్డు అదుపులేకుండా పోయిందన్న విమర్శలున్నాయివైసీపీ బూతు నేతల కంటే ఎక్కువగా చంద్రబాబు, పవన్‌లను టార్గెట్ చేశారు .. తాను కమ్మ సామాజికవర్గానికి చెందిన వాడినని చెప్పుకుంటూనే.. కులాన్ని కించపరిచేలా మాట్లాడం, చంద్రబాబు కులాని వాడుకుంటున్నారని విమర్శించడం ఆయనకే చెల్లింది. ఆ క్రమంలో విపరీతంగా బూతు ప్రయోగాలు కూడా చేసి తీవ్ర వివాదాల్లో చిక్కుకున్నారు.ఇక మెగా ఫ్యామిలీపై ఆయన విమర్శలకు హద్దుపొద్దూ లేదంటారు. ఏపీ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ హోదాలో ఆయన జనసేన అధినేత పవన్ కల్యాణ్, మెగాస్టార్ చిరంజీవిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. పవన్ కల్యాణ్ సభలకు వచ్చే జనం ఎవరూ ఓట్లు వేయరని.. పవన్ కల్యాణ్ ఓ మెంటల్ కేసని ప్రెస్ మీట్లు పెట్టి మరీ స్టేట్‌మెంట్లు ఇచ్చారు. అసలు మెగా ఫ్యామిలీ పైసల కోసమే పార్టీలు పెట్టిందని తీవ్ర ఆరోపణలు గుప్పించారు.పవన్‌పై పోసాని చేసిన విమర్శలతో అప్పట్లో జనసైనికులు, వీర మహిళలు పలు కేసులు పెట్టారు. అయితే వైసీపీ అధికారంలో ఉండటంతో పోలీసులను వాటిని పట్టించుకోలేదు. అయితే వీర మహిళల పోరాటంతో రాజమండ్రి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో 2022లో ఆయన పైన పలు సెక్షన్ల కింద కేసు నమోదు అయింది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ జనసేన వీర మహిళ ఇందిర గతంలో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. దాన్ని పోలీసులు పట్టించుకోకపోవడంతో ఆమె కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో కేసు నమోదు చేసినప్పటికీ పోలీసులు పోసానిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అప్పట్లో ఆ వ్యవహారం పెద్ద సంచలనంగా మారింది.కూటమి ప్రభుత్వం వచ్చాక అప్పటి దాకా నోటికి పనిచెప్పిన పలువురు వైసీపీ సీనియర్లు సైలెంట్ అయ్యారు. మెంటల్ కృష్ణ మాత్రం నోటి దూకుడు కంటిన్యూ చేస్తూనే ఉన్నారు. లడ్డూ వివాదం, డిక్లరేషన్ రగడ, జగన్ తిరుమల పర్యటన రద్దు తదితర అంశాలపై పోసాని కృష్ణమురళి అప్పట్లోతీవ్రంగా స్పందించారు. సీఎం చంద్రబాబు టార్గెట్ గా తీవ్ర వ్యాఖ్యలు చేశారు . అంతా కలిసి జగన్ ను ఎందుకు ఇంతలా హింసిస్తున్నారని పోసాని ప్రశ్నించారు. జగన్ తిరుమలకు వెళ్లకుండా అడ్డుకోవడం దారుణం అని బోల్డు ఆవేదన వ్యక్తం చేశారుపనిలోపనిగా జగన్ కు ప్రాణగండం ఉందని పోసాని సంచలన ఆరోపణలు చేశారు. దయచేసి జగన్ ను మాత్రం మర్డర్ చేయించమాకు, మీకు పెద్ద హిస్టరీ ఉంది నాకు తెలుసు.. అంటూ చంద్రబాబుపై తీవ్ర వ్యాఖ్యలు చేశారాయన. ఎప్పుడు పోతామో ఎవరికి తెలుసు, అయినా భయపడేది లేదని హీరోయిజం ప్రదర్శించారు.రాష్ట్రంలో పొలిటికల్ సీన్ మారినా పోసాని మాత్రం దూకుడు తగ్గించడం లేదు. అదే ఆయన మెడకు చుట్టుకునేలా కనిపిస్తుందంటున్నారు. గత ప్రభుత్వంలో టీడీపీ, జనసేన అధినేతల్ని ఇష్టమె?చ్చినట్లు తిట్టిన వారిపై పాత కేసులను పోలీసులు తిరగదోడుతున్నారు. వరుసగా అరెస్టులు కూడా జరుగుతున్నాయి. ఆధారాలతో కేసులు పెడితే చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారుల ప్రకటిస్తున్నారు. ఇటు పోసానిపై నోరు పారేసుకున్నందుకు ఇప్పటికే పెండింగ్ కేసులు ఉన్నాయి.ప్రాధాన్యతా క్రమంలో పోసాని పాతకేసు ఫైళ్లు ఎప్పుడైనా దుమ్ము దులపవచ్చంటున్నారు. ఇక ఓటమి తర్వాత కూడా ఆయన నోటికి పనిచెప్తుండటంతో కొత్త కేసులు నమోదైతే ఆయన పరిస్థితి ఏంటన్న చర్చ నడుస్తుంది. ఇప్పటికే మెగా ఫ్యామిలీపై అనుచిత వ్యాఖ్యలు చేసి ఇండస్ట్రీలో తీవ్ర వ్యతిరేకత తెచ్చుకున్న పోసాని ముందుందు సిల్వర్‌స్క్రీన్‌పై కనిపిస్తారా? లేదా ? అన్నది డౌటే. ఇక పదిహేనేళ్ల రాజకీయ జీవితంతో ఏమన్న సాధించారా అంటే పదేళ్లు ఆయన నోటిని వాడుకున్న జగన్ కనీసం టికెట్ కూడా ఇవ్వలేదు. ఇక ఇప్పుడు కేసుల చట్రంలో ఇరుక్కుంటే మెంటల్ కృష్ణకి అండగా నిలిచేదెవరు?.. అదే ఇప్పుడు రెండు ఇండస్ట్రీల్లో హాట్ టాపిక్ గా మారింది

# మండలికి వెళ్లి... అసెంబ్లీకి డుమ్మాతో... వైసీపీ సాధించేదేమిటీ

నెల్లూరు, నవంబర్ 12, వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఎప్పుడూ రాంగ్ డెసిషన్ తీసుకుంటారు. సలహాదారులు ఎవ్వరో కానీ ఆయనకు పూర్తిగా రాజకీయం వంటబట్టలేదని అంటారు దగ్గర నుంచి చూసిన వాళ్లు. ఎందుకంటే కీలకమైన సమయంలో జగన్ పక్కకు తప్పుకోవడాన్ని అందరూ తప్పు పడుతున్నారు. ప్రధానమైన ప్రజలకు అవసరమైన బడ్జెట్ సమావేశాలను బహిష్కరించి జగన్ సాధించిందేమిటి? అన్న ప్రశ్నకు ఆయన వద్ద సమాధానం మాత్రం లేదు. తమకు మాట్లాడే అవకాశం ఎటూ ఇవ్వరు కాబట్టి ముందుగానే అసెంబ్లీ సమావేశాలను బహిష్కరిస్తున్నట్లు ఆయన ప్రకటించి పెద్ద తప్పు చేశారని వైసీపీ నేతలే అభిప్రాయపడుతున్నారు. శాసనసభ బడ్జెట్ సమావేశాలకు వెళ్లి అక్కడ కేటాయింపులపై నిరసన తెలియజేసి బయటకు వచ్చినా సరిపోయేది కదా? అని కొందరు నేతలు ప్రశ్నిస్తున్నారు. వైసీపీకి వాకౌట్ అన్న ఒక ఆప్షన్ ఉందని జగన్ కు అసలు తెలుసా? అని ప్రశ్నిస్తున్నారు. తాను ముందుగానే ఊహించుకుని తనకు మాట్లాడే అవకాశం ఇవ్వరని తనకు తాను ముందుగా అంచనా వేసుకుని బహిష్కరిస్తానని ప్రకటించడం ఎంతవరకూ కరెక్ట్ అని వైసీపీ నేతలే ప్రశ్నిస్తున్నారు. మాట్లాడేందుకు సరైన అవకాశం ఇవ్వకపోతే అప్పుడే నిరసన తెలిపి అసెంబ్లీ నుంచి బయటకు వస్తే హుందాగా ఉండేదని, ముందుగానే సమావేశాలను బహిష్కరించడమేంటని కొందరు సోషల్ మీడియాలో జగన్ నిర్ణయాన్ని దుమ్మె?త్తిపోస్తున్నారు. ఒకవైపు శాసనమండలిలో జరిగే సమావేశాలకు హాజరవుతూ ఇటు అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉండటం వైసీపీ ద్వంద వైఖరికి నిదర్శనమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. శాసనమండలిలో తమకు బలం ఉండటంతో సమావేశాలకు హాజరు కావడంతో పాటు బలం లేని చోటకు గైర్హాజరవ్వడం ఎందుకని? ఎక్కడైనా తమ వాయిస్ ను వినిపించేందుకు ప్రయత్నించాలని, ప్రజా సమస్యలపై గళమెత్తి చాటాలని, అప్పుడే ప్రజలు విశ్వసిస్తారని జగన్ కు హితవు చెబుతున్నారు. కేవలం పదకొండు మంది సభ్యులున్నంత మాత్రాన ప్రతిపక్షంగా శాసనసభ గుర్తించకపోయినా... హాజరయి తమ గళం వినిపించి ఉంటే ప్రజలు ప్రధాన ప్రతిపక్ష హోదా ఇచ్చి ఉండేవారన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. మొత్తం మీద జగన్ తీసుకున్న నిర్ణయం పార్టీలోనే వివాదానికి కారణమయిం

# వయనాడ్ లో ఒకే ఒక్కడు

తిరువనంతపురం, నవంబర్ 12, రళలోని వయనాడ్ లోక్సభ ఉప ఎన్నికల్లో అనేక పరిణామాలు వెలుగు చూస్తున్నాయి. రాహుల్ గాంధీ రాజీనామా తో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యంగా మారింది. రాహుల్ బదులు ఆయన సోదరి ప్రియాంక గాంధీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. దాదాపు 16 మంది ఇక్కడ పోటీలో ఉన్నారు. అయితే అందులో 15 మంది స్థానికేతరులు కావడం విశేషం. అయితే అందులో ఇద్దరు తెలుగు వ్యక్తులు ఉండడం కూడా అంతకంటే విశేషం. తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండకు చెందిన దుగ్గిరాల నాగేశ్వరరావు అక్కడ పోటీ చేస్తున్నారు. మరొకరు హైదరాబాద్ కు చెందిన డాక్టర్ నాగేశ్వరరావు సైతం బరిలో నిలిచారు. హైదరాబాదులో నివాసం ఉంటున్న నాగేశ్వరరావు జాతీయ జనసేన పార్టీ తరఫున పోటీ చేస్తున్నారు. అలాగే ఏపీకి చెందిన షేక్ జలీల్ నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో దిగుతున్నారు. ఎంపి స్థానానికి ఈనెల 13న పోలింగ్ జరగనుంది. మొత్తం 16 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. 15 మంది స్థానికేతరులు కాగా.. 11 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కావడం గమనార్హం.

× తొలిసారిగా ప్రియాంక

కాంగ్రెస్ అగ్రనేతల్లో ఒకరైన ప్రియాంక గాంధీ తొలిసారిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు.మరొకరు తమిళనాడుకు చెందిన పద్మరాజన్. ఈయనకు మంచి ట్రాక్ రికార్డు ఉంది. ప్రధాన మంత్రులుగా ఉన్న మోదీ, వాజ్పేయి, మన్మోహన్ సింగ్, పీవీ నరసింహారావు తో పాటు ఎంతోమంది రాజకీయ నేతలపై 200కు పైగా ఎన్నికల్లో పోటీ చేశారు పద్మరాజన్.

× 2019 లోక్సభ ఎన్నికల్లో కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై పోటీ చేసిన జయేంద్ర కె. రాథోడ్ సైతం బరిలో దిగారు.

× అలాగే యుపి కిసాన్ మజ్దూర్ బెరోజ్గర్ సంఘ్ కు చెందిన గోపాల్ స్వరూప్ గాంధీ, తమిళనాడు బహుజన్ ద్రావిడ పార్టీ నుంచి సీత పోటీలో ఉన్నారు. తమిళనాడుకు చెందిన నూర్ మహమ్మద్, కర్ణాటక కు చెందిన రుక్మిణి సైతం పోటీలో ఉన్నారు.

× ఉత్తరప్రదేశ్ కు చెందిన సోను సింగ్ యాదవ్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. సిపిఐ నుంచి సత్యన్ మోకేరి, బిజెపి తరఫున నవ్య హరిదాస్ పోటీలో నిలిచారు. కాగా ఇండిపెండెంట్గా పోటీ చేసిన ఆర్ రాజన్ ఒక్కరే వయానాడ్ నియోజకవర్గానికి చెందినవారు కావడం విశేషం. మిగతా అందరూ స్థానికేతరులే.

# వలసల విధానంపై పిడుగేనా

అమెరికా నూతన అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఇంకా గద్దెనెక్కక ముందే.. శ్వేతసౌధంలోకి అడుగు పెట్టకముందే.. వలస విధానంలో సంచలనం చోటు చేసుకుంది. ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ ఈ ఏడాది జూన్‌లో 'కుటుంబాలను కలిపి ఉంచడం'(కీపింగ్ ఫ్యామిలీస్ టుగెదర్) అనే నూతన వలస విధానాన్ని తీసుకువచ్చారు. దీని ద్వారా అమెరికాలో నివసిస్తున్న విదేశీ పౌరులు తమ కుటుంబ సభ్యులకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోయినా.. చట్టబద్ధత పొందే వీలు కల్పించారు. అయితే.. ఈ విధానాన్ని తాజాగా గతంలో డొనాల్డ్ ట్రంప్ నామినేటెడ్ చేసిన టెక్సా?సలోని జిల్లా జడ్జి జస్టిస్ జె. కాంప్‌బెల్ బార్కర్ నిలుపుదల చేశారు."ఈ విధానాన్ని అమలు చేసేందుకు ఫెడరల్ ఏజెన్సీలకు చట్టబద్ధత లేదు" అని తీర్పు వెలువరించారు. దీంతో నూతన విధానానికి అర్హులైన సుమారు 5లక్షల మంది పౌరులపై పిడుగు పడినట్టయింది. ట్రంప్ అప్రతిహత విజయం దక్కించుకున్న కొన్ని గంటల్లోనే ఆయన నామినేట్ చేసిన జడ్జి తీర్పు వెలువరించడం చర్చకు దారితీసింది. అక్రమ వలస దారులను దేశం నుంచి పంపేస్తానని ఎన్నికల సమయంలో ట్రంప్ పదే పదే చెప్పిన విషయం తెలిసిందే. టెక్సాస్ కోర్టు తాజా తీర్పుపై 'అమెరికన్ ఫ్యామిలీస్ యునైటెడ్' సంఘం అధ్యక్షుడు ఆష్లే డీ అజెవెడో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తీర్పు లక్షల మంది ఆశలను ఛిద్రం చేసిందన్నారు.మైగ్రేషన్ అండ్ డెవలప్‌మెంట్ ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ (తిరువనంతపురం) సర్వే ప్రకారం 2023లో కేరళ నుంచి విదేశాలకు ఉన్నత చదువులకోసం 2.5 లక్షల మంది విద్యార్థులు వలస వెళ్లారు. దేశం మొత్తం మీద విదేశాలకు వెళ్లిన మొత్తం విద్యార్థుల సంఖ్యలో కేరళ విద్యార్థుల సంఖ్యే 20% వరకు ఉంటోందని తేలింది. కేరళ నుంచి ఇంత భారీ ఎత్తున విద్యార్థులు వలస వెళ్లడానికి దారి తీసే పరిస్థితులు ఏమిటి? ఈ విధమైన పరిస్థితి కేరళ రాష్ట్రంలోని సామాజిక, ఆర్థిక అంశాలపై విపరీత ప్రభావం చూపిస్తుంది. ఏ దేశంలో ఉపాధికి, ఉద్యోగాలకు అవకాశాలు పుష్కలంగా ఉంటాయో, ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఎక్కడ ప్రోత్సాహకర వాతావరణం ఉంటుందో అక్కడకు ప్రజలు వలస వెళ్లడం సహజం. అలాగే విద్యార్థుల ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు భారీ ఎత్తున అవకాశాలు ఉంటున్నందున విద్యార్థుల వలస విశేష సంఖ్యలో కొనసాగుతోంది.కేరళలో విద్యావంతులు ఎక్కువే. నిరుద్యోగమూ ఎక్కువే. ఉద్యోగాలను ఆశిస్తూ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజిల్లో 2023లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారి సంఖ్య 29 లక్షలు దాటింది. వీరిలో ఎస్ఎస్ఎల్‌సి లేదా అంతకన్నా ఎక్కువ చదువుకున్న వారి సంఖ్య 23 లక్షల వరకు ఉంది. సాంకేతికంగా అర్హత కలిగిన వారు 3.5 లక్షలకు పైబడి ఉన్నారు. దీనికి తోడు యూనివర్శిటీల చదువులు పూర్తి చేసుకుని ఏటా లేబర్ మార్కెట్‌లోకి చేరుతున్న వారి సంఖ్య మరో లక్ష వరకు ఉంటోంది. మరోవైపు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి పనిచేస్తున్న వారి సంఖ్య 20 లక్షలు దాటింది. అలాంటి గెస్ట్ వర్కర్లు ఏ పని చేయడానికైనా సిద్ధంగా ఉంటారు. కానీ నిరుద్యోగులైన విద్యావంతులు మాత్రం ఏపని అయినా చేయడానికి సిద్ధంగా ఉండరు. వీరు తమ సామాజిక హోదాకు తగ్గట్టు ఎక్కువ వేతనం అందించే సుస్థిరమైన ఉద్యోగాలను ఆకాంక్షిస్తుంటారు. అయితే అలాంటి ఉద్యోగాలు చాలా తక్కువగా ఉండటంతో నిరుద్యోగులు అలాగే ఉండిపోతున్నారు. మొత్తం మీద వలస విద్యార్థులు ముఖ్యంగా అమెరికా, కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, జర్మనీ, ఇతర అభివృద్ధి చెందిన దేశాలకు వెళ్లడానికి ముందు వరుసలో ఉండడం పరిపాటి. ఈ దేశాల్లో ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీగా లభించే అవకాశాలు పుష్కలంగా ఉండడమే ఈ ఆకర్షణకు కారణం.కేరళలో ఇచ్చే వేతనం కన్నా అనేక రెట్లు వేతనం విదేశాల్లో ఇస్తున్నారు. ఉదాహరణకు అమెరికాలో పనిచేసే ఒక నర్సు నెలకు రూ. 4,00,000 వరకు సంపాదిస్తోంది. దీనికి తోడు విలాసవంతమైన నివాసం, కార్లు, అత్యంత ఆధునికమైన పరికరాల వినియోగం కేరళలో ఉండే తమ తల్లిదండ్రులకు అందేలా చేస్తోంది. విదేశాల్లో ఈ విధంగా సంపాదించే వేతనాల్లో కనీసం పదోవంతైనా కేరళలోని నర్సుకు దక్కడం లేదు. కలలోనైనా అలాంటి విలాస జీవనం ఊహించే అవకాశం కలగదు. నర్సులే కాదు, దాదాపు అన్ని కేటగిరీలకు చెందిన వర్కర్లు కేరళలో తమ వేతనాలతో అలాంటి విలాసవంత జీవితాన్ని కలగనడానికైనా అవకాశమే ఉండదు. వలస వెళ్లిన వారి కుటుంబాలు కేరళలో అత్యంత విలాసవంతమైన జీవితాలను గడుపుతున్నారు. ఈ కుటుంబాల యువకులు, కుర్రాళ్లు సాధారణంగా తమకు తాము విలాసవంతమైన జీవితాన్నే కోరుకుంటారు. అలాంటి బంగారు స్వప్నాలు వారిని విదేశాలకు వెళ్లి చదువుకోడానికి, అక్కడే ఉద్యోగాలు చేయడానికి దోహదం చేస్తున్నాయి. అయితే చాలా మందికి విదేశాలకు వలస వెళ్లడం పూలబాట కాకపోవచ్చు. అమెరికా ఇటీవల తీసుకున్న నిర్ణయం భారతీయ కుటుంబాలకు చెందిన వేలాదిమంది పిల్లల భవిష్యత్తు త్రిశంకు స్వర్గంగా ఉంటోంది.
చిన్నవయసులో తల్లిదండ్రులతో కలిసి అమెరికాకు వచ్చినవారు అక్కడే పెరిగి, చదువులు పూర్తి చేసుకుని తమకు 21 ఏళ్లు రాగానే అమెరికా ప్రభుత్వం వారిని స్వదేశానికి దయచేయండి అని చెప్పడం వివాదాస్పదంగా తయారైంది.

ఇక తెలుగు రాష్ట్రాల విద్యార్థుల పరిస్థితిని పరిశీలిస్తే అమెరికాలో భారతీయ విద్యార్థుల్లో 12.5 శాతం మంది ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన తెలుగువారే ఉన్నారు. అందువల్ల ఎవరైనా తెలుగు రాష్ట్రాల నుంచి కొత్తగా అమెరికాకు వస్తే తమ చుట్టూ తెలుగువారే ఎక్కువగా కనిపిస్తుండటంతో వారు విదేశాల్లో ఉన్నామన్న భావన కన్నా స్వంత రాష్ట్రాల్లోనే ఉన్నామన్న అనుభూతి కలుగుతోంది. అమెరికాలో తెలుగు మాట్లాడే జనాభా 2016లో 3,20,000 నుండి 2024 నాటికి 1.23 మిలియన్‌కు పెరిగింది. అమెరికా సెన్సస్ బ్యూరో డేటా ఆధారంగా కాలిఫోర్నియాలో అత్యధికంగా తెలుగు మాట్లాడే జనాభా దాదాపు 2,00,000 వరకు ఉంది. ఇప్పుడు అమెరికాలో అత్యధికంగా మాట్లాడే భాషల్లో 11 వ స్థానంలో తెలుగు ఉంది.

# వాత్సల్య తో కోట్లు...

హైదరాబాద్, నవంబర్ 12, చిన్నారులకు బంగారు భవిష్యత్తు అందించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం మరో కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల బడ్జెట్‌లో ప్రకటించిన ఎన్‌పిఎస్ వాత్సల్య యోజనను ప్రారంభించారు. ఎన్‌పిఎస్ వాత్సల్య స్కీమ్‌కు సబ్‌స్క్రయిబ్ చేసుకోవడానికి ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్ కూడా ప్రభుత్వం ప్రకటించింది. ఎన్‌పిఎస్ వాత్సల్య అనేది తల్లిదండ్రులు తమ పిల్లల కోసం చిన్నప్పటి నుండి పెట్టుబడి పెట్టే పథకం. ఇక్కడ దీర్ఘకాలంలో మంచి రాబడి వస్తుంది. కాంపౌండింగ్ ఎఫెక్ట్ అంటే చక్రవడ్డీ కారణంగా పెట్టుబడిపై బహుళ రాబడి లభిస్తుంది. ఇందులో ఇన్వెస్ట్ చేసిన తర్వాత.. రిటైర్మెంట్ తర్వాత.. ఎన్ పీఎస్ ఫండ్ నుంచి ఒకేసారి 60 శాతం వరకు విత్ డ్రా చేసుకోవచ్చు. మిగిలిన 40 శాతం మొత్తాన్ని యాన్యుటీ స్కీమ్‌లలో కొనుగోలు చేయాలి. దీంతో పదవీ విరమణ తర్వాత ప్రతి నెలా పెన్షన్ రూపంలో డబ్బులు పొందవచ్చు.తల్లిదండ్రులు లేదా సంరక్షకులు 18 ఏళ్లలోపు పిల్లల పేరిట ఈ వాత్సల్య ఖాతాను తీసుకోవచ్చు. కనీసం రూ. 1000తో ఖాతా తెరవవచ్చు. గరిష్ట పరిమితి లేదు. ప్రధాన బ్యాంకులు, పోస్టాఫీసులు, పెన్షన్ ఫండ్‌లు లేదా ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్ ఇ-ఎన్‌పిఎస్‌లలో ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. సంరక్షకుడు లేదా తల్లిదండ్రుల గుర్తింపు, చిరునామా రుజువు అవసరం. మైనర్ పుట్టిన తేదీ రుజువు అవసరం.ఇది అకౌంట్ ఓపెన్ చేసినప్పుడు ఎన్‌పీఎస్ వాత్సల్యగా ఉంటుంది. అదే పిల్లలు మేజర్లుగా మారిన తర్వాత.. సాధారణ ఎన్ పీఎస్ ఖాతాగా కొనసాగుతుంది. ఆ తర్వాత కూడా ఈ ఖాతాను కొనసాగించవచ్చు. పదవీ విరమణ వయస్సు వరకు ఇందులో పెట్టుబడి పెట్టడం వల్ల దీర్ఘకాలంలో మంచి ఆదాయం వస్తుంది. ఇది చాలా రకాలుగా ఉపయోగపడుతుంది. దేశంలోని ప్రజలందరికీ సామాజిక భద్రత కల్పించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం 2004లో ఎన్‌పీఎస్ పథకాన్ని ప్రారంభించగా.. ఇక్కడ మంచి పన్ను ప్రయోజనాలు కూడా ఉన్నాయి. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80సి ప్రకారం, ఈ ఆర్థిక సంవత్సరంలో గరిష్ట పెట్టుబడి రూ. 2 లక్షల వరకు పన్ను తగ్గించవచ్చు. దీర్ఘకాలిక పెట్టుబడి పథకంగా బాగా ప్రాచుర్యం పొందిన ఈ పథకం ఇప్పుడు విస్తరించి చిన్న పిల్లలకు కూడా అందుబాటులోకి వచ్చింది.

రూ.5వేలు పెడితే 65కోట్లు

మీ పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉండేలా కేంద్ర ప్రభుత్వం 'ఎన్‌పీఎస్ వాత్సల్య పథకాన్ని' అమల్లోకి తెచ్చింది. 0-17 ఏళ్లలోపు పిల్లల పేరిట ఖాతా తెరవాలి. మీ పిల్లలకు ప్రతి నెలా రూ.5 వేలు పొదుపు చేస్తే సరిపోతుంది. బిడ్డకు 18 ఏళ్లు వచ్చినప్పుడు, వారు ఏటా 12శాతం రాబడితో రూ.40 లక్షలు అందుకుంటారు. మీరు 60 సంవత్సరాల వరకు పొదుపు చేస్తే రూ. 64.5 కోట్లు పొందవచ్చు.

× చిన్న వయస్సు నుండే ఈ పథకంలో పెట్టుబడి పెట్టవచ్చు.

× ఇందులో మీరు చక్రవడ్డీ ప్రయోజనాన్ని పొందవచ్చు. అంటే.. ఏటా సంపద పెరుగుతూ ఉంటుంది.

× మీరు మైనర్‌గా ఉన్నప్పుడే ఈ వాత్సల్య పథకాన్ని ప్రారంభించడం ద్వారా పదవీ విరమణ నాటికి భారీ మొత్తంలో నిధులు పోగుపడతాయని చెప్పవచ్చు.

× చిన్న పిల్లలు పొదుపు చేయడం అలవాటు చేసుకోవచ్చు.

# ఇక ఆర్జీవీకోసం వేట



హైదరాబాద్, నవంబర్ 12,వివాదాస్పద దర్శకుడు రామ్ గోపాల్ వర్మ పై కేసు నమోదు అయ్యింది. గత ఐదేళ్లలో ఆర్జీవి టిడిపి, జనసేనకు వ్యతిరేకంగా చాలా రకాలుగా పోస్టులు పెట్టారు. అందులో అత్యంత వివాదాస్పదం అయినవి కూడా ఉన్నాయి. ఈ తరుణంలో ప్రకాశం జిల్లాలో రామ్ గోపాల్ వర్మపై కేసు నమోదు కావడం విశేషం.ఏపీలో మరో రాజకీయ పరిణామం. ఇప్పటికే వైసీపీ హయాంలో విచ్చలవిడిగా రెచ్చిపోయిన సోషల్ మీడియా ప్రతినిధుల పై కేసులు నమోదు అవుతున్నాయి. కొందరి అరెస్టులు కూడా జరుగుతున్నాయి.గతంలో ఇష్టం వచ్చినట్టు పోస్టులు, వీడియోలు పెట్టిన వారిపై చాలా పోలీస్ స్టేషన్లలో తాజాగా కేసులు నమోదవుతున్నాయి.ఈ ఫిర్యాదులు ఆధారంగా వైసీపీ సానుభూతిపరులుగా ఉన్న సోషల్ మీడియా యాక్టివిటీలపై చర్యలకు దిగుతున్నారు పోలీసులు.కడప జిల్లాలోఓ వ్యక్తి ఫిర్యాదు మేరకు వైసీపీ సోషల్ మీడియా ఇన్చార్జ్ సజ్జల భార్గవ్ రెడ్డి, వర్రా రవీందర్ రెడ్డి, అర్జున్ రెడ్డి ల పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదయింది.మరోవైపు పలువురు యూట్యూబర్లు సైతం అరెస్టయ్యారు. ఈ క్రమంలో టాలీవుడ్ డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మపై సైతం నమోదు కావడం విశేషం. రాంగోపాల్ వర్మ జగన్ తో పాటు వైసీపీకి అనుకూలంగా వ్యవహరించేవారు. గత ఐదేళ్ల కాలంలో చాలా రకాల సినిమాలు వైసీపీకి అనుకూలంగా తీశారు. కమ్మ రాజ్యంలో కడప రెడ్లు, వ్యూహం, ప్రతి వ్యూహం అంటూ చాలా రకాల చిత్రాలను తీసిన సంగతి తెలిసిందే. అటు సోషల్ మీడియా వేదికగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ లపై సైతం విరుచుకుపడేవారు. అయితే ఇప్పుడు ఆ కామెంట్స్ పుణ్యమా అని రామ్ గోపాల్ వర్మపై కేసు నమోదు కావడం విశేషం.వైసీపీ అధినేత జగన్ రాజకీయ నేపథ్యాన్ని వ్యూహం, సిద్ధం పేరుతో సినిమాలను రాంగోపాల్ వర్మ తీసిన సంగతి తెలిసిందే. అప్పట్లోన్యాయచిక్కులు రావడంతో ఈ సినిమా విడుదలలో ఆలస్యం జరిగింది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాంగోపాల్ వర్మ జగన్ కు చాలా దగ్గరయ్యారు. ఈ క్రమంలోనే వైసీపీకి అనుకూలంగా, జగన్ కు మద్దతుగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేవారు. అదే క్రమంలో చంద్రబాబు, పవన్ లపై అనుచిత వ్యాఖ్యలు కూడా చేసేవారు. అప్పట్లో జన సైనికులకు సైతం వ్యతిరేకంగా కామెంట్స్ రాంగోపాల్ వర్మ నుంచి వచ్చేవి. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రామ్ గోపాల్ వర్మ సైలెంట్ అయ్యారు. ఇటీవల వైసిపి సోషల్ మీడియా ప్రతినిధులు అరెస్టులు కొనసాగుతున్న తరుణంలో.. రాంగోపాల్ వర్మ పరిస్థితి ఏంటి అన్నది చర్చకు దారితీసింది.అయితే ఈరోజు అనూహ్యంగా ప్రకాశం జిల్లాలో రామ్ గోపాల్ వర్మపై కేసు నమోదు అయింది. ఓ ఫిర్యాదు మేరకు మద్దిపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. వ్యూహం సినిమా ప్రమోషన్ లో భాగంగా రామ్ గోపాల్ వర్మ కొన్ని వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు, లోకేష్, బ్రాహ్మణి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా వర్మ అప్పట్లో ఒక పోస్ట్ పెట్టారు. దీనిపై ప్రకాశం జిల్లామద్దిపాడు మండల టిడిపి ప్రధాన కార్యదర్శి రామలింగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఐటీ చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు రామ్ గోపాల్ వర్మపై. ఇప్పటివరకు వైసీపీ సామాన్య సోషల్ మీడియా ప్రతినిధులను టార్గెట్ చేశారు. ఇప్పుడు ఏకంగా సెలబ్రిటీలు గా ఉన్న రామ్ గోపాల్ వర్మ లాంటి వారిపై పడడంతో.. ప్రభుత్వం ఎంత సీరియస్ గా ఉందో అర్థం అవుతోంది. వేట మొదలు పెట్టినట్లు అయ్యింది.

# సోషల్ మీడియాలో పోస్టులు... సంచలనాలు
## తాడేపల్లి ప్యాలెస్ నుంచే గైడెన్స్

విజయవాడ, నవంబర్ 12,వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీందర్ రెడ్డిని పోలీసులు మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ కేసు వివరాలను డీఐజీ కోయా ప్రవీణ్ వివరిస్తూ...రాక్షస జాతి చెందిన వారే ఇటువంటి భాషను వాడతారన్నారు. చంద్రబాబు,పవన్, వారి కుటుంబ సభ్యులపై అత్యంత నీచమైన భాషలో పోస్టులు పెట్టారన్నారు.తాడేపల్లి కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకే వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీందర్ రెడ్డి.. అసభ్యకర పోస్టులు పెట్టినట్లు కర్నూలు రేంజ్ డీఐటీ కోయా ప్రవీణ్ తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోంమంత్రి అనిత, ఇతర నేతలపై అసభ్యకర పోస్టుల కేసులో నిందితును అరెస్టు చేసేందుకు పోలీస్ బృందాలు గాలింపు చర్యలు చేపడతున్నాయని డీఐటజీ కోయా ప్రవీణ్ తెలిపారు. చంద్రబాబు, పవన్, అనితపై అనుచిత పోస్టుల కేసులో వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీందర్‌రెడ్డితోపాటు మరో ఇద్దరు నిందితులు సుబ్బారెడ్డి, ఉదయ్‌లను అరెస్టు చేశామన్నారు. వీరిని పోలీసులు మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను డీఐజీ కోయా ప్రవీణ్, కడప ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మీడియాకు తెలిపారు.రాక్షస జాతికి చెందిన వ్యక్తుల తరహాలో చాలా అసహ్యమైన భాషలో చంద్రబాబు, లోకేశ్, పవన్ కుటుంబ సభ్యుల గురించి వర్రా రవీందర్ రెడ్డి పోస్టులు పెట్టారని పోలీసులు తెలిపారు. వర్రా రవీందర్ రెడ్డిని సోషల్ మీడియా అకౌంట్ నుంచి మూడు విధాలుగా పోస్టులు పెడుతున్నారు. వర్రా సొంతంగా కొన్ని పోస్టులు పెడితే..తాడేపల్లి కార్యాలయం నుంచి కొన్ని పోస్టులు, ఎంపీ అవినాష్ రెడ్డి పీఏ పంపిన కొన్ని పోస్టులు పెట్టారన్నారు. షర్మిల, వైఎస్ సునీతారెడ్డిపై పెట్టిన పోస్టులు అవినాష్ రెడ్డి పీఏ పంపినట్లు గుర్తించామన్నారు. అవినాష్ రెడ్డి పీఏ వాట్సాప్ నెంబర్ నుంచి వర్రా రవీందర్ రెడ్డికి ఈ పోస్టులు వచ్చాయన్నారు. అవినాష్ రెడ్డి చెబుతుంటే ఆయన పీఏ ఈ వివరాలు రాసుకుని...వర్రాకు పంపేవారని తెలిసిందన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాల్సి ఉందన్నారు. అలాగే వైఎస్ సునీతారెడ్డి హైదరాబాద్ లో ఫిర్యాదు చేశారని, ఆమె ఏపీలో ఫిర్యాదు చేస్తే ఈ విషయంపై మరింత దర్యాప్తు చేస్తామన్నారు."సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుటుంబ సభ్యులపై నిందితులు వాడిన భాష చాలా అసభ్యకరంగా ఉంది. అరబ్ దేశాల్లో అయితే వీరికి తీవ్ర శిక్షలు ఉంటాయి. వర్రా రవీందర్ రెడ్డి గతంలో భారతి సిమెంట్స్‌లో పనిచేశాడు. ఈ కేసులో అరెస్టైన మరో ఇద్దరు కూడా వైసీపీ సోషల్ మీడియాలో పనిచేస్తున్నారు. డిజిటల్ కార్పొరేషన్ ఉద్యోగులను వైసీపీ అనుకూలంగా వాడుకుని ప్రత్యర్థులపై పోస్టులు పెట్టారని నిందితులు వాంగ్మూలం ఇచ్చారు. వీరిలో కొందరు జడ్జిలకు వ్యతిరేకంగా కూడా పోస్టులు పెట్టారు. ఇలాంటి వారిని 45 మందిని గుర్తించారం.
నిందితులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు పెట్టాం. నిందితులు రాక్షస జాతికి చెందిన వాళ్లలా పోస్టులు పెట్టారు. కుటుంబ సభ్యులు, పిల్లల గురించి అత్యంత నీచమైన భాషలో పోస్టులు పెట్టారు"- డీఐజీ కోయా ప్రవీణ్నిందితులకు 40 యూట్యూబ్ ఛానెళ్లు ఉన్నట్లు గుర్తించామని డీఐజీ ప్రవీణ్ తెలిపారు. నాయకుల ఫొటోలు మార్ఫింగ్ చేసి అనుచితంగా వీడియోలు, పోస్టులు పెట్టేవారన్నారు. వీరికి తాడేపల్లిలోని వైసీపీ కార్యాలయం నుంచి మార్గనిర్దేశం చేసేవారన్నారు. తాడేపల్లిలోని పీవీఆర్ ఐకాన్ బిల్డింగ్ నుంచి వచ్చిన పోస్టులు వీరు సోషల్ మీడియాలో పెట్టేవారు. సభ్య సమాజం తలదించుకునేలా, చాలా అసభ్యకరమైన పోస్టులు పెట్టేవారన్నారు.

మహిళలపై ఇలాంటి పోస్టులు పెట్టిన వారిని రాక్షసజాతికి చెందినవారిగా భావిస్తున్నామని డీఐజీ ప్రవీణ్ అన్నారు.

పూర్వం రాక్షసులు మహర్షుల యాగాలను భగ్నం చేసేందుకు రక్తం వేసేవారని, అలాంటి రాక్షస జాతికి చెందిన వారు ఇప్పుడు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారన్నారు.

# హైదరాబాద్ లో రియల్ ఆఫర్లు...

హైదరాబాద్, నవంబర్ 12, హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ రంగం ఒకరకంగా ఇబ్బందులు పడుతుంది. కొనేవారు లేక అనేక ఫ్లాట్లు మిగిలిపోతున్నాయి. దీంతో బిల్డర్లు భారీ ఆఫర్లను ప్రకటిస్తున్నారు. నిర్మాణాలు ఎక్కువ సంఖ్యలో ఉండటంతో పాటు కొనుగోలు చేసే వారి సంఖ్య కూడా తగ్గింది. దీనికి అనేక కారణాలున్నాయి. ఒకవైపు రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగిరం జరుగుతుండటంతో పాటు ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో కొంత రియల్ ఎస్టేట్ ఏపీ వైపు మళ్లిందని చెబుతున్నారు. ప్రధానంగా విజయవాడ, గుంటూరు పరిసర ప్రాంతాల్లో కొంత రియల్ రంగం ఊపందుకుందన్న వార్తలు వచ్చిన నేపథ్యంలో హైదరాబాద్ లో కొంత పెట్టుబడులు పెట్టే వారి సంఖ్య తగ్గింది.ఎక్కువ మంది పారిశ్రామికవేత్తలు, రియల్టర్లు కూడా ప్రస్తుతం హైదరాబాద్ వైపు కాకుండా అమరావతి, విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం ప్రాంతాల వైపు చూస్తున్నారన్నది కొంత మేరకు వాస్తవం. విశాఖ చుట్టుపక్కల శ్రీకాకుళం వరకూ వెంచర్లు వేసి రియల్ ఎస్టేట్ కంపెనీలు అక్కడ దుకాణాలు తెరిచాయి. అదే సమయంలో అక్కడ భూముల ధరలు తక్కువగా ఉండటంతో పెద్దయెత్తున భూములను కొనుగోలు చేసిన రియల్టర్లు భారీగా వెంచర్లు వేశారు. అయితే హైదరాబాద్ నగరంలో అంతకు ముందు వేసిన వెంచర్లు అలాగే ఉండిపోయాయి. కొన్ని అసంపూర్తి నిర్మాణాలు కాగా, మరికొన్ని పూర్తయిన ఫ్లాట్లు కూడా అమ్ముడు పోక రియల్టర్లు భారీ ఆఫర్లను ప్రకటిస్తున్నారు. ముందుగా ఫ్లాట్ ను బుక్ చేసుకున్న వారికి రిజిస్ట్రేషన్ లో రాయితీలు కల్పిస్తామని కొందరు, మాడ్యులర్ కిచెన్ ఫ్రీగా చేయిస్తామని మరికొందరు, కారు పార్కింగ్ ఫ్రీ అంటూ ఇంకొందరు భారీ ఆఫర్లను ప్రకటిస్తున్నారు. సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలు ఒడిదుడుకులు ఎదుర్కొనడంతో ఎక్కువ మంది ఇళ్లపై పెట్టుబడి పెట్టేందుకు సాహసించడం లేదన్న అభిప్రాయం వెలువడుతుంది. అందుకే భారీ ఆఫర్లను ప్రకటిస్తున్నాయి. కొందరు బిల్డర్లయితే వుడ్ వర్క్ కూడా తామే చేయించి సిద్ధం చేసిన తర్వాత మాత్రమే కొనుగోలు చేయాలని చూస్తున్నాయి. కొందరు అసంపూర్తిగా ఉన్న నిర్మాణాల వెంచర్లలో అయితే ఈఎంఐలు ఏడాది పాటు తామే కడతామని కూడా ఆఫర్లు ఇస్తున్నాయి. ఇలా గతంలో ఎన్నడూ లేని ఆఫర్లు రియల్ రంగంలో కనిపిస్తున్నాయి. అయినా సరే కొనుగోళ్లకు ఎవరూ ముందుకు రావడం లేదు. అయితే కొత్త ఏడాది నుంచి హైదరాబాద్ లో రియల్ బూమ్ పెరుగుతుందన్న అంచనాలు వినపడుతున్నాయి.

# దాడి సమయంలో నిర్లక్ష్యం వహించారా?

వికారాబాద్ జిల్లా కలెక్టర్ పై దుద్యాల మండలంలో కలెక్టర్ పర్యటన ను అడ్డుకొని దాడి చేస్తున్న సమయంలో స్థానిక అధికారులు కానీ పోలీసులు గాని నిర్లక్ష్యం వహించారా అనే విషయంపై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. ఒక జిల్లా కలెక్టర్ పై దాడి జరుగుతున్న సమయంలో అడ్డుకోవడంలో స్థానిక పోలీసులు విఫలమయ్యారని విమర్శలు వినవస్తున్నాయి. ఏకంగా కలెక్టర్ పైనే ఇలా జరిగితే ఇతర అధికారుల పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. గో బ్యాక్ అంటూ కలెక్టర్ ను అడ్డుకుంటున్న తరుణంలో పోలీసులు ఎవరు కలెక్టర్ పక్కన లేకపోవడం ప్రత్యక్షంగా కనిపిస్తోంది.

# భారీగా తగ్గిన నాన్ వెజ్

హైదరాబాద్, నవంబర్ 12, నాన్ వెజ్ ప్రియులకు సండే మండేతో తేడా లేదు. ఎప్పుడు పెట్టినా నాన్ వెజ్ లాగించేస్తారు. కానీ ధరలు ఎక్కువ ఉంటే మాత్రం కాస్త ఆలోచించక తప్పదు. అలాంటప్పుడు వారానికి ఒకటి రెండు సార్లు మాత్రమే తినగలరు. కానీ ధర తక్కువ ఉంటే వారికి పండగే అని చెప్పాలి. తినాలి అనిపించడమే ఆలస్యం తెచ్చుకుని వండుకోవడమే.అయితే అలాంటి నాన్ వెజ్ ప్రియులకు ఇది గుడ్ న్యూస్ అనే చెప్పాలి. కార్తీకమాసం కావడంతో చాలా మంది నాన్ వెజ్ కు దూరంగా ఉంటారు. ప్రతి ఇంట్లోనూ పూజలు చేస్తుంటారు. దేవుడిని ఆరాధిస్తూ చాలా పవిత్రంగా ఉంటారు. దీంతో చికెన్ ధరలు భారీగా తగ్గబోతున్నట్టు సమాచారం అందుతోంది. రెండు వారాల క్రితం చికెన్ ధరలు భారీగా ఉన్నాయి. స్కిన్ లెస్ చికెన్ కిలో రూ.270 నుండి రూ.300ల మధ్య ఉంది.కాగా ప్రస్తుతం ధరలు చాలా వరకు తగ్గిపోయాయి. చాలా పట్టణాలలో కేజీ చికెన్ రూ.180 నుండి 200 మాత్రమే ఉంది. అంతే వంద నుండి 70 రూపాయాల వరకు తగ్గిపోయింది. అయితే చికెన్ కు డిమాండ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో మాత్రం ధరలు అలాగే కొనసాగుతున్నాయి. ఇక ఈ నెల చికెన్ ధరలు మరింత తగ్గుతాయని మార్కెట్ వర్గాలలో చర్చ జరుగుతోంది. అంతే కాకుండా డిసెంబర్ నెలలో తిరిగి ధరలు పుంజుకునే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

# ఎన్యూమరేటర్లకు కొత్త కష్టాలు

కరీంనగర్, నవంబర్ 12, తెలంగా?ణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో వివరాలు వెల్లడించడానికి ప్రజలు నిరాకరిస్తుండటంతో ఎన్యూమరేటర్లు ఇక్కట్ల పాలవుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన ఇంటింటా కుటుంబ సమగ్ర సర్వే సర్కార్ కు సవాల్ గా మారింది. అభ్యంతరకరమైన ప్రశ్నలతో సమాచారం ఇచ్చేందుకు కొందరు ముందుకు రావడం లేదు.సమాచారం సేకరించేందుకు వెళ్లిన వారికి జనం ప్రశ్నల వర్షం కురిపించడంతో ఎన్యూమరేటర్ లు ఇక్కట్ల పాలవుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఏకంగా ఓ గ్రామస్థులు సమగ్ర సర్వేను బహిష్కరించారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వే కు ఆటంకాలు ఎదురు అవుతున్నాయి. ఈనెల 6 నుంచి ప్రారంభమైన సర్వేలో మొదటి మూడు రోజులు ఇంటింటా సమగ్ర సర్వేకు సంబంధించి ఎన్ని కుటుంబాలు ఉన్నాయో అన్ని స్టిక్కర్లు అంటించే ప్రక్రియ కొనసాగింది. శనివారం నుంచి కుటుంబాల వివరాలు సేకరించే సమగ్ర సర్వే నిర్వహిస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో చాలా చోట్ల ఆదివారం నుంచి సమగ్ర సర్వే మొదలయింది. సరిపడా స్టిక్కర్లు, ఫామ్స్ రాక నత్తనడకన సర్వే సాగుతుంది.సర్వేలో 75 ప్రశ్నావళిలో కొన్ని అంశాలకు సమాధానం చెప్పేందుకు జనం కొందరు ముందుకు రావడం లేదు. తమ ఆస్తులు, అప్పులు మీకెందుకని ప్రశ్నిస్తున్నారు. తమ రాజకీయ నేపథ్యం ప్రభుత్వానికి ఎందుకు? అంటున్నారు. ఎదురు ప్రశ్నలు వేయడం... అడిగిన సమాచారం ఇవ్వకపోవడంతో ఒక్కో కుటుంబం వివరాలు సేకరించేందుకు ఎన్యూమరేటర్లకు 40 నుంచి 60 నిముషాల టైమ్ పడుతుంది.దీంతో రోజుకు ఒక్కో ఎన్యూమరేటర్ పది కుటుంబాల వివరాల కంటే ఎక్కువ సేకరించలేకపోతున్నారు. సర్వే తమకు సమస్యగా మారి ఇబ్బందులు ఎదుర్కొక తప్పడం లేదంటున్నారు

ఎన్యూమరేటర్లు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 1958 ఎన్యూమరేట్ బ్లాక్ లు ఒక్కొక్క బ్లాక్ లో 175 కుటుంబాలు ఉండగా 1964 మంది ఎన్యూమరేటర్ లు సర్వే విధుల్లో ఉన్నారు.గడిచిన రెండు రోజుల్లో 20 వేల కుటుంబాల వివరాలు కూడా సేకరించలేకపోయారు. ఇలా అయితే సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాల సేకరణకు ఎన్ని రోజులు పడుతుందో అర్థం కావడం లేదంటున్నారు ఎన్యూమరేటర్లు.గ్రామ సరిహద్దుల వివాదం సమగ్ర సర్వేకు అడ్డంకిగా మారింది. సరిహద్దు విషయంలో స్పష్టత ఇవ్వాలంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వెంకట్రావుపల్లె గ్రామస్తులు ఇంటింటి కుటుంబ సర్వేను బహిష్కరించారు. స్టిక్కర్లు వేయనీయలేదు..

సర్వేకు వచ్చిన ఎన్యూమరేటర్ లకు అధికారులకు వివరాలు చెప్పడం లేదు. సర్వేను సాగనివ్వలేదు.ఇటీవల గ్రామ సరిహద్దులు మార్చుతూ గెజిట్ వచ్చింది. గ్రామస్తులు దానిని వ్యతిరేకిస్తూ నెల క్రితం ఎంపీడీవో, తహసీల్దార్లకు వినతిపత్రాలు ఇచ్చారు. అయినా స్పందన రాకపోవడంతో ఇంటింటా కుటుంబ సమగ్ర సర్వేకు దూరంగా ఉన్నారు. సిరిసిల్ల ఆర్డీవో వెంకటఉపేందర్ రెడ్డి గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామ సరిహద్దు ప్రాంతాన్ని పరిశీలించి, మళ్లీ సర్వే చేయిద్దామని.. కుటుంబ సర్వేకు సహకరించాలని కోరారు.

కానీ సరిహద్దును రీసర్వే చేశాకే సర్వేకు సహకరిస్తామని గ్రామస్తులు స్పష్టం చేశారు.

# జనవరి నుంచి జనాల్లోకి కేసీఆర్



హైదరాబాద్, నవంబర్ 12, భారత రాష్ట్ర సమితి చీఫ్ కేసీఆర్ మరోసారి ఫీల్డ్ లోకి వచ్చేందుకు రెడీ అవుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంముగిసిన తర్వాత ఆయన పార్టీ నేతల్ని కలవడం మానేశారు. పూర్తిగా ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. ఎవరైనా పుట్టినరోజు సందర్భంగా వస్తే అశీర్వదించడం తప్ప రాజకీయాలు మాట్లాడి చాలా కాలం అయింది. అయితే హఠాత్తుగా ఆయన ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలకు సమయం ఇచ్చారు. రాజకీయ అంశాలు మాట్లాడారు. దాంతో కేసీఆర్ .. మళ్లీ ట్రాక్‌లోకి వస్తున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది.భూపాలపల్లిజిల్లాలో ఇటీవల ఓ యువకుడు ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నారు. రేవంత్ ప్రభుత్వ నిర్వాకం కారణంగానే ఈ పరిస్థితి వచ్చిందని త్వరలో వారింటికి వెళ్లి పరామర్శించాలని కేసీఆర్ నిర్ణయించుకున్నారు. ఈ విషయాన్ని వరంగల్ జిల్లా పార్టీ నేతలకు చెప్పారు.అంటే.. కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వ బాధితుల్ని పరామర్శించడానికి వెళ్లేందుకు రెడీ అవుతున్నారని అనుకోవచ్చు. ఇటీవలి కాలంలో పలు చోట్ల కాంగ్రెస్ పార్టీ బాధితులు ఉన్నారని..కూల్చివేతలు ..ఇతర సమస్యల్లో ప్రశ్నించిన వారిని ఇబ్బంది పెట్టారనికేసీఆర్ వారందర్నీ పరామర్శించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇటీవల సోషల్ మీడియా ఫ్లాట్ ఫాం ఎక్స్ లో ఆస్క్ కేటీఆర్ అనే ప్రోగ్రాం నిర్వహించి నెటిజన్లు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చిన కేటీఆర్..కేసీఆర్ ఆరోగ్యం చాలా బాగుందని..2025లో ఆయన ఫీల్డ్ లోకి వస్తారని ప్రకటించారు. ఆ ప్రకారం ఇప్పుడు మెల్లగా గ్రౌండ్ ప్రిపేరింగ్ ప్రారంభించారని అనుకుంటున్నారు. ఎన్నికలు ఇంకా దూరంలో ఉన్నందున ఇప్పటి నుంచే ఎన్నికల హడావుడి అని కాకుండా ప్రభుత్వ బాధితుల వద్దకు పరామర్శకు వెళ్లేలా ప్లాన్ చేసుకుంటే మంచి మైలేజ్ వస్తుందని భావిస్తున్నారు. అసెంబ్లీకి రావాలిని రేవంత్ రెడ్డి పదే పదే సవాల్ చేస్తున్నారు. కేసీఆర్ కూడా ఈ సారి సడెన్ సర్‌ప్రైజ్‌గా అసెంబ్లీకి వచ్చి అధికార వర్గాలను షాక్‌కు గురి చేసే అవకాశం ఉందని బీఆర్ఎస్‌లో చర్చ జరుగుతోంది. ప్రధాన ప్రతిపక్ష నేత, పదేళ్లు సీఎంగా చేసిన నేత అసెంబ్లీకి వస్తే సీఎం రేవంత్ రెడ్డి దూకుడుకు అడ్డుకట్ట వేసేందుకు సరైన వ్యూహమని నమ్ముతున్నారు. ఈ విషయంలో బీఆర్ఎస్ పార్టీ వ్యూహకర్తలు తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. మొత్తంగా రేవంత్ రెడ్డి దూకుడును తగ్గించడానికి.. ఎదురు దాడి చేయాడనికి కేసీఆర్ వీలైనంత త్వరగా ఫీల్డ్ లోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# మూడు పార్టీలకు ప్రతిష్టాత్మకం

కరీంనగర్, నవంబర్ 12, ఉత్తర తెలంగాణ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రధాన పార్టీలు ఫోకస్ పెట్టాయి. ఈ నెల ఆరో తేదీతో తో పట్టభద్రుల ఓట్ల నమోదు ప్రక్రియ ముగిసింది. అయితే అనుకున్న స్థాయిలో ఓట్లు నమోదు కాకపోవడంతో ఆశావాహులు నిరాశగా ఉన్నారు. అయితే ప్రధానపార్టీలు మాత్రం ఈ ఎమ్మెల్సీ సీటును కైవసం చేసుకునేందుకు కసరత్తు మొదలుపెట్టాయి. ఓటర్లను ఆకర్షించడానికి ఎవరి వ్యూహాలు వారు రెడీ చేసుకుంటున్నారు . ముందుగానే ఆభ్యర్థులను ఖరారు చేసి.. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు ముందే ప్రచారానికి తెర లేపడానికి పావులు కదుపుతున్నారు.ఉత్తర తెలంగాణలో త్వరలో జరగనున్న కరీంనగర్, అదిలాబాదు, నిజామాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం కైవసం చేసుకోవడానికి ప్రధాన పక్షాలు వ్యూహ, ప్రతివ్యూహాల్లో నిమగ్నమయ్యాయి. ముందుగానే అభ్యర్థులను ఖరారు చేయడానికి కసరత్తు మొదలుపెట్టాయి. అధికార కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల వేటలో నిమగ్నం అయ్యాయి. కాంగ్రెస్ ఇప్పటికే ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను సేకరించింది. అదే విధంగా బిజెపి నలుగురు పేర్లతో అధిష్టానానికి జాబితాను పంపింది. బిఆర్ఎస్ మాత్రం ఎక్కడ కూడా హడావుడి చేయడం లేదు.పట్టభద్రుల లో ముప్పై నుండి ముప్పై ఐదు శాతం మాత్రమే ఓటును నమోదు చేసుకోవడంతో.. అభ్యర్థిత్వాలు ఆశిస్తున్న వారు నిరాశకు గురవుతున్నారు. ఈ ఎన్నికల్లో పోటీపై బీఆర్ఎస్ క్లారిటి ఇవ్వడం లేదు. ఒకరిద్దరూ నేతలు మాత్రం తాము బరిలో ఉంటామని ప్రచారం చేసుకుంటున్నారు. కాని బీఅర్ఎస్ నాయకత్వం నుండి వారికి ఎలాంటి సిగ్నెల్స్ లేవంట. కాంగ్రెస్, బిజెపి మాత్రం దూకుడు పెంచాయి. ఈ సీటుపై మరింత ఫోకస్ పెట్టి బలమైనా అభ్యర్థుల కోసం అన్వేషిస్తున్నాయి.ఉత్తర తెలంగాణలో 2023 అసెంబ్లీ ఎన్నికల వరకు బలంగా ఉన్న బీఆర్ఎస్ తర్వాత ఢీలా పడిపోవడతో ఎమ్మెల్సీఎన్నికలలో ఆ పార్టీ వ్యూహం ఏంటో అంతుపట్టకుండా తయారైంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉత్తర తెలంగాణలో కాంగ్రెస్ అనూహ్యంగా పుంజుకుంది. బిజేపీ సైతం ఉత్తర తెలంగాణలో నాలుగు ఎంపీ సీట్లతో పాటు, ఏడు అసెంబ్లీ స్థానాలు కైవసం చేసుకుని గట్టి పోటీ ఇవ్వడానికి సిద్దమైంది. లోక్‌సభ ఎన్నికల తరువాత జరగనున్న ఈ ఎమ్మెల్సీ ఎన్నిక కాంగ్రెస్‌కి ప్రతిష్టాత్మకంగా మారింది.ఇంకా షెడ్యూల్ వెలువడని ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం కోసం కాంగ్రెస్, బీజేపీలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి.ఇప్పటి నుండే ఈ ప్రాంతం పైనా దృష్టి పెట్టింది.. కాంగ్రెస్ ఉత్తర తెలంగాణ కి చెందిన మంత్రులకు ఎన్నికల బాధ్యతలను అప్పగించినట్లు తెలిసింది. అలాగే కేంద్ర మంత్రిగా ఉన్న కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కి ఈ ఎమ్మెల్సీ ఎన్నిక ఇజ్జత్ కా సవాల్‌లా మారిందంట. ఆయనతో పాటు నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ బీజేపీ ఎంపీలకు ఈ ఎన్నికల బాధ్యతలను అధిష్టానం అప్పగించిందంటున్నారు.నెలాఖరుకి కాంగ్రెస్, బీజేపీలు ఎమ్మెల్సీ అభ్యర్ధులను ప్రకటించే అవకాశం ఉందంటున్నారు .

ఈ ఎన్నికల్లో గులాబీ పార్టీ స్టాండ్ ఏంటో మాత్రం ఎవరికీ అంతుపట్టడం లేదు. ఇప్పటివరకు ఎమ్మెల్సీ ఎన్నికకి సంబంధించి బీఆర్ఎస్ ఒక్క సమావేశం కూడా నిర్వహించలేదు. అయితే కాంగ్రెస్‌ని ఎదుర్కోవాలంటే తమకే సాధ్యమని స్థానిక గులాబీ నేతలు జబ్బలు చరుచుకుంటున్నారు . పోటీలోఎలాంటి డౌట్ లేదు , కదన రంగంలో నిలవడం గ్యారంటీ అని ప్రచారం చేసుకుంటున్నారు. మరి ఈ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్లు ఎవరి తలరాత ఎలా రాస్తారో చూడాలి

## పెద్దపల్లి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

పెద్దపల్లి :నవంబర్ 12 పెద్దపల్లి జిల్లా కేంద్రం శివారులోని రంగంపల్లివద్ద మంగళవారం తెల్లవారు జామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది, ఓ కారు వేగంగా వచ్చి, అదుపుతప్పి.. నడుచు కుంటూ వెళ్తున్న ముగ్గురు మహిళలను ఢీకొట్టింది.దీంతో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో మహిళకు తీవ్రగాయాలయ్యాయి. ఆమెను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ మహిళ పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది,ఆమెకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మహిళ పెద్దపల్లి లోని ఉదయనగర్కు చెందిన అమృత, భాగ్య అని అధికారులు గుర్తించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# వంశీరామ్ కు వరస తలనొప్పులు

హైదరాబాద్, నవంబర్ 12,లిటిగేషన్ భూముల్లో లే అవుట్లు వేయాలంటే అది ఒక్క వంశీరాం బిల్డర్స్‌కే చెల్లు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నన్నాళ్లూ ఆడిందే ఆటగా సాగించాడు వంశీరాం సుబ్బారెడ్డి. కేటీఆర్ బినామీగా ముద్ర పడిన ఈయన, గత పదేళ్లలో ఎన్నో లిటిగేషన్ భూములకు లైన్ క్లియర్ అయింది. యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపట్టాడు. కానీ, ప్రభుత్వం మారడంతో సీన్ రివర్స్ అయింది. తెలంగాణ వచ్చే నాటికి బంజారాహిల్స్ 403 సర్వే నెంబర్‌లో వందల ఎకరాలు ఖాళీగా ఉంది. అందులో సుప్రీం తీర్పులతో కొంతమంది వశమైంది. కానీ, ఓ 5 ఎకరాల భూమి నిరంతరం సమస్యల సుడిగుండంలో తిరుగుతూ ఉంది. ఆ భూమిలో బీఆర్ఎస్ సర్కార్ వచ్చాక వంశీరాం బిల్డర్స్ నిర్మాణాలు చేపట్టింది. దీనివెనుక ఎంతో బరితెగింపు నిర్ణయాలు ఉన్నాయి. 1954 ? 1955లో 403 సర్వే నెంబర్ ప్రకటించారు. బై నెంబర్స్ వేస్తూ పట్టా భూమి అని పహానీల్లో పేర్లు పొందుపర్చారు. ఇందులో 5 ఎకరాల వివాదాస్పద భూమిలోకి వంశీరాం బిల్డర్స్ ఎంటరైంది. కోర్టు కేసులు పెండింగ్‌లో ఉండగానే 2 ఎకరాల భూమి కోసం వంశీరాం బిల్డర్స్ రూ.47 కోట్లు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకుంది. అమ్మకందారుడికి గతంలో ప్రభుత్వం రెగ్యులరైజేషన్ చేసింది 6,700 మీటర్లే. కానీ, మరో వెయ్యి మీటర్లు ఎక్కువ రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. సర్వే చేయకుండానే భూమి ఎంత ఉంది. ఎంత రిజిస్ట్రేషన్ అయిందో తెలియకుండానే అన్నీ జరిగిపోయాయి. పనులు ప్రారంభమయ్యాయి. హైకోర్టులో, లోయర్ కోర్టులో కేసులు ఉండటంతో లోన్స్ ఇచ్చేందుకు బ్యాంకర్లు ముందుకు రాలేదు. దీంతో బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉండే పెద్దల బంధువులు పెట్టుబడులు పెట్టారు. రూ.100 కోట్లకు పైగా బ్లాక్ మనీ పెట్టుబడుల రూపంలో ఇక్కడి నిర్మాణాల కోసం చేరిందని సమాచారం. 2017లో అనుమతులు వచ్చినా, డబ్బుల కొరతతో ప్లాన్ రివైజ్ పేరుతో 2021 వరకు అప్‌గ్రేషన్ చేసుకున్నారు. ఇప్పుడు 40 ఏళ్లుగా ఉన్న ఈ లిటిగేషన్ భూమిలో కొంటే అంతే అని గ్రహించి ఇప్పుడెవరూ ముందుకు రావడం లేదు.బంజారాహిల్స్ వివాదాస్పద భూమిలో అక్రమంగా అనుమతులు పొంది, కోట్ల రూపాయలు వెనకేసుకున్న వంశీరాం బిల్డర్స్ ఖాజాగూడలో రూ.3వేల కోట్ల విలువైన 27 ఎకరాల పొరంబోకు భూమిపైనా కన్నేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దీనిపై ఫైట్ చేసి ఉంటే వేల కోట్ల ఆదాయం వచ్చేది. ఓ జూనియర్ న్యాయవాది అయిన ప్రభుత్వ అసిస్టెంట్ ప్లీడర్‌తో ఎలాంటి వివాదం లేదని చెప్పించింది. దీంతో హైకోర్టు కలెక్టర్‌కే తుది నిర్ణయం అప్పగించగా, ఇదే అదునుగా ఆ పొరంబోకు స్థలం పట్టాగా మారిపోయింది. దీనికోసం 60 కోట్ల రూపాయలు అప్పటి కలెక్టర్ తీసుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. సర్వే నెంబర్ 27లో మొత్తం 64 ఎకరాల 26 గుంటల భూమి ఉంది. ఇదంతా పోరంబోకు స్థలం. సేత్వార్, ఖాస్రా పహాణీలో రికార్డ్ అయి ఉంది. పాత సర్వే నెంబర్స్ 117/3/1 పేరుతో సేస్సాల్‌లో 1955 ? 58 వరకు ప్రభుత్వ భూమిని డివైడ్ చేశారు. ఆ తర్వాత దూడల సాయన్న పేరు తెరపైకి వచ్చింది. పొజిషన్ కాలంలో ఇది రికార్డు అయింది. 2023 వరకు రికార్డుల్లో ఉన్న పోరంబోకు భూమిని, సడెన్‌గా పట్టాదారుడికి పట్టం కట్టేలా నిర్ణయాలు తీసుకున్నారు అప్పటి కలెక్టర్, సీసీఎల్‌ఏ అధికారులు. అత్యంత విలువైన, వివాదాస్పద భూమిని వంశీరాం బిల్డర్స్ సుబ్బారెడ్డికి అంటగట్టడంలో అనేక మలుపులు ఉన్నాయి. పట్టా భూమిగా ఉత్తర్వులు ఇస్తే 1960 నుంచి 1995 వరకు అనుభవదారుని కాలంలో ఉన్న 20 మంది రైతులకు రక్షిత కౌలుదారు చట్టం ? 1950 వర్తిస్తుంది. ఒరిజినల్ సూట్ (నెం.17 ఆఫ్ 1999)లో పల్లవి స్కూల్ కొమురయ్య కుటుంబానికి వ్యతిరేకంగా పావులు కదిపారు. 2006లో రైతులకే డిక్రీ ఇస్తూ రంగారెడ్డి సివిల్ కోర్టు తీర్పునిచ్చింది. పల్లవి స్కూల్ లే అవుట్ చేసిన తర్వాత బేవర్లీ హిల్స్ ఓనర్స్ సొసైటీ వాళ్లు ఓఎస్ (నెం.587/1999) దాఖలు చేశారు. కానీ, 2007లో కోర్టు కొట్టివేసింది. మళ్లీ కౌలు రైతులు 2001లో మరో సూట్ (ఓఎస్ నెం.114/2001) దాఖలు చేశారు. దీనిపై 2013న ఫైనల్ అర్డర్ వచ్చింది. కౌలుదారులకే ఈ భూమి వస్తుందని తెలిపారు. బేవర్లీ వాళ్లు అప్పీల్‌కి వెళ్తే అక్కడ ఎదురుదెబ్బ తగిలే అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వ భూమిపై ఇరు పార్టీలు కాంప్రమైజ్ అయ్యాయి.నార్సింగి ఏరియాలో మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి 5 ఎకరాలకు ఎసరు పెట్టారు. అనుకున్నది అనుకున్నట్లు సక్సెస్ అయ్యారు. అన్ని అనుమతులు వచ్చాయి. 38 అంతస్తుల కమర్షియల్, మల్టిప్లెక్స్ బిల్డింగ్ నిర్మాణం మొదలైంది. సర్వే నెంబర్ 205లో జరిగిన అక్రమాలపై ఆరా తీస్తే, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ రెడ్డి, క్రెడాయికి చెందిన కాశం రాజేశ్వర్, వంశీరాం సుబ్బారెడ్డి ఘనకార్యం బయటపడింది. గత ప్రభుత్వాలను మేనేజ్ చేసి స్పెషల్ జీవోలు ఇప్పించుకున్నా, చిన్న చిన్న తప్పిదాలతో టైటిల్ వివాదాలు కొనసాగుతున్నాయి. 2019లో డెవలప్మెంట్‌కి కాశం రాజేశ్వర్ అనే బిల్డర్ భూమిని తీసుకుని బీఆర్ఎస్ సహాయ సహకారాలతో క్లియర్ చేసుకున్నాడు. 2020లో ధరణిలో మళ్లీ అమోయ్ కుమార్ గత చరిత్ర తవ్వి కొర్రీలు పెట్టాడు. ఆయనకు పర్సంటేజీలు వెళ్లడంతో ధరణిలో క్లియర్ చేశారు. ఇదంతా వంశీరాం సుబ్బారెడ్డి ఎంట్రీతో క్లియర్ అయిందని వినికిడి. అమోయ్ కుమార్ ధరణిలో ఎంట్రీలతోనే ప్రస్తుతం ఉన్న బౌండరీలు ఫిక్స్ చేసుకుని పొజిషన్‌లో ఉన్నవారిపై కేసులు పెట్టించి ఖాళీ చేయించారు. దీంతో ప్రభుత్వానికి 2013లోనే 50 లక్షల రూపాయల ఆదాయం రాకుండా పోయింది. నాలా కన్వర్షన్ చేసుకోకుండానే కేవలం వ్యవసాయ భూమి విలువతోనే డీజీపీఏ కమ్ జీపీఏ చేసుకున్నారు. దీంతో రూ.15 లక్షల్లో మొత్తం భూమి వంశీరాం వినీల్ వెంచర్స్ ఎల్‌ఎల్‌పీకి బదలాయించారు. ఇదే భూమి నాలా కన్వర్షన్ చేస్తే ప్రభుత్వానికి అక్షరాలా రూ.45 కోట్లకు స్టాంప్స్ అండ్ డ్యూటీ చెల్లించాల్సి ఉండేది.హయాంలో అన్నీ అనుకున్నట్టు జరగగా, ఇప్పుడు వంశీరాం సుబ్బారెడ్డి ఏది అనుకున్నా రివర్స్ కొడుతోంది. దీంతో బిచాణా ఎత్తేస్తున్నాడా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ముఖ్యంగా ఖాజాగూడ 27/2లో 25 ఎకరాల ప్రభుత్వ భూమి విషయంలో లాలూచీ పడి చేయించుకున్న వ్యవహారాల్లో చిక్కులు మొదలయ్యాయి. ఇంకా ఇతర ప్రాజెక్టుల్లోనూ ఇదే తంటా. ఖాజాగూడలో అయితే, 5 లక్షల స్క్వేర్ ఫీట్లు అమ్ముడుపోక ఇబ్బంది పడుతున్నాడు. ఇప్పుడున్న పరిస్థితుల్లో బిచాణా ఎత్తేసే పరిస్థితికి వచ్చేసినట్టు తెలుస్తోంది. పైగా వంశీరాం బిల్డర్స్‌పై మార్కెట్‌లో విలువ తగ్గిపోయింది. దీంతో భూములు, సొంత ఆస్తులను అమ్మకానికి పెట్టినట్టు సమాచారం. గత ప్రభుత్వంలో మ్యానేజ్ చేసి అనుమతులు తీసుకుంటే, ఇప్పుడు ప్రభుత్వం మారడంతో తంటాలు పడాల్సి వస్తోంది. లిటిగేషన్ ల్యాండ్స్ కావడంతో వంశీరాం భూములు తీసుకునేందుకు జనం వెనుకాడుతున్నారు. దీంతో దీన్ని కొనసాగించాలా లేదా అయోమయంలో వంశీరాం సుబ్బారెడ్డి ఉన్నాడు. థర్డ్ పార్టీ దొరికితే సెటిల్మెంట్‌కు ఇచ్చే యోచనలో ఉన్నాడని తెలుస్తోంది. ఉన్న అప్పులు తీర్చుకుని ఇందులో నుంచి ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా బయటపడే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. గతంలో ఈడీ, ఐటీని మ్యానేజ్ చేసిన వంశీరాం, ఈసారి ఏం చేయాలన్నా కుదరడం లేదు. ఆ తంటాలు పడలేక, కోర్టు చుట్టూ తిరగలేక బిచాణా ఎత్తేసే ప్లాన్ చేసుకున్నట్టు రియల్ ఎస్టేట్ వర్గాల్లో చర్చ జరుగుతోంది

# మూడు నెలల ముందే నుంచి ఎన్నికల హడావిడి

అదిలాబాద్, నవంబర్ 12, తెలంగాణలో మూడు ఎమ్మెల్సీ స్థానాల పదవీకాలం మార్చి 29తో ముగియనుంది. నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గంలో నుంచి ఎమ్మెల్సీగా ఎంపికైన కాంగ్రెస్ సీనియర్ నేత టి జీవన్ రెడ్డి పదవీకాలం పూర్తి కానుంది. ఆ స్థానంలో కొత్తవారిని ఎన్నుకునేందుకు వీలుగా ఎన్నికలు నిర్వహించనుంది. ఎన్నికల కసరత్తును ఎలక్షన్ కమిషన్ ఇప్పటికే ప్రారంభించింది. ఓటర్ల జాబితా కోసం ఎన్నికల సంఘం షెడ్యూలు ప్రకటించింది. డిసెంబర్ 12న ఓటర్ల తుది జాబితా ప్రచురించనున్నారు.నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ ఎమ్మెల్సీ నియోజకవర్గాలలో ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న జీవన్ రెడ్డి 2025 మార్చి నెలలో ఎమ్మెల్సీ పదవి కాలం ముగుస్తున్న నేపథ్యంలో ఇప్పటినుంచే తమ ప్రచారాలు ప్రారంభించారు. అయితే ఈసారి జరగబోయే పట్టభద్రుల ఎన్నికలు గతంలో కంటే అధిక పోటీ ఇచ్చేందుకు అన్ని రంగాల వారు సిద్ధమవుతున్నారు. ముందస్తు కసరత్తు ప్రారంభించారు.

ప్రముఖ వ్యాపారవేత్త ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వుట్కూరి నరేందర్ రెడ్డి, ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ, ప్రముఖ వైద్యుడు మాజీ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బి.ఎన్.రావు, కరీంనగర్ మాజీ మేయర్ సివిల్ సప్లై చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్, డాక్టర్ చంద్రశేఖర్, కిసాన్ మోర్చా జాతీయ అధ్యక్షుడు కొలసాని సుగుణాకర్ రావు, ట్రస్మ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్ రావు పట్టభద్రుల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తికరంగా ఉన్నట్టు తెలుస్తుంది. అయితే రాబోయే పట్టభద్రుల ఎన్నికల్లో ఈసారి గట్టి పోటీ ఇచ్చేందుకు ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ప్రచారాలను ప్రారంభించారు.ప్రధాన పార్టీల విషయాలకు వస్తే బిఆర్ఎస్ పార్టీ నుంచి మాజీ సివిల్ సప్లై చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ బీజేపీ నుంచి జాతీయ కిసాన్ మోర్చా అధ్యక్షుడు సుగుణాకర్‌రావుకు ఛాన్స్ ఉందని తెలుస్తోంది. పార్టీ నుంచి కూడా వారికి గ్రీన్ సిగ్నల్ వచ్చిందని అంటున్నారు. కాంగ్రెస్‌లో మాత్రం ఇంకా స్పష్టత రాలేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సన్నిహితుడైన ప్రొఫెసర్ ప్రసన్న హరి కిషోర్‌కి లేక సొంత సామాజిక వర్గానికి చెందిన ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డికి కాంగ్రెస్ టికెట్ ఇస్తుందా? లేదా ఇంకా వేరే వాళ్లకు ఛాన్స్ ఇస్తారా అన్నది ప్రస్తుతానికి ప్రశ్నార్థకం. అయితే జరగబోయే పట్టభద్రుల ఎన్నికల్లో ఇద్దరు బిసి సామాజిక వర్గానికి చెందిన వారు మరో ఇద్దరు ఓసి సామాజిక వర్గానికి చెందినవారు పోటీల్లో నిలవడం ఆసక్తికరంగా మారింది.గతంలో పట్టబదుల పక్షాన నాయకులు పోరాడిన న్యాయం జరగలేదని ఒక అసంతృప్తి పట్టభద్రుల్లో నెలకొంది. అయితే ఈసారి అలా కాకుండా పట్టభద్రుల పక్షాన ఉండి తమ సమస్యలపై పోరాడే వాళ్లను ఎన్నుకోవాలని పట్టభద్రులు ఆలోచిస్తున్నారు. కానీ ఈసారి జరగబోయే పట్టభద్రుల ఎన్నికల్లో ఓటర్లకు పెద్ద చిక్కు వచ్చి పడింది. ఎవరికి ఓటు వేయాలి అనే ఒక ప్రశ్న ఓటర్లలో చిన్న ఆందోళన తీసుకువచ్చింది.ప్రముఖ అపరవేత్త ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత ఉత్కూరి నరేందర్ రెడ్డికి ఓటు వేయాల లేక మాజీ ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ బి.ఎన్.రావుకు గెలిపిద్దామా లేక బీసీ సామాజిక వర్గానికి చెందిన ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణను ఎన్నుకుందామా అనే అనే సందిగ్ధంలో ఓటర్లు ఉన్నట్లు తెలుస్తుంది.ఆల్ఫోర్స్ విద్య సంస్థల అధినేత నరేందర్ రెడ్డికి కొంతవరకు వ్యతిరేకత ఉన్నట్టు తెలుస్తుంది. ఇక మాజీ ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ బి.ఎన్.రావు తన సామాజిక సేవ భావంతో ప్రజల మన్ననలు పొందేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ప్రొఫెసర్‌గా అనుభవం కలిగిన ప్రసన్న హరికృష్ణ విద్యార్థుల్లో మంచి పేరున్న వ్యక్తిగా తెలుస్తుంది. బిఆర్ఎస్ పార్టీ నాయకుడు సర్దార్ రవీందర్ సింగ్ న్యాయవాదిగా అనుభవంతోపాటు కరీంనగర్ మేయర్‌గా అనుభవం కలిగిన వారు.వైద్యరంగంలో రాణిస్తున్న డాక్టర్ బి.ఎన్.రావు, న్యాయవాదిగా అనుభవం కలిగిన సర్దార్ రవీందర్ సింగ్, విద్యారంగంలో అనుభవం కలిగిన ప్రొఫెసర్ ప్రసన్న హరి కిషోర్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి ప్రచారాలు జోరుగా చేస్తున్నారు. వీరిలో ఎవరికి టికెట్ వస్తుంది పట్టభద్రుడి అభిమానాన్ని ఎవరు గెలుచుకుంటారనేది మాత్రం ఆసక్తిగా మారింది.

## అసెంబ్లీ ఫుడ్ కాంట్రాక్టర్ మార్పు

అమరావతి అసెంబ్లీ భోజనంపై నిన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. సభ్యులకు వేరుగా, ఇతరులకు వేరుగా భోజనం పెట్టారా అంటూ నిలదీసారు. అందరికీ ఒకేలా భోజనం పెట్టామని అధికారులు వివరణ ఇచ్చారు. ఒకేలా భోజనం పెడితే నేనెందుకు నిలదీస్తానన్న సభాపతి అన్నారు. తనకు ఫిర్యాదులు ఎందుకొచ్చాయో సమాధానం చెప్పాలని అయ్యన్నపాత్రుడు అన్నారు. పదార్థాలు ఒక్కటే కానీ అన్నం ఒక్కటే మారిందని అధికారులు వివరణ ఇచ్చారు. అసెంబ్లీ అంటే తమాషా అనుకుంటున్నారా అంటూ అధికారులు, కాంట్రాక్టర్ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. ఫుడ్ సరఫరా చేసే పాత కాంట్రాక్టర్ ను మార్చివేసారు. ఇవాల్టి నుంచే కొత్త ఫుడ్ కాంట్రాక్టర్ కు భోజనం సరఫరా చేసే బాధ్యత అప్పగించారు. ఇవాళ అసెంబ్లీ హాలులో ఎమ్మెల్యేలకు శిక్షణ అనంతరం మధ్యాహ్నం కొత్త కాంట్రాక్టర్ భోజనం ఏర్పాటు చేసారు.

# సినిమా



## పుష్ప రన్‌టైంపై క్రేజీ న్యూస్



ప్రస్తుతం ఇండియాలో మోస్ట్ అవైటెడ్ మూవీ అయిన పుష్ప: ది రూల్ విడుదలకు ఇంకో మూడు వారాలే సమయం ఉంది. రిలీజ్ దగ్గర పడేకొద్దీ దేశవ్యాప్తంగా ఈ సినిమా కోసం ఎదురు చూస్తున్న వారిలో ఉత్కంఠ పెరిగిపోతోంది.టీం కూడా ఎప్పటికప్పుడు అప్‌డేట్స్ ఇస్తూ ఎగ్జైట్మెంట్‌ను పెంచుతోంది.శ్రీలీలతో కలిసి ఐటెం సాంగ్‌లో బన్నీ స్టెప్పులేస్తున్న విషయాన్ని అధికారికంగా ప్రకటించిన టీం.. ఈ నెల 17న ట్రైలర్ లాంచ్ చేయనున్న విషయాన్ని కూడా వెల్లడించింది. ప్రమోషన్ల పరంగా పక్కా ప్లాన్‌తోనే వెళు ండగా.. మరోవైపు సుకుమార్ అండ్ టీం చివరి దశ షూటింగ్ చేస్తూనే సమాంతరంగా పోస్ట్ ప్రొడక్షన్ పనులూ కానిస్తోంది. ఈ నేపథ్యంలో సినిమా గురించి ఒక క్రేజీ సమాచారం తెలిసింది. పుష్ప-2 రన్ టైం విషయంలో యూనిట్ నుంచి అందుతున్న సమచారం ఆశ్చర్యపరిచేలాఉంది.ప్రస్తుతం షూట్ చేసి ఎడిటింగ్ పూర్తి చేసిన కాపీ నిడివి మూడుంబావు గంటల దాకా వచ్చిందట. ఇంకా దానికి రెండు పాటలు, కొంత ప్యాచ్ వర్క్ కూడా జోడించాల్సి ఉంది. మొత్తంగా చూస్తే రన్ టైం మూడున్నర గంటల వరకు రావచ్చని సమాచారం. మరి అంత సుదీర్ఘ నిడివితో సినిమాను రిలీజ్ చేస్తే ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారో చెప్పలేం. యానిమల్ సినిమా అంత నిడివితోనే రిలీజై బ్లాక్ బస్టర్ విజయాన్నందుకుంది. అలా అని ప్రతి సినిమానూ అంతేసి నిడివితో రిలీజ్ చేయలేరు. సుకుమార్ సినిమాలంటే మూడు గంటల నిడివి కామన్ అయిపోయింది.

## అమ్మ ప్రేమ లాంటి ఊరి కథ

తన తొలి మూవీ 'మేం ఫేమస్'తో లీడ్ యాక్టర్, దర్శకుడిగానూ మంచి గుర్తింపు తెచ్చుకున్న సుమంత్ ప్రభాస్ హీరోగా తన రెండో మూవీని అనౌన్స్ చేశారు. ఈ కొత్త మూవీ రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ మేడిన్ వెంచర్. ఎం ఆర్ ప్రొడక్షన్స్ షార్ట్ ఫిల్మ్‌లతో పాపులరైన సుభాష్ చంద్ర దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. రామానాయుడు స్టూడియోస్ లో పూజా కార్యక్రమాలతో ఈ సినిమా లాంఛనంగా ప్రారంభమైంది. ముహూర్తం షాట్‌కు హీరో శ్రీవిష్ణు క్లాప్ కొట్టారు. సురేష్‌బాబు కెమెరా స్విచాన్ చేశారు. దర్శకులు శ్రీకాంత్ ఓదెల, శౌర్యువ్, మహేష్ బాబు పి తొలి షాట్‌కి దర్శకత్వం వహించారు. స్క్రిప్ట్‌ని అల్లు అరవింద్ మేకర్స్‌కి అందజేశారు. నిధి ప్రదీప్ హీరోయిన్ గా పరిచయం అవుతోంది. జగపతి బాబు మేజర్ రోల్ పోషిస్తున్నారు.

## ఏడుస్తూ మేనేజర్‌కు ఫోన్ చేసిన సమంత



సమంత ఇప్పుడు జస్ట్ సినిమా హీరోయిన్ కాదు. వెబ్ సిరీస్ స్పెషలిస్ట్. ఆల్రెడీ 'ఫ్యామిలీ మ్యాన్-2'లో రాజీ అనే నెగెటివ్ పాత్రలో అదరగొట్టిన సామ్..తాజాగా 'సిటాడెల్'లో లీడ్ రోల్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఆమె కెరీర్‌కు ఈ రకమైన మేకోవర్ ఇచ్చిన ఘనత తెలుగువారైన బాలీవుడ్ దర్శక ద్వయం రాజ్-డీకేలకే చెందుతుంది.'సిటాడెల్' కోసం సమంత అందుబాటులోకి రాని స్థితిలో ఆమె కోసమే వెయిట్ చేసి మరీ ఈ సిరీస్ తీశారు. తనకు అంత విలువ ఇచ్చిన దర్శకుల గురించి ఒకప్పుడు తప్పుగా అర్థం చేసుకున్నట్లు సమంత ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది. వాళ్ల శైలి తనకు నచ్చక ఒక దశలో తన మేనేజర్‌కు ఫోన్ చేసి ఏడ్చినట్లు సమంత గుర్తు చేసుకుంది. "రాజ్-డీకేలతో పని చేయడం కంటే తెలుగు, తమిళ సినిమాల్లో వర్క్ చేస్తే చాలా ప్రశాంతంగా ఉంటుంది. మామూలుగా నేను నటించిన సినిమాల్లో రోజుకు రెండు లేదా మూడు సీన్స్ తీస్తారు. కానీ 'ఫ్యామిలీ మ్యాన్' కోసం పని చేసినపుడు రాజీ పాత్రకు సంబంధించిన కొన్ని కీ సీన్స్, ఒక ఫైట్ సీక్వెన్స్ మొదటి షెడ్యూల్లోనే తీసేశారు. అది చాలా కష్టమనిపించింది. వాళ్ల శైలికి అలవాటుపడలేకపోయాను. రెండు రోజుల తర్వాత నా మేనేజర్‌కు ఫోన్ చేసి నా వల్ల కావట్లేదు, ఇంటికి వచ్చేస్తానని ఏడ్చాను. కానీ తర్వాత నెమ్మదిగా వాళ్ల శైలికి అలవాటు పడ్డాను" అని సమంత తెలిపింది.

## సూర్యకు అన్యాయం జరగకూడదు



ఎల్లుండి విడుదల కాబోతున్న కంగువ మీద సూర్య ప్రాణాలు పెట్టుకున్నాడు. కెరీర్ లోనే అత్యధిక కాలం షూటింగ్ చేసిన తొలి ప్యాన్ ఇండియా మూవీగా గొప్ప మైలురాయి అవుతుందనే నమ్మకంతో ఎదురు చూస్తున్నాడు.దానికి తగ్గట్టే పగలు రేయి తేడా లేకుండా ప్రమోషన్ల పరంగా ఎంత చేయాలో అంతా చేశాడు. నిర్మాత జ్ఞానవేల్ రాజా సైతం ఖర్చుకి ఎక్కడా వెనుకాడకుండా ఐమాక్స్, త్రిడితో సహా అన్ని వర్షన్లు సకాలంలో సిద్ధం చేశారు. అయితే అభిమానులు కోరుకుంటున్న గ్రాండ్ ఓపెనింగ్ దక్కాలంటే భారీ ఎత్తున స్క్రీన్లు దక్కాలి. గోట్, లియో, జైలర్ రేంజ్ లో పంపిణీదారుల మద్దతు కావాలి. కానీ కంగువకు అమరన్ రూపంలో పడుతున్న స్పీడ్ బ్రేకర్ గురించి ఆల్రెడీ విన్నాం కదా. ఈ సమస్యని పరిష్కరించడానికి ఇరు వైపులా ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆశించిన ప్రయోజనం దక్కలేదట. తమిళనాడులో ఒప్పందాల ప్రకారం ఏ సినిమాకైనా మూడో వారం నుంచి డిస్ట్రిబ్యూటర్లకు ఎక్కువ షేర్ వెళ్తుంది. అమరన్ బలంగా రన్ అవుతున్న నేపథ్యంలో దానికి తగినన్ని స్క్రీన్లు కేటాయిస్తే లాభాలు పెరుగుతాయనేది వాళ్ళ వెర్షన్. కానీ కంగువకు కౌంట్ తగ్గితే ఆ ప్రభావం నేరుగా నెంబర్స్ మీద పడుతుంది. ఫ్యాన్స్ మాత్రం ఇది అన్యాయమని, సపోర్ట్ చేయడానికి బదులు ఇలా జరగడం సరికాదని అంటున్నారు. ఇప్పటికిప్పుడు ఇదంతా మారిపోదు కానీ చూస్తుంటే తమిళనాడు కంటే ఏపీ తెలంగాణలోనే కంగువకు ఎక్కువ ఓపెనింగ్ వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు. తెలుగు రాష్ట్రాల్లో ఉదయం 7 నుంచే షోలు మొదలుపెడుతున్నారు.

### ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు

చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ హీరో హీరోయిన్లుగా నటించిన సినిమా 'ధూం ధాం'. ఈ చిత్రాన్ని ఫ్రైడే ఫ్రేమ్ వర్క్స్ బ్యానర్ పై ఎంఎస్ రామ్ కుమార్ నిర్మించారు. దర్శకుడు సాయి కిషోర్ మచ్చా రూపొందించిన ఈ సినిమా ఇటీవల విడుదలై, సకుటుంబం గా ప్రేక్షకుల్ని ఎంటర్ టైన్ చేస్తోంది. ఈ నేపథ్యంలో చిత్ర సక్సెస్ గురించి ప్రొడ్యూసర్ రామ్ కుమార్ మాట్లాడుతూ, 'మా సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది. థియేటర్స్ లోకి వెళ్లిన వాళ్లంతా ఎంటర్ టైన్ అవుతున్నారు. కలెక్షన్స్ బాగున్నాయి. ఈ సినిమాతో చేతన్ కుటుంబ ప్రేక్షకులకు దగ్గరయ్యాడు. మా సంస్థలో మరొక మూవీని మరికొద్ది రోజుల్లో అనౌన్స్ చేస్తాం' అని చెప్పారు. రైటర్ గోపీ మోహన్ మాట్లాడుతూ, 'ఈ సినిమా ఫస్టాఫ్ లో మంచి పాటలు, సెకండాఫ్ లో కామెడీ ఉండాలని ప్లాన్ చేశాం. మేము అనుకున్నట్లే సాంగ్స్ కు , కామెడీని ఆడియెన్స్ బాగా ఎంజాయ్ చేస్తున్నారు. ఫస్ట్ మూడు రోజులు యూత్ ఎక్కువగా మూవీస్ చూస్తుంటారు. ఈరోజు నుంచి ఫ్యామిలీస్ మా మూవీకి బాగా వస్తారని ఆశిస్తున్నాం. కొడుకుని ప్రేమించే తండ్రి, తండ్రిని బాగా గౌరవించే కొడుకు కథ ఇది. నా నెక్స్ట్ మూవీ గల్లా జయదేవ్ రెండో అబ్బాయితో ప్లాన్ చేస్తున్నా. నా డైరెక్షన్ లోనే ఆ సినిమా చేస్తాను' అని అన్నారు.

## అప్పన్న వ్యవహారం మాములుగా ఉండదు



గేమ్ ఛేంజర్ టీజర్ వచ్చాక ఒక్కసారిగా అంచనాల్లో మార్పు వచ్చేసింది. రెండో రోజులు కాకుండానే 70 మిలియన్లు దాటేసి మంచి ట్రెండింగ్ లో ఉన్న ఈ స్పందన చూసి మెగా ఫ్యాన్స్ హ్యాపీగా ఉన్నారు.ఈ సినిమాలో రామ్ చరణ్ మొత్తం మూడు షేడ్స్ లో కనిపించే సంగతి తెలిసిందే. ఆ లుక్స్ ని రివీల్ చేశారు కూడా. కాలేజీ విద్యార్థి, ఐఏఎస్ ఆఫీసర్ తో పాటు కీలకమైన రైతు కం రాజకీయ నాయకుడి గెటప్ ని దాచకుండా చూపించేశారు. అయితే కమర్షియల్ కోణంలో అభిమానులు ఎక్కువగా రామ్, రామ్ నందన్ పాత్రల మీద ఎక్కువ దృష్టి పెడుతున్నారు కానీ అసలు వ్యవహారం అప్పన్నదేనట.కీలకమైన ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్ లో అప్పన్నగా పంచె కట్టుకుని రామ్ చరణ్ కు డిజైన్ చేసిన ఎపిసోడ్ చాలా బాగా వచ్చిందని ఇన్ సైడ్ టాక్. తన సరసన భార్యగా నటించిన అంజలిని గిరిజన నృత్య కళాకారిణిగా చూపించడమే కాక ఒక సామజిక సమస్య కోసం అప్పన్న చేసే పోరాటం ఓ రేంజ్ లో వచ్చిందని అంటున్నారు. ముఖ్యంగా పోలీసులు అరెస్ట్ చేసే తీసుకెళ్తున్నప్పుడు చేతికి సంకెళ్ళున్నా తన మీద దాడికి వచ్చే వాళ్ళను ఎదురుకునే తీరు హైలైట్స్ లో ప్రధానమైందిగా చెబుతున్నారు. ఇక్కడే అప్పన్న క్యారెక్టర్ కు సంబంధిన కీలక ట్విస్టుతో కూడిన ముగింపు ఉంటుందని మరో అప్డేట్. దర్శకుడు శంకర్ లోని వింటేజ్ ఇందులోనే బయటపడుతుందట. ఎలక్షన్ ఆఫీసర్ గా రామ్ చరణ్ చేయబోయే విన్యాసాలన్నీ అప్పన్న ఇచ్చే ప్రభావం వల్లే ఎలివేట్ అవుతాయని, ఇవన్నీ తెరమీద చూసినప్పుడు ఊహించని మలుపులతో ఉక్కిరిబిక్కిరి చేస్తాయని చెబుతున్నారు.

## కమల్ వద్దని చెప్పినా... ఆయన నాయకుడే !



తమిళంలోనే కాక అన్ని భాషల్లో భారీ అభిమానులున్న కమల్ హాసన్ ఇకపై తనకు ఉలగనాయగన్ (లోకనాయకుడు) లాంటి ఉపమానాలు, బిరుదులు వాడొద్దని అధికారికంగా ఒక ప్రెస్ నోట్ విడుదల చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.కేవలం తన పూర్తి పేరు లేదా కమల్ లేదా కెహెచ్ అని వ్యవహరించాలని అందులో పేర్కొన్నారు. నిజానికి ఇది మంచి పరిణామమే. విలక్షణ నటుడిగా బాల్యం నుంచి వార్ధక్యం దాకా ఐదు దశబ్దాల అనుభవం ఉన్న ఈ వర్సటైల్ యాక్టర్ చేయని పాత్ర, ప్రయత్నించని ప్రయోగం లేదంటే అతిశయోక్తి కాదు. అందుకే ఫ్యాన్స్ ప్రేమతో లోక నాయకుడని పిలుస్తారు. ఇది దశావతారం నుంచి ప్రాచుర్యంలోకి వచ్చింది.అయితే ఇంత హఠాత్తుగా నిర్ణయం తీసుకోవడం వెనుక కారణాలు ఏమైనా ఈ పని ఎప్పుడో చేసి ఉండాల్సిసిందనే కామెంట్స్ వస్తున్నాయి. కోలీవుడ్ లో అందరికి ట్యాగులున్నాయి. సూపర్ స్టార్, తల, తలపతి, రైజింగ్ స్టార్, మక్కళ్ సెల్వన్ ఇలా ఒక్కో హీరోకి ఒక్కో బిరుదు ఉంది. వారి వారి స్థాయికి తగ్గట్టు అభిమాన సంఘాలు ఉన్నాయి. కొందరు రాజకీయ పార్టీలు కూడా పెట్టారు. ఒక్క అజిత్ మాత్రమే ఫ్యాన్ అసోసియేషన్లను తీవ్రంగా వ్యతిరేకించి వాటితో నాకెలాంటి సంబంధం లేదని చాలా సంవత్సరాల క్రితమే తేల్చి చెప్పారు.

## ప్రభాస్ ఆ పాట పెడుతున్నాడ్రోయ్



ప్రభాస్ ఇప్పుడు ఇండియాలో బిగ్గెస్ట్ స్టార్. అలాంటి స్టేచర్ ఉన్న నటుడు ఒక సాహిత్య పరమైన కార్యక్రమంలో పాల్గొనడం విశేషం. లెజెండరీ లిరిసిస్ట్ సిరివెన్నెల సీతారామశాస్త్రికి నివాళిగా ఓ టీవీ ఛానెల్లో నిర్వహించే 'నా ఉచ్ఛ్వాసం కవనం' కార్యక్రమానికి ప్రభాస్ అతిథిగా వచ్చాడు. ఇప్పటిదాకా చాలామంది దర్శకులు, లిరిసిస్టులు ఈ కార్యక్రమంలో పాల్గొని శాస్త్రి గారి సాహిత్యంలో ఉన్న గొప్పదనం గురించి చర్చించారు. కానీ ప్రభాస్ లాంటి టాప్ స్టార్ హీరో ఈ కార్యక్రమానికి రావడం ఆశ్చర్యం కలిగించే విషయం. ఈ ఎపిసోడ్లో సీతారామశాస్త్రి సాహిత్యం తనకెంత ఇష్టమో.. ఆయన పాటల్లో తనకు అత్యంత నచ్చిన పాటలేంటో ప్రభాస్ పంచుకున్నాడు. శాస్త్రిగారి పాటలన్నింట్లో తనకు 'జల్సా' సినిమాలోని 'ఛలోరే ఛలోరే' పాట అంటే పిచ్చి అని ప్రభాస్ వెల్లడించాడు. అందులో ఒక్కో లైన్ వింటుంటే మతి పోతుందని ప్రభాస్ చెప్పాడు. ఆ పాటలోని అర్థం గురించి తాను ఎన్నిసార్లు మాట్లాడానో లెక్కే లేదని ప్రభాస్ అన్నాడు. తాను ఎప్పుడూ పార్టీలో పాల్గొన్నా ఆ పాట ప్లే చేయాల్సిందేనని.. చాలాసార్లు తన ఫ్రెండ్స్ వీడు 'ఛలోరే ఛలోరే' పాట పెడుతున్నాడ్రోయ్ అంటూ పారిపోయేవారని ప్రభాస్ నవ్వుతూ చెప్పాడు. ఈ పాటలో వచ్చే 'రకరకాల ముసుగులు వేస్తూ మరిచాం ఎప్పుడో సొంత ముఖం' అనే లైన్ తనకు చాలా చాలా ఇష్టమని ప్రభాస్ చెప్పాడు. ఆయన సినిమా కోసం ఈ లైన్ రాసినా.. అది మన జీవితాల గురించే రాసినట్లు అనిపిస్తుందని ప్రభాస్ అభిప్రాయపడ్డాడు.



# క్రీడలు



## న్యూజిలాండ్‌తో ఓటమిపై తొలిసారిగా మౌనం వీడిన గంభీర్..



న్యూజిలాండ్‌తో స్వదేశంలో జరిగిన టెస్టు సిరీస్‌లో 0-3తో ఘోర పరాజయం తర్వాత గౌతం గంభీర్ తొలిసారిగా మౌనం వీడాడు. స్వదేశంలో న్యూజిలాండ్‌పై 0-3 తేడాతో ఘోర పరాజయం తర్వాత తాను ఎదుర్కొన్న విమర్శలపై భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ మాట్లాడుతూ.. భారత కోచ్‌గా గౌరవనీయమైన పాత్రను పోషించడం చాలా కష్టమని, అది తనకు తెలుసునని అన్నాడు. న్యూజిలాండ్‌తో ఓటమి 2012 తర్వాత స్వదేశంలో భారత్‌కు ఇదే తొలి టెస్టు సిరీస్ ఓటమి కాగా.. ఈ శతాబ్దంలో స్వదేశంలో 0-3 తేడాతో ఓటమి పాలైంది. ఇకపోతే, టీమిండియా ఆస్ట్రేలియా పర్యటనకు దాదాపు పది రోజుల ముందే బయల్దేరింది. ఈ సందర్భంగా అక్కడ నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో గౌతమ్ గంభీర్ కొన్ని విషయాలను తెలిపాడు. తమకు ఆసీస్ చేతిలో ఓటమి తప్పదని, సీనియర్ ఆటగాళ్లు రోహిత్, విరాట్ ఫామ్‌పై చేస్తున్న విమర్శలను కోచ్ గౌతమ్ గంభీర్ కొట్టిపడేశాడు. టీమిండియా కుర్రాళ్లకు ఎప్పుడూ మద్దతు ఉంటుందని స్పష్టం చేస్తూనే.. మరోవైపు ఫామ్‌లో లేని కేఎల్ రాహుల్ పైనా ఆయన స్పందించాడు. మొత్తానికి పెద్దమార్పులేమి లేకుండా ఆస్ట్రేలియా టెస్టు సిరీస్ కు తాము సిద్ధమని ఆయన తెలిపాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ నేపథ్యంలో ఆస్ట్రేలియాలోని పరిస్థితులు ఎదుర్కోవడం చాలా కఠినమని ఆయన అన్నాడు. అక్కడి పరిస్థితులు ఇక్కడితో పోలిస్తే చాలా విభిన్నమన్నారు. అలాగే, టీమిండియా ఇప్పటికే చాలాసార్లు ఆస్ట్రేలియాలో పర్యటించిన అనుభవం ఉందని.. అది తమకు తప్పకుండా ఉపయోగపడుతుందని వ్యాఖ్యానించారు. అలాగే ఆస్ట్రేలియా సిరీస్‌లో మొదటి బంతి నుంచే దూకుడు ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తామని అన్నారు. మరోవైపు న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్ తర్వాత రోహిత్, తన మధ్య దూరం పెరిగిందనే వార్తలూ వచ్చాయని, కివీస్‌తో అద్భుతంగా పోరాడమని, కాకపోతే లక్ కలిసిరాలేదని అన్నారు. అలాగే రోహిత్ తో నా అనుబంధం చాలా గొప్పగా ఉందని వివరించాడు .

## బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ..

## ఎవరెన్నిసార్లు టైటిల్ గెలుచుకున్నారంటే



నవంబర్ 22 నుంచి భారత్ - ఆస్ట్రేలియా మధ్య ప్రతిష్ఠాత్మక బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ ప్రారంభం కానుంది. ఈ ట్రోఫీ కింద ఇరు జట్ల మధ్య 5 టెస్టు మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇందులో తొలి మ్యాచ్ పెర్త్ క్రికెట్ స్టేడియంలో, రెండో మ్యాచ్ అడిలైడ్‌లో, మూడో టెస్టు బ్రిస్బేన్‌లో, నాలుగో టెస్టు మెల్‌బోర్న్‌లో, చివరి మ్యాచ్ సిడ్నీలో జరగనుంది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ చరిత్ర నిజానికి చాలా పాతది. 1947 నుండి 1992 వరకు భారతదేశం - ఆస్ట్రేలియా మధ్య 50 టెస్ట్ మ్యాచ్‌లు జరిగాయి. 1996లో రెండు క్రికెట్ బోర్డులు కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా, క్రికెట్ ఆస్ట్రేలియాలు లెజెండరీ టీమిండియా ఆటగాడు సునీల్ గవాస్కర్, ఆస్ట్రేలియా ఆటగాడు అలన్ బోర్డర్ సాధించిన విజయాలను గౌరవించేందుకు బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని ప్రవేశపెట్టాయి. బోర్డర్, గవాస్కర్ తమ తమ జట్ల కోసం టెస్ట్ క్రికెట్‌లో 10 వేల పరుగులు చేసిన మొదటి క్రికెటర్లు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ కింద ఇప్పటివరకు 16 సిరీస్‌లు జరిగాయి. వీటిలో భారతదేశంలో 9 సార్లు, ఆస్ట్రేలియాలో 7 సార్లు నిర్వహించబడింది. భారత్ 10 సిరీస్‌లు గెలుచుకోగా, ఆస్ట్రేలియా 5 సిరీస్‌లను గెలుచుకుంది. 2003-04 సిరీస్ మాత్రమే డ్రా అయింది. ఆ సమయంలో భారత్ ఆస్ట్రేలియాలో పర్యటించింది. 1996 నుంచి ఇప్పటి వరకు ఆడిన 57 టెస్టుల్లో భారత్ 24, ఆస్ట్రేలియా 21 విజయాలు సాధించగా, 12 మ్యాచ్‌లు డ్రా అయ్యాయి. ఆస్ట్రేలియా చివరిసారిగా 2014లో టెస్టు సిరీస్‌లో భారత్‌ను ఓడించింది. అప్పటి నుండి, భారత్ 4 బోర్డర్-గవాస్కర్ సిరీస్‌ను గెలుచుకుంది. 2017లో స్వదేశంలో భారత్ 2-1తో ఆస్ట్రేలియాను ఓడించింది. దీని తర్వాత 2018-19లో ఆస్ట్రేలియా గడ్డపై సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకుంది. ఆ తర్వాత 2020-21లో ఆస్ట్రేలియా గడ్డపై భారత్ మళ్లీ సిరీస్‌ను కైవసం చేసుకుంది. చివరిసారిగా 2023లో భారత్ 2-1తో సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఇక బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ సంబంధించి రికార్డ్స్ చూస్తే.. ఈ ట్రోఫీలో భారత మాజీ దిగ్గజం సచిన్ టెండూల్కర్ అత్యధిక పరుగులు చేసిన ఆటగాడుగా రికార్డ్ క్రియేట్ చేసాడు. 34 మ్యాచ్‌ల్లో 65 ఇన్నింగ్స్‌ల్లో 56.24 సగటుతో 3,262 పరుగులు చేశాడు. ఇందులో 9 సెంచరీలు, 16 అర్థ సెంచరీలు సాధించాడు. అతని అత్యుత్తమ స్కోరు 241లి పరుగులు. అలాగే రికీ పాంటింగ్ ఆస్ట్రేలియా తరపున 29 మ్యాచ్‌లు ఆడాడు. 54.36 సగటుతో 51 ఇన్నింగ్స్‌లలో 2,555 పరుగులు చేశాడు. 8 సెంచరీలు, 12 అర్థ సెంచరీలు సాధించాడు. అతని అత్యుత్తమ స్కోరు 257 పరుగులు. నాథన్ లియాన్ ఈ ట్రోఫీలో అత్యధిక వికెట్లు పడగొట్టాడు. 26 మ్యాచ్‌ల్లో 32.40 సగటుతో 116 వికెట్లు తీశాడు. అతను 3 సార్లు 4 వికెట్లు, 9 సార్లు 5 వికెట్లు తీసుకున్నాడు. అతని అత్యుత్తమ ప్రదర్శన 8/50. కాగా, భారత్ నుంచి రవిచంద్రన్ అశ్విన్ రెండో స్థానంలో నిలిచాడు. 22 మ్యాచ్‌ల్లో 28.36 సగటుతో 114 వికెట్లు తీశాడు. అతను తన పేరిట 7 సార్లు 5 వికెట్లు సాధించాడు. అతని అత్యుత్తమ ప్రదర్శన 7/103.

## లైవ్ మ్యాచ్‌లో ఘోర ప్రమాదం..

## త్రుటిలో తప్పించుకున్న స్టార్ ప్లేయర్..



షార్జాలో ఆఫ్ఘనిస్తాన్ వర్సెస్ బంగ్లాదేశ్ మధ్య జరిగిన మూడవ వన్డేలో స్టార్ ప్లేయర్‌కు తృటిలో ఓ ప్రమాదం తప్పింది.అదే సమయంలో ఈ సీన్ చూస్తే నవ్వు కూడా వస్తోంది. ఈ మ్యాచ్‌లో, ఆఫ్ఘనిస్తాన్ లెగ్ స్పిన్నర్ రషీద్ ఖాన్ తలపై సహచరుడి షూ తగిలింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నిజానికి షార్జాలో జరుగుతున్న ఈ వర్చువల్ ఫైనల్ మ్యాచ్‌లో రషీద్ ఖాన్ బంతిని పట్టుకోవడానికి పరిగెత్తాడు. ఈ సమయంలో అతను బంతిని ఒడిసి పట్టేందుకు ప్రయత్నించాడు. అదే బంతిని పట్టుకోవడానికి వికెట్ కీపర్ రహ్మానుల్లా గుర్బాజ్ కూడా పరిగెత్తుతుండగా ఒక్కసారిగా రషీద్ అతని ముందు కనిపించాడు. రషీద్‌ను రక్షించేందుకు, అతను పరుగెత్తుకుంటూ వెళ్లి గాలిలోకి దూకాడు. అయితే, అతని షూ రషీద్ తలకు తగిలి అతని టోపీ కూడా పడిపోయింది. ఈ సమయంలో రషీద్ తీవ్రంగా గాయపడవచ్చు కానీ అతను తృటిలో తప్పించుకున్నాడు. రషీద్ ఖాన్ తృటిలో తప్పించుకున్న తర్వాత, ఆఫ్ఘనిస్తాన్ వికెట్ కీపర్ రహ్మానుల్లా గుర్బాజ్ అతని వద్దకు వచ్చి దిగ్గజ ఆటగాడికి క్షమాపణలు చెప్పాడు. తన పాదం రషీద్ తలకు తగిలి ఉంటే, అతనికి తీవ్రమైన గాయం అయ్యేదని గుర్బాజ్‌కి కూడా తెలుసు. ఈ మ్యాచ్‌లో రషీద్ ఖాన్ తృటిలో తప్పించుకున్నప్పటికీ బంగ్లాదేశ్ బ్యాట్స్‌మెన్‌లను తప్పించుకోనివ్వలేదు. షార్జా వన్డేలో ఈ రైట్ ఆర్మ్ స్పిన్నర్ 10 ఓవర్లలో కేవలం 40 పరుగులిచ్చి ఒక వికెట్ తీశాడు. రషీద్ ఖాన్ తౌహిద్ హార్దోయ్‌ను వేటాడాడు. రషీద్ వేసిన బంతికి గుల్బాదిన్ క్యాచ్ పట్టాడు. బంగ్లాదేశ్ వర్సెస్ ఆఫ్ఘనిస్తాన్ మధ్య ఒక ఉత్తేజకరమైన యుద్ధం తరచుగా కనిపిస్తుంది.

## అందుకే ఎల్ఎస్‌జీ నుంచి బయటికి వచ్చా



ఐపీఎల్ 2025 మెగా వేలం నవంబర్ 24, 25వ తేదీల్లో సౌదీ అరేబియాలోని జెడ్డాలో జరగనుంది. ఐపీఎల్ మెగా వేలంకు ముందు ఫ్రాంఛైజీలు తమ రిటైన్ లిస్టును ప్రకటించిన విషయం తెలిసిందే. లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) ఫ్రాంచైజీ నుంచి టీమిండియా స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ బయటికొచ్చేశాడు. రాహుల్‌ను రిటైన్ చేసుకోవడానికి ఎల్ఎస్‌జీ ఆసక్తి చూపినా.. అతడు అందుకు నిరాకరించినట్లు తెలుస్తోంది. గత సీజన్‌లో ఎల్ఎస్‌జీ ఓనర్ సంజీవ్ గోయెంకా మైదనంలోనే ఆగ్రహం వ్యక్తం చేయడంతో రాహుల్ ఆ ఫ్రాంఛైజీకి దూరం కావాలని నిర్ణయించుకున్నాడట.ఇటీవల స్టార్‌స్పోర్ట్స్‌కు కేఎల్ రాహుల్ ఇంటర్వ్యూ ఇచ్చాడు. ఈ ఇంటర్వ్యూకు సంబంధించిన ప్రోమో తాజాగా విడుదల కాగా.. ఎల్ఎస్‌జీని వీడటానికి గల కారణాలను అతడు వెల్లడించాడు. తన ప్రయాణంను కొత్తగా ప్రారంభించాలనుకుంటున్నానని, తనదైన ఆట ఆడేందుకు స్వేచ్ఛ అవసరం ఎల్ఎస్‌జీ నుంచి బయటికి వచ్చానని చెప్పాడు. 'ఐపీఎల్‌ను కొత్తగా ప్రారంభించాలనుకుంటున్నా. నా ఆట ఆడేందుకు స్వేచ్ఛ అవసరం కాబట్టి ఎల్ఎస్‌జీ నుంచి బయటికి వచ్చా. జట్టు వాతావరణం తేలికగా ఉండి.. స్వేచ్ఛ లభించే జట్టు తరఫున ఆడాలనుకుంటున్నా' అని రాహుల్ పేర్కొన్నాడు. ఐపీఎల్ మెగా వేలంలో కేఎల్ రాహుల్‌కు భారీ ధర పలికే అవకాశం ఉంది. కెప్టెన్‌గా పనిచేసిన అనుభవం ఉండటం, వికెట్ కీపర్ కమ్ బ్యాటర్ కావడంతో ఫ్రాంఛైజీలు రాహుల్ కోసం తీవ్రంగా పోటీపడే అవకాశముంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రాహుల్ కోసం భారీ మొత్తం వెచ్చించేందుకు సిద్ధమైందట. పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ కూడా రేసులో ఉన్నట్లు తెలుస్తోంది.

## ఛాంపియన్స్ ట్రోఫీ -2025 నుంచి పాకిస్థాన్ ఔట్?




ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ఆతిథ్య హక్కులు పాకిస్థాన్ వద్ద ఉన్న విషయం తెలిసిందే. ఫిబ్రవరి 19 నుంచి మార్చి 9 మధ్య టోర్నీ జరగనుంది. కరాచీ, లాహోర్, రావల్పిండి నగరాల్లో మ్యాచ్‌లు జరగనున్నాయి.ఇప్పటికే షెడ్యూల్‌ను సిద్ధం చేసిన పీసీబీ.. ఐసీసీకి పంపింది. బీసీసీఐ కారణంగా కారణంగా ఐసీసీ ఇంకా షెడ్యూల్‌ను రిలీజ్ చేయని విషయం తెలిసిందే. అయితే హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించడానికి పీసీబీ అంగీకరించకపోతే.. టోర్నీ మొత్తాన్ని దక్షిణాఫ్రికాలో నిర్వహించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. భద్రతా కారణాల దృష్ట్యా పాకిస్థాన్‌కు వెళ్లి ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడేందుకు భారత జట్టు సిద్ధంగా లేదు. టోర్నీని హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహిస్తేనే పాల్గొంటామని ఐసీసీకి బీసీసీఐ తేల్చి చెప్పింది. టీమిండియా ఆడే మ్యాచ్‌లను యూఏఈలో నిర్వహించాలని పీసీబీని ఐసీసీ కోరింది. ఐసీసీ ప్రతిపాదనకు పీసీబీ అంగీకరించలేదని తెలుస్తోంది. తమ ఆతిథ్య హక్కులను తగ్గిస్తే.. ఏకంగా టోర్నీని వీడాలని పాకిస్తాన్ నిర్ణయించుకున్నట్లు సమాచారం. అంతేకాదు ఇరు దేశాల మధ్య వివాదాలు పరిష్కారమయ్యే వరకు భారత్‌లో జరిగే ఏ ఐసీసీ ఈవెంట్లలోనూ పాల్గొనకూడదని పాక్ భావిస్తోందట. ప్రస్తుత పరిస్థితులను చూస్తే.. ఛాంపియన్స్ ట్రోఫీ 2025 నుంచి పాకిస్థాన్ వైదొలిగే అవకాశం ఉంది. హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించడానికి పీసీబీ అంగీకరించకపోతే.. టోర్నీ మొత్తాన్ని దక్షిణాఫ్రికాలో నిర్వహించే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం పాకిస్తాన్ ప్రభుత్వం, పీసీబీ మధ్య చర్చలు జరుగుతున్నాయని.. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా బోర్డు పనిచేస్తుందని ఓ పీసీబీ అధికారి తెలిపారు. 2012 నుండి దాయాది దేశాలు ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడలేదు. భారత్ వేదికగా జరిగిన ఐసీసీ వన్డే ప్రపంచకప్ 2023లో పాకిస్తాన్ ఆడిన విషయం తెలిసిందే. ఆసియా కప్‌ను పాకిస్థాన్‌లో ఆడేందుకు భారత్ నిరాకరించడంతో.. టీమిండియా మ్యాచులు శ్రీలంకలో జరిగాయి.



# నెమిలీ నగర్ వాస్తవ్యుల సంతోషం


**రాజేంద్ర నగర్ ప్రజా బలం ప్రతినిధి 12 నవంబర్ 2024** మణికొండ నెమిలినగర్ ప్రాంతంలో ప్రాజభిప్రాయ సేకరణలో భాగంగా స్థానిక బీ.ఆర్.ఎస్ నాయకులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్ళిన దరిమిలా స్పందించిన మునిసిపల్ అధికారులు వీధి దీపాలను ఏర్పాటు చేసినారని తెలియజేసిన గోరుకంటి విఠల్, సహదేవ్, తిరుపతయ్య, కృష్ణ అందుకు ప్రతి స్పందిస్తూ భారత రాష్ట్ర సమితి నాయకులు తమ సంతోషాన్ని వ్యక్త పరుస్తూ అధికారులకు ధన్యవాదములు తెలిపిన పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ్ల.

# సత్య దేవుని సన్నిధిలో ఎమ్మెల్యే పిఎస్ఆర్ సేవ కార్యక్రమాలు



**ప్రజాబలం దండేపల్లి మండల రిపోర్టర్ నవంబర్ 12** : మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి మండలంలోని గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి కార్తీక పౌర్ణమి జాతర సందర్భంగా దర్శనం కోసం వస్తున్న భక్తులకు కొక్కిరాల రఘుపతి రావు ట్రస్ట్ ఆధ్వర్యంలో మంచిర్యాల శాసన సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు పులిహోర మజ్జిగ మంచినీరు భక్తులకు అందజేస్తున్నారు.తేదీ 12-11-2024 మంగళవారం రోజు నుండి తేదీ 15-11-2024 శుక్రవారం జాతర ముగింపు వరకు ఇట్టి కార్యక్రమం కలదు ప్రతిరోజు వేలాది మంది భక్తులు స్వామి దర్శనార్థమై వస్తున్న సందర్భంగా వారికి ఎలాంటి ఇబ్బంది కలగకూడదని సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు.మొదటి రోజు దండేపల్లి మండలం కాసిపేట గ్రామ కమిటీ కాంగ్రెస్ నాయకులు సేవ కార్యం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రాజీవ్ గాంధీ పంచాయతీ సంఘటన మంచిర్యాల జిల్లా నాయకులు గడ్డం త్రిమూర్తి,యూత్ కాంగ్రెస్ నాయకులు లక్కాకుల సృజన్,సిరికొండ నవీన్,కాంగ్రెస్ పార్టీ నాయకులు,బత్తుల రమేష్ తోట రాజయ్య కోడి నరేష్ మాదాసు సత్యనారాయణ లక్కాకుల అనిల్ తర్ర లక్ష్మణ్ దాసరి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉసిరి చెట్టు క్రింద దీపారాధన చేసి...వనభోజనాలు ఎందుకు చేస్తారో తెలుసా..!!



**ప్రజబలం ప్రతినిధి హైదరాబాద్ :** కార్తీకమాసం వచ్చిందంటే చాలు వనభోజనాల కోసం ఉసిరిచెట్టు ఎక్కడవుందా అని జనులు అన్వేషిస్తుంటారు. ఈ మాసంలో ఎంతో పవిత్రమైనదిగా పూజించే ఉసిరి చెట్టు కింద ఒక్క పూటైన భోజనం చేయాలన్నది హైందవ సంప్రదాయం.

అందుబాటులో చెట్టు లేకపోతే దాని కొమ్మయినా వెంట తీసుకువెళ్ళి మరీ భోజనం చేస్తుంటారు. ఎందుకంటే కార్తీకమాసంలో శ్రీ మహావిష్ణువు, లక్ష్మీ దేవి ఇద్దరూ కొలువై ఉంటారన్నది విష్ణుపురాణ కథనం.

ఉసిరిని భూమాతగాను కొలుస్తారు. దేవదానవ సంగ్రామంలో కొన్ని అమృత బిందువులు పొరపాటున భూమ్మీద పడటంతో పుట్టిందే ఉసిరి అన్నది ఓ కథనం.

ఏది సకల మానవాళిని రక్షిస్తుందనీ విశ్వసిస్తారు. వృద్దాప్యాన్ని దరిచేరనివ్వని ఔషద మొక్కలలో ఉసిరికి ఉసిరే సాటి అని చెపుతుంది చరకసంహిత. అందుకే ప్రతి వ్యక్తీ తన జీవితకాలంలో ఐదు ఉసిరి చెట్లు నాటాలని చెబుతుంటారు.

సూత మహర్షి మునులందరితో కూడి నైమిశారణ్యంలో కార్తీక పౌర్ణమి నాడు ఉసిరి చెట్టు క్రింద వనభోజనాలను చేసినట్లు కార్తీక పురాణంలో వర్ణించబడినది.

ఉసిరి చెట్టు అనేక ఔషధ గుణాలను కల్గిన వృక్షం మరియు దామోదరునికి (శ్రీహరికి) అత్యంత ప్రీతిపాత్రమైన వృక్షం. అందుకే వనభోజనాలకు ఉసిరి చెట్టు నీడ శ్రేష్టం.

వనభోజనాల ప్రారంభానికి ముందు, ఉసిరి చెట్టు మొదట్లో విష్ణుమూర్తి పటాన్ని లేదా విగ్రహాన్ని ఉంచి, పూజించి ఆ తరువాత ఆనందంగా పెద్దలు, పిల్లలు, బంధువులు, మిత్రులతో కలసి వనభోజనాలను చేస్తారు.

శ్రీకృష్ణ భగవానుడు తన సోదరుడు బలరాముడితోను మరియు తోటి గోప బాలకులతో కలసి ఉసిరి మొదలైన మహా వృక్షాల నీడన యమునా నదీ తీరాన, బృందావనంలో అత్యంత ఆనందంగా వనభోజనాలను చేసాడని భాగవతంలో వర్ణించబడినది. ఉసిరిచెట్టు క్రింద శ్రీమహావిష్ణువును ఉసిరికాయలతో దీపారాధన చేసేవారిని చూడటానికి యమునికి కూడ శక్తి చాలదట. ఉసిరి చెట్లు ఉన్నతోటలో వనభోజనాలు చేస్తే వారి మహాపాతకాలు సైతం తొలగిపోతాయి. ధాత్రి అంటే ఉసిరిక. ఉసిరిక లక్ష్మీదేవికి ఆవాసమై ఎంతో ఇష్టమైనది. కార్తీకమాసంలో ఈ ఉసిరిక వృక్షం కింది భోజనం చేయడం ఎంతో అదృష్టాన్నిస్తుంది.

ఉసిరి వృక్షం మొదట్లో ధాత్రీదేవిని, దామోదర స్వామిని పూజించి, మధుర పదార్థాలను నివేదించాలి. బంధుమిత్రులతో కలిసి ఉసిరిక చెట్టు ఉన్న వనంలో భోజనాలు చేయడం వనభోజనాలుగా ప్రసిద్ధ

# సుమారు 80 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం సీజ్...



**మనోహరాబాద్, నవంబర్ 12 ( ప్రజాబలం న్యూస్):**మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల పరిధిలో అక్రమ పిడిఎస్ రైస్ రవాణా చేస్తున్నారని సమాచారం రాగ సివిల్ సప్లై, రెవిన్యూ డిపార్ట్మెంట్ మరియు పోలీస్ శాఖ వారు పిడిఎఫ్ రైస్ ను వెంబడించి పట్టుకొని స్వాధీన పరుచుకున్నారు. సుమారు 80 క్వింటాళ్ల బియ్యాన్ని బుస్స లింగం సూరారం జీడిమెట్ల వద్ద నుండి రెండు అశోక్ లేలాండ్ వెహికల్ ను ఏర్పాటు చేసి డ్రైవర్లు ద్వారా బియ్యాన్ని దండుపల్లి గ్రామంలో శివ అనే వ్యక్తికి అమ్మడానికి రాగ పట్టుకున్నామని సివిల్ సప్లై, రెవెన్యూ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేయడం జరుగుతుంది, పిడిఎస్ బియ్యాన్ని సివిల్ సప్లై వారు స్వాధీనం చేసుకోవడం జరిగింది. సేఫ్ కస్టడ్ నిమిత్తం 2 అశోక్ లేలాండ్ వెహికల్లను పోలీస్ కస్టడీకి అప్పగించామని మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్ గౌడ్ తెలిపారు.

# నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నవంబర్ 12:**సోమవారం వికారాబాదు జిల్లా, దుద్యల మండలం, లగిచెర్ల గ్రామంలో జిల్లా కలెక్టరు, అదనపు కలెక్టరు, ఇతర అధికారుల పై జరిగిన దాడిని వ్యతిరేకిస్తూ మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ లో బోజన విరామ సమయంలో జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి తో కలిసి తెలంగాణ గజిటెడ్ ఆఫీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాయంత్రాంగం, అధికారులు అందరూ నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు . ప్రభుత్వ ఉద్యోగస్తులకు, అధికారులకు భద్రత కల్పించాలని కోరారు. ఇటువంటి ఘటన వల్ల అభద్రత భావన కలుగుతుందని,ఈ దాడికి పాల్పడిన వారి పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, ఇటువంటి దాడులు పునరావృత్తం కాకుండా చూడాలని కోరారు.

# గుడిరేవు గ్రామం ఐకెపి కేంద్రాలను ప్రారంభించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్,ప్రేమ్ చంద్,వైస్ చైర్మన్ ఎండీ ఆరిఫ్



**ప్రజాబలం దండేపల్లి మండల రిపోర్టర్ నవంబర్ 12** : మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ సాగర్ రావు ఆదేశాల మేరకు దండేపల్లి మండలంలోని గుడి రేవు గ్రామంలో ఐకెపి కేంద్రాలను ప్రారంభించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేమ్ చంద్,వైస్ చైర్మన్ ఎండి ఆరిఫ్ తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కలిసి మంగళవారం రోజున ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ...దండేపల్లి మండలంలోని గుడి రేవు గ్రామంలో ఐకెపి కేంద్రాలను ప్రారంభించడం జరిగిందని రైతులకు ఎలాంటి కష్టం కలగకుండా ఐకెపి సెంటర్ వద్ద వడ్లను కొరడం జరుగుతుందని, దళారులను నమ్మి వడ్లు అమ్మ వద్దని తెలిపారు.రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐకెపి సభ్యులు,రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు,యూత్ నాయకులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు వెంటనే ఇవ్వాలి -సీఎం రేవంత్ కు టీడబ్ల్యూజేఎఫ్ విజ్ఞప్తి

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు తొలి టర్మ్ లోనే కేటాయించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలు, కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిన ప్రకారం జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీకి ఇండ్ల స్థలాలకు సంబంధించిన ఉత్తర్వులు ఇచ్చినందుకు తాము ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి దన్యవాదాలు తెలియజేస్తూనే, మిగతా జర్నలిస్టు సొసైటీలకు,సొసైటీలలో సభ్యత్వం లేని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు వెంటనే కేటాయించాలని కోరారు. దాదాపు 40 ఏండ్లుగా జర్నలిస్టులు ఇండ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్నారని వారు సీఎం రేవంత్ రెడ్డికి గుర్తు చేశారు. హైదరాబాద్ తో పాటు ఆయా జిల్లాలు, మండల కేంద్రాలలో ఇంకా వేలాది మంది జర్నలిస్టులు ఇండస్థలాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారని చెప్పారు. కొందరికి హౌసింగ్ సొసైటీల్లో సభ్యత్వం ఉందనీ, మరికొందరికి లేదని అన్నారు. వీరందరి కోసం ప్రభుత్వం ప్రత్యేక విధానం ద్వారా ఇండ్లస్థలాలు కేటాయించాలని వారు సూచించారు. జర్నలిస్టులు ఇప్పటికే ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సామాజిక బాధ్యతలు(సోషల్ రెస్పాన్సిబులిటీ) నిర్వహిస్తున్నారని చెప్పారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో జర్నలిస్టులు కీలకపాత్ర పోషిస్తున్నారని వివరించారు. ఈనేపథ్యంలో మ్యానిఫెస్టో ప్రకారం తొలి టర్మ్ లోనే జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాలని వారు సీఎంకు విజ్ఞప్తి చేశారు. రెండో టర్మ్ లో ఇస్తామని ముఖ్యమంత్రి చెప్పడం న్యాయం కాదని అన్నారు. ఇప్పటికే జర్నలిస్టులు ఇళ్ల స్థలాల విషయంలో తీవ్ర ఆందోళన చెందుతున్నారని, ఇంకా ఏ మాత్రం జాప్యం జరిగినా మరింత ఆందోళన చెందుతారని అన్నారు.ప్రభుత్వం వెంటనే స్థలాల గుర్తింపు ప్రక్రియ చేపట్టి అర్హులైన జర్నలిస్టులందరికీ ఈ టర్మ్ లోనే ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## నల్ల బ్యాడ్జీలతో నిరసన



**జమ్మికుంట ప్రజాబలం ప్రతినిధి నవంబర్ 12** సోమవారం నాడు వికారాబాద్ జిల్లా కలెక్టర్ మీద జరిగిన దాడిని ఖండిస్తూ జమ్మికుంట తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో గట్ల రమేష్ బాబు,డిటి శ్రీనివాస్,ఆర్ఐ శంకరయ్య లతో పాటు వీఆర్వోలు, వీఆర్ఏలు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మెదక్ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ మెదక్ లో ఉద్యోగాలు.

## లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ ,మరియు ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీ శారద




**మెదక్ 12 నవంబర్ ప్రజాబలం న్యూస్ :-**మెదక్ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ లో
స్టెనో/టైపిస్ట్- 1,
రికార్డు అసిస్టెంట్ -1,
ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, 13-11-2024 వ తేదీ నుంచి 23-11-2024 వ తేదీ వరకు దరఖాస్తును నేరుగా రిజిస్టర్ పోస్టు లేదా కొరియర్ ద్వారా డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మెదక్ కోర్టు సముదాయంలో అందించాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ మరియు ప్రధాన న్యాయమూర్తి లక్ష్మి శారద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

స్టెనో టైపిస్ట్ పోస్ట్ కు18 సంవత్సరాల నుండి 34 సంవత్సరాల వయసు కలిగి ఉండాలని, ఎస్సీ ,ఎస్టీ, బి సి డబ్ల్యూ ఎస్ అభ్యర్థులకు ఐదు సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాలు, ఎక్స్ సర్వీస్ మెన్ కు 12 సంవత్సరాల వయసు సడలింపు ఉంటుందన్నారు. గుర్తింపు పొందిన విద్యాలయం నుంచి డిగ్రీ కలిగి ఉండి, ఇంగ్లీష్ షాట్ హాండ్ లో 120 (%ష.జూ.ఎ%) డబ్ల్యూ పి ఎం స్పీడ్ లేదా ఇంగ్లీష్ హయ్యర్ గ్రేట్ టైపు రైటింగ్ లో 45 (%ష.జూ.ఎ%) డబ్ల్యూ పి ఎం స్పీడ్ కలిగిన వారు అర్హులన్నారు.

రికార్డ్ అసిస్టెంట్ పోస్ట్ కు పదవ తరగతి విద్యార్హత కలిగి ఉండాలని ,18 సంవత్సరాల వయసు నుంచి 34 సంవత్సరాల వయసు కలిగి ఉండాలని, వయసు సలింపు పై విధంగా అర్హులవుతారు అన్నారు. వచ్చిన దరఖాస్తుల (స్క్రూటీని అనంతరం ఈనెల 30న హాల్ టికెట్లు అందజేస్తారని,
7-12-2024 రోజున రాత పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.
అర్హత గల అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తు ఫారం తో పాటు ఓసి, బీసీ అభ్యర్థులు 800 రూపాయలతో డీడిని, ఎస్సీ ఎస్టీ కేటగిరి అభ్యర్థులు 400 రూపాయల డిడిని
“ ద సెక్రెటరీ డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మెదక్”
(%the secretary district legal services authority Medak%) పేరుమీద పంపాలన్నారు.
మరిన్ని వివరాల కోసం (%https://medak.dcourts.gov.in%/) సంప్రదించాలన్నారు.

## డబ్బులు స్వాహా చేసిన సహారా వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి -పోలీసులు న్యాయం చేయాలని వేడుకోలు




**ప్రజా బలం మందమర్రి మండల రిపోర్టర్ నవంబర్ 12 :**సహారాలో తను దాచుకున్న డబ్బును డిపాజిట్ చేయకుండా మోసం చేసిన సహారా ఏజెంట్ డి. శ్రీనివాసరావు, మేనేజర్ ఎస్. టి. రావులు చర్యలు తీసుకోవాలని బాధితుడు చిలుక సంజీవ్ అన్నారు. వివరాల్లోకి వెళితే మందమర్రి పట్టణంలోని రామన్ కాలనీకి చెందిన చిలుక సంజీవ్ మంగళవారం విలేకరుల సమావేశంలో తనగోడు వెళ్ళబోసుకున్నాడు. 2014 వ సంవత్సరంలో 2 లక్షల రూపాయలను సహరాలో ఆరు సంవత్సరాల కాలం వరకు ఫిక్స్ డిపాజిట్ చేసానన్నారు. 2020 వరకు 5,14,092 రూపాయలు వస్తాయని బాండు ఇచ్చారని తెలిపారు. గడువు తీరిన తరువాత నా డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా సహారా సెబి హ్యాండ్ వార్ లో ఉన్నాయని మాకేం సంబంధం లేదని ఏజెంట్ శ్రీనివాసరావు, మేనేజర్ ఎస్ టి రావు లు చెబుతున్నారని వాపోయాడు. దీనిపై అనుమానం వచ్చి హైదరాబాద్ జోనల్ ఆఫీస్ కి వెళ్లి కలవగా మాస్టర్ కాపీ, మెంబర్షిప్, అకౌంట్ ఓపెనింగ్ ఆన్లైన్లో లేవని తెలిపారు. తిరిగి నేను సి ఆర్ సి ఎస్ పోర్టల్ లో అప్లోడ్ చేయగా నా బాండ్స్ ఆన్లైన్లో కూడా లేవని నాకు తెలిసింది. ఇలాగే మందమర్రిలో ఉన్నటువంటి 90 శాతం మంది ఇదే పరిస్థితిలో అయోమయంలో ఉన్నారన్నారు. ప్రస్తుతం వీరిద్దరు చేసిన మోసం వల్ల నా ఆర్థిక పరిస్థితి చాలా దీనమైన స్థితిలో ఉందని పూట గడవడమే చాలా కష్టంగా మారిందన్నారు. ఈ విషయంపై స్థానిక మందమర్రి పోలీస్ స్టేషన్లో కూడా ఫిర్యాదు చేసినప్పటికి పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయంపై ఏజెంట్ డి శ్రీనివాసరావు మేనేజర్ ఎస్ టి రావులతో పాటు సహారా ఇండియా సంస్థపై చట్టపరమైన కేసులు నమోదు చేసి నా డబ్బులు నాకు ఇప్పించి అధికారులు న్యాయం చేయాలన్నారు.

## బొగ్గు గనుల పరిరక్షణకై 14న రౌండ్ టేబుల్ సమావేశం -సిపిఐ(యం) జిల్లా కమిటీ సభ్యుడు దూలం శ్రీనివాస్




**ప్రజాబలం మందమర్రి మండల రిపోర్టర్ నవంబర్ 12** :బొగ్గు గనుల వేలం పాటను రద్దు చేసి, సింగరేణికే బొగ్గు గనులను కేటాయించాలని కోరుతూ సిపిఐ(యం) ఆధ్వర్యంలో మందమర్రి పట్టణంలో ఈ నెల 14న రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని సిపిఐ (ఎం) జిల్లా కమిటీ సభ్యుడు దూలం శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈసమావేశంకు పట్టణంలోని మేధావులు, వివిధ పార్టీలు, ట్రేడ్ యూనియన్లు, కుల సంఘాలు, విద్యార్థి సంఘాలు, అన్ని వర్గాల ప్రజలు ఈ రౌండ్ టేబుల్ పాల్గొనాలని కోరారు. సింగరేణిని పరిరక్షించుకోవడానికి వారి వారి ఆలోచన విధానాలను, సలహాలను, సూచనలను తెలపాలన్నారు. దీనిపై కార్యరూపం తీసుకొని ముందుకు వెళ్లడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఈ రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పార్టీలకు అతీతంగా ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణిని మనందరం ఐక్యంగా కలిసి రక్షించుకుంటేనే రేపటి మన భవిష్యత్తుకు, మన పిల్లల భవిష్యత్తుకు భరోసా కోసం ఈ సమావేశానికి అందరూ రావాలని విజ్ఞప్తి చేసారు.

## గొర్రెల మందపై కుక్కలు దాడి 20 మూగజీవులు మృతి

చితలపాలెం పులిచింతల ప్రాజెక్ట్ కాలనీలో రాత్రి సమయంలో ఆనంగి వెంకయ్య దొడ్డి లో ఉన్న గొర్రెలపై రాత్రి కుక్కలు దాడి చేసాయి. కుక్కల దాడిలో 20 మేకలు, గొర్రెలు చనిపోవడం జరిగింది. తెల్లవారిన తర్వాత చనిపోయిన గొర్రెలను చూసిన యజమాని దుఃఖానికి గురైయాడు.

# 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో వివరాలు నమోదు చేసుకోవాలి ఓటర్ల జాబితా పరిశీలకులు సురేంద్రమోహన్




**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి నవంబర్ 12** : 01-01-2025 నాటికి 18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో తమ వివరాలు నమోదు చేసుకోవాలని ఓటర్ల జాబితా పరిశీలకులు సురేంద్రమోహన్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ కుమార్ దీపక్,జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల,బెల్లంపల్లి, చెన్నూర్ ఈ.ఆర్.ఓ.లు శ్రీనివాస్ రావు,హరికృష్ణ, డి.చంద్రకళ లతో కలిసి ఎన్నికల అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా పరిశీలకులు మాట్లాడుతూ...ఓటర్ల జాబితా సవరణకు ఇది మంచి సమయమని, ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని,స్పష్టమైన జాబితా రూపొందించడంలో రాజకీయ పార్టీల సహకారం అవసరమని అన్నారు. జాబితాలో రెండు / మూడు ఎపిక్ కార్డులు కలిగిన,చిరునామా మారిన,మరణించిన వారి వివరాలు మార్పులు, సవరణలు,తొలగింపులపై ప్రత్యేక దృష్టి సారించాలని, భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఒకే కుటుంబానికి సంబంధించి కుటుంబ సభ్యులందరి ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి వచ్చే విధంగా జాబితా రూపొందించాలని, వారాంతపు సమావేశాలు నిర్వహించి 2,3 వారాలలో ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.నూతన ఓటరు నమోదు,జాబితాలో మార్పులు,చేర్పులు, సవరణలు,తొలగింపులపై విస్తృత స్థాయి ప్రచారం నిర్వహించాలని,నూతన ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని,18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో నమోదు చేయాలని తెలిపారు. భారత ఎన్నికల సంఘం ఓటు నమోదు చేసుకునేందుకు జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1 తేదీలను ప్రామాణికంగా తీసుకుంటుందని, ప్రజలందరికీ తెలిసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని,ఇందులో భాగంగా డిగ్రీ కళాశాలల్లో క్యాంపస్ అంబాసిడర్లను నియమించి వారి ద్వారా ప్రచారం ముమ్మరం చేయాలని తెలిపారు.ఈ నెల 26వ తేదీన విద్యాసంస్థల విద్యార్థులు, యువతతో 2కె రన్ నిర్వహించడం జరుగుతుందని,స్వయం సహాయ సంఘాల సభ్యులతో సమావేశాలు నిర్వహించి,ఓటు ఆవశ్యకత,ఓటరు నమోదు,జాబితాలో మార్పులు ఇతర అంశాలపై ప్రజలకు వివరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ మాట్లాడుతూ...పబ్లిక్ గ్రీవెన్స్ సిస్టమ్ ద్వారా 397 దరఖాస్తులు రాగా అన్నింటిని పరిష్కరించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ముసాయిదా జాబితాపై ఫిర్యాదులు, అభ్యంతరాలను ఈ నెల 28వ తేదీ వరకు తీసుకోవడం జరుగుతుందని,డిసెంబర్ 24వ తేదీ లోపు పరిష్కరించడం జరుగుతుందని, జనవరి1,2025న తుది జాబితా ప్రచురణ కొరకు ఎన్నికల సంఘం అనుమతి పొంది 6వ తేదీన తుది జాబితా ప్రచురించడం జరుగుతుందని తెలిపారు.జిల్లాలో ముసాయిదా జాబితా ప్రకారం 3 లక్షల 23 వేల 278 మంది పురుషులు,3 లక్షల 29 వేల 924 మంది మహిళలు,45 మంది ఇతరులు,39 మంది ఎన్.ఆర్.ఐ.684 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారని, జిల్లాలో ఎన్నికల నిర్వహణ కొరకు 747 పోలింగ్ కేంద్రాలను గుర్తించడం జరిగిందని తెలిపారు. ఎస్.ఎస్.ఆర్.-2025 కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తూప్రాన్ పట్టణం దుకాణాల ముందు ఉన్న ఫుట్ పాత్ అక్రమిస్తే చర్యలు.

# ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు.




**తూప్రాన్, నవంబర్, 12. ప్రజాబలం న్యూస్ :**మెదక్ జిల్ల తూప్రాన్ పట్టణంలో దుకాణాల ముందు గల ఫుట్ పాత్ పై ఎలాంటి వస్తువులు కానీ, దుకాణాలు పెట్టడం దురాక్రమణగా పరిగణించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తూప్రాన్ మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం తన ఛాంబర్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు. ఫుట్ పాత్ నిర్మించింది కేవలం ప్రజలు నడువడానికేనని తెలిపారు. షాప్ యజమానులు ఈ విషయం గమనించి వెంటనే దుకాణం ముందు పెట్టిన వస్తువులను షాప్ లోపల పెట్టుకొని వ్యాపారం చేయాలని సూచించారు. ఒక వేళ అలాగే వస్తువులు పెట్టితే సీజ్ చేసి మున్సిపల్ సిబ్బందితో ట్రాక్టర్ లో తరలిస్తామని హెచ్చరించారు. అలాగే వ్యాపారులకు ముఖ్య సూచన చేస్తూ ఎవరు కూడా ప్లాస్టిక్ కవర్లు వాడకూడదని తెలిపారు. ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
ఈ పై విషయాల పై పోకస్ చేసి స్పెషల్ డ్రైవ్ చేసి ప్రతి దుకాణం షాప్ టు షాప్ తనిఖీలు చేపడతాం అని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ రఘువరన్ పాల్గొన్నారు.

## ఎడ్ల బల ప్రదర్శన పోటీలలో గెలుపొందిన వారికి బోడేపూడి ట్రస్టు ద్వారా 10,000 రూపాయలను అందజేసిన బోడేపూడి రాజా



**ఖమ్మం ప్రతినిధి నవంబర్ 12 (ప్రజాబలం)** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురం గ్రామము లో పాలేరు శాసన సభ్యులు తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం సమాచార శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి సౌజన్యంతో రైతు సంబరాలు ఒంగోలు జాతి ఎద్దుల బల ప్రదర్శన లో నాలుగో స్థానంలో గెలుపొందిన వారికి 10,000 రూపాయలను ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు బోడేపూడి రాజా బోడేపూడి ట్రస్టు ద్వారా అందజేశారు . ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు , జిల్లా నాయకులు మరియు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ స్పైస్ కిచెన్‌ను పరిశీలించిన హైడ్రా కమిషనర్

హైదరాబాద్, నవంబర్ 11: జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 1లో ఆదివారం వేకువజామున పేలుడు జరిగిన తెలంగాణ స్పైస్ కిచెన్‌ను క్షేత్ర స్థాయిలో సోమవారం పరిశీలించిన హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్‌గారు. పేలుడు దాటికి హోటల్ వెనుక భాగంలో ఉన్న గది, ప్రహరీ కూలి రాళ్లు, ఇనుప రాడ్లు, రేకులు వందమీటర్ల వరకు ఎగరడంతో పేలుడు తీవ్రతను పరిశీలించి.. కారణాలను తెలుసుకున్న హైడ్రా కమిషనర్.

# గ్రూప్-3 పరీక్ష సమర్థవంతంగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి 12 :** మంచిర్యాల జిల్లాలో ఈ నెల 17,18 తేదీలలో జరుగనున్న గ్రూప్-3 పరీక్షను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డి.సి.పి.ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, మంచిర్యాల ఎ.సి.పి. ప్రకాష్,బెల్లంపల్లి ఎ.ఆర్.ఎ.సి.పి. సుందర్,జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, రూట్ అధికారులతో కలిసి ముఖ్య పర్యవేక్షకులు, పరిశీలకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో గ్రూప్-3 పరీక్షను సమర్థవంతంగా నిర్వహించాలని, గ్రూప్-3 పరీక్ష నిర్వహణ కొరకు జిల్లాలో 48 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసి అధికారులు, సిబ్బందిని నియమించడం జరిగిందని తెలిపారు.17 వ తేదీన ఉదయం10 గంటల నుండి మధ్యాహ్నం12.30 గంటల వరకు,మధ్యాహ్నం 3.00 గంటల నుండి 5.30 గంటల వరకు,18 వ తేదీ ఉదయం10.00 గంటల నుండి మధ్యాహ్నం12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని,ఉదయం పరీక్షకు ఉదయం 9.30 గంటల నుండి, మధ్యాహ్నం పరీక్షకు 2.30 గంటలకు వరకు మాత్రమే పరీక్షా కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందని తెలిపారు.పరీక్షా కేంద్రంలోని ముఖ్య పర్యవేక్షకులకు మాత్రమే మొబైల్ అనుమతి ఉంటుందని,ఎవరికీ ఉండదని,ప్రశ్నాపత్రాలు,ఓ.ఎం.ఆర్.షీట్లు తరలించే రూట్లలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు.పరీక్షా సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని,శాఖ అధికారులుగా తహశిల్దార్/ఆపైన స్థాయి అధికారులను నియమించడం జరిగిందని,పరీక్ష ముందురోజు పరీక్షా కేంద్రానికి సందర్శించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు.కేంద్రంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, త్రాగునీటి వసతి కల్పించాలని,సి.సి. కెమెరాలు ఏర్పాటు చేయాలని,హాజరు పట్టికలు, ప్రశ్నాపత్రాలు, ఓ.ఎం.ఆర్.షీట్లను పరిశీలకులు పర్యవేక్షించాలని తెలిపారు.బయోమెట్రిక్ అటెండెన్స్ ఇవ్వకుండా ఏ అభ్యర్థి కూడా పరీక్ష కేంద్రం నుండి బయటకు వెళ్ళరాదని, ఒకవేళ వెళ్ళినట్లయితే అట్టి అభ్యర్థి ఓ.ఎం.ఆర్. షీట్ పరిగణలోకి తీసుకోబడదని తెలిపారు.పరీక్ష రోజున ఉదయం 7 గంటలకు జిల్లాలో ఏర్పాటు చేసిన ఆయా పరీక్షా కేంద్రాలకు సామాగ్రిని పంపిణీ చేయాలని, అభ్యర్థులు పాటించవలసిన నియమాలను హాల్ టిక్కెట్లపై కూడా ముద్రించడం జరిగిందని, అభ్యర్థులు ఈ నియమాలను తెలుసుకోవాలని తెలిపారు.పరీక్షా కేంద్రాలలో అత్యవసర వైద్య సేవల నిమిత్తం వైద్య సిబ్బందిని నియమించి అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని,పరీక్ష హాజరయ్యే దివ్యాంగ అభ్యర్థులకు గ్రౌండ్ ఫ్లోర్లో కేటాయించాలని తెలిపారు.డి.సి.పి.మాట్లాడుతూ...పరీక్ష నిర్వహణలో భాగంగా స్ట్రాంగ్ రూమ్ నుండి పరీక్షా కేంద్రాలకు ప్రశ్నాపత్రాలు, ఓ.ఎం.ఆర్. షీట్లు, సామాగ్రి తరలింపు ప్రక్రియ పోలీసు బందోబస్తు మధ్య జరుగుతుందని,పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులను అనుమతించే సమయంలో చేపట్టే తనిఖీలలో భాగంగా మహిళలకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. పరీక్ష కేంద్రంలోకి వచ్చే అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరు వారికి ఇచ్చిన గుర్తింపు కార్డును తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలని, ప్రహారీగోడకు సమీపంలో ఉన్న కిటికీలు మూసి ఉంచడం జరుగుతుందని తెలిపారు.పరీక్ష కేంద్రం సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో వివరాలు స్పష్టంగా నమోదు చేయాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి నవంబర్ 12 :** సామాజిక,ఆర్థిక, విద్య,ఉపాధి,రాజకీయ,కుల సర్వే ప్రక్రియలో జిల్లాలోని కుటుంబ సభ్యుల వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ మున్సిపల్ పరిధిలో గల13, 27 వార్డులలో సర్వే తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... సామాజిక,ఆర్థిక, విద్య,వైద్య, రాజకీయ,కుల సర్వే ప్రక్రియలో భాగంగా చేపట్టిన కుటుంబ సభ్యుల సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా కుటుంబ సభ్యుల వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన బ్లాక్లలో పూర్తి స్థాయిలో కుటుంబ సభ్యుల వివరాలు నిర్ణీత నమూనాలో స్పష్టంగా నమోదు చేయాలని, నమూనాలో ఉన్న అన్ని అంశాలను పూరించాలని తెలిపారు.సర్వే నిర్వహించే ప్రాంతంలో ముందు రోజు సంబంధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని,ఇంటి యజమానులు అవసరమైన పత్రాలతో హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి నవంబర్ 12** :ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికి అందించడంలో ముందుడి అహర్నిశలు కృషి చేసే ప్రభుత్వ ఉద్యోగులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నారు.రాష్ట్రంలోని వనపర్తి జిల్లా దుద్యాల మండలంలో భూ సేకరణలో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్ళి జిల్లా కలెక్టర్,అదనపు కలెక్టర్,ఇతర ప్రభుత్వ అధికారులపై జరిగిన దాడికి నిరసనగా మంగళవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు శ్రీనివాస్ రావు, హరికృష్ణ, భూ సేకరణ ప్రత్యేక అధికారి డి.చంద్రకళ, కలెక్టరేట్ ఎ.ఓ. రాజేశ్వర్,రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు,కలెక్టరేట్లోని వివిధ విభాగాల సిబ్బంది నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... నిరంతర ప్రజా సేవలో నిమగ్నమై పని చేసే ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులపై దాడి జరుగడం అమానుషమని, ఉద్యోగ భద్రతపై అధికారులు, ఉద్యోగులు మనోధైర్యం కోల్పోకుండా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా చట్టాలను మరింత పటిష్టం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు,సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి పొన్నం ను కలిసిన జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ



**హుజురాబాద్ ప్రజా బలం ప్రతినిధి నవంబర్ 12** జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్,వైస్ చైర్మన్ నియమితులైన పుల్లూరి స్వప్న-సదానందం,ఎర్రం సతీష్ రెడ్డి,డైరెక్టర్లను రాష్ట్ర బీసీ సంక్షేమ,రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్,హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన వ్యవసాయ కమిటీకి రైతులకు అందుబాటులో ఉంటూ రైతు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తిప్పారపు సంపత్, దేశిని కోటి, దొంత రమేష్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 24న కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో వన భోజన కార్యక్రమాలు



**ఖమ్మం ప్రతినిధి నవంబర్ 12 (ప్రజాబలం)** ఖమ్మం కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో ఈనాడు ఆఫీస్ దగ్గర్లో గల వెలుగుమట్లా పార్క్ లో ప్రెస్ మీట్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా కమ్మ సంఘం నాయకులు మీడియాతో మాట్లాడుతూ ప్రతి సంవత్సరము తాము చెరుకూరి మామిడి తోటలో వన భోజనాల కార్యక్రమాన్ని నిర్వహించే వాళ్ళమని అయితే ఈసారి వనభోజనాలు కార్యక్రమం వనంలో పెడితే బాగుంటుందన్న ఉద్దేశంతో తాము వెలుగుమట్ల పార్క్ లో ఈనెల 24వ తారీఖున వన భోజనాల కార్యక్రమాన్ని నిర్వహించ బోతున్నట్లుగా కాబట్టి కమ్మ సోదరులందరూ ఐక్యంతో సహకరించ వలసిందిగా కోరారు కార్యక్రమం సజావుగా సాగడానికి 20 నుండి 100 మంది తో కమిటీలను ఏర్పాటు చేశామని, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించనున్నామని ఖమ్మం జిల్లాలో ఉన్న తమ సామాజిక వర్గానికి చెందిన ప్రజా ప్రతినిధులను అధికారులను అందరినీ ఆహ్వానించామని రాజకీయ పార్టీలకు అతీతంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించ బోతున్నట్లుగా మీడియాకు తెలిపారు ఈ కార్యక్రమంలో వేజళ్ళ సురేష్ గుడవర్తి నాగేశ్వరరావు రావూరి సైదిబాబు గుడవర్తి నాగేశ్వరరావు మిక్కిలినేని నరేంద్ర నెల్లూరి కోటేశ్వరరావు పొట్ల వీరేందర్ సరిపుడి సతీష్ పలువురు సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు కొనసాగుతున్న 48 గంటల ఆందోళన

### జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం అందచేత

### సమస్యలు పరిష్కారం చేయకపోతే ఛలో ప్రజాభవన్ ముట్టడిస్తాం



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ నవంబర్ 12 :** ఐకేపీ వీవోఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని (సీఐటీయు) యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నస్పూర్ లోని జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు 48 గంటల మహాధర్నా రెండవ రోజుకు చేరింది.ఈ సందర్భంగా దుంపల రంజిత్ కుమార్ ఐకేపీ వీవోఏల ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మాట్లాడుతూ...ఐకేపీ వీవోఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలు మార్లు రాష్ట్ర మంత్రులకు, ఏమ్మెల్యే లకు వినతిపత్రాలు ఇచ్చిన ప్రభుత్వం స్పందించడం లేదు. అదే విదంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం రూ.20,000/-ల వేతనం ఇవ్వాలి.ఉద్యోగ భద్రత,ఆరోగ్య భీమా, పెన్షన్ సౌకర్యాలు కల్పించాలి.అధికారుల వేధింపులు ఆపాలి.గ్రేడింగ్ విధానం రద్దు చేయాలి.సోషల్ అడిట్ ను రద్దు చేయాలి.ప్రభుత్వం మా సమస్యలు పరిష్కారం చేయకపోతే ఛలో హైదరాబాద్ ప్రజా భవన్ ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం.ఈ కార్యక్రమంలో కుంటాల కుమార్, దుర్గం రాములు ఐకేపీ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, పొట్ట పోశం జిల్లా కోశాధికారి, జిల్లా కమిటీ సభ్యులు రజిత,అనిత,శారదా, మహేష్,దాసు,వెంకటి,సమ్మన్న,తుకారాం, రాజ్యలక్ష్మి,భాగ్య లక్ష్మి,అనూష,లక్ష్మన్, సురేష్,రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com